

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

‘ఐడిబిఐ ప్రైవేటీకరణ’ను మానుకోవాలి 07

జర్మనీ ప్రదర్శనల్లో లూటీలు, హింస 08

సంపుటి 29, సంచిక: 133 | సోమవారం | 02-11-2026 | హైదరాబాద్ Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** పేజీలు: 12 | వెల రూ. 5.00



ప్రధాని తప్పించుకోవాలనుకున్నా

వదలబోం

సిఇసి జ్ఞానేశ్‌కుమార్ జైలుకే

తరువాత మోదీ, అమిత్ షా వంతు
ర్యాలీలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఉద్ఘాటన
ప్రధానిని సాగనంపాలి, రాజ్యాంగాన్ని కాపాడాలి : ఖర్గే

న్యూఢిల్లీ : ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో జరిగిన ‘వోట్ బచావో, దేశ్ బచావో’ ర్యాలీలో, ఎన్నికల అవకతవకలు, ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఆరోపణలపై బిజెపి నేతృత్వంలోని కేంద్రం,ఎన్నికల సంఘంపై ఇండియా కూటమి నేతలు ఐక్యంగా విమర్శల వర్షం కురిపించారు. ప్రజాస్వామ్య హక్కులను బిజెపి అణగదొక్కుతోందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి ఐక్య పోరాటం చేస్తామని హెచ్చరించారు. జ్ఞానేశ్ కుమార్‌పై ప్రతిపక్షాలు చేపట్టిన ప్రజా అభిశంసన చర్య తర్వాత ఈ భారీ ర్యాలీ జరిగింది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య తదితర సీనియర్ నాయకులు ఇక్కడ రామ్‌లీలా మైదాన్ ర్యాలీకి హాజరయ్యారు. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూ దేశంలో ఎన్నికల వ్యవస్థను నాశనం చేసినందుకు భవిష్యత్తులో సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, దేశద్రోహం కింద జైలుకు

తరువాయి 8లో



రామ్‌లీలా మైదాన్





ఇండియా కూటమి ర్యాలీ

‘ఓట్ బచావ్.. దేశ్ బచావ్’ నినాదాలతో దద్దరిల్లిన ఢిల్లీ

- ఓపెన్ టాప్ బస్సులో నేతల ప్రదర్శన
- జనసంద్రంగా మారిన రామ్‌లీలా మైదాన్
- జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ కదం తొక్కిన ఇండియా కూటమి కార్యకర్తలు
- లక్షలాది మందితో కిటకిటలాడిన రాజధాని నగరం
- డ్రోన్లు, వందల సిసి కెమెరాలతో నిఘా
- నాలుగు వేలమంది పోలీసులు మోహరింపు

ఢిల్లీలో ‘ఇండియా’ రణగర్జన

‘ఇండియా’ ర్యాలీ, సభ గ్రాండ్ సక్సెస్

న్యూఢిల్లీ : ఓట్‌చోరీకి వ్యతిరేకంగా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తూ ఢిల్లీలో జరిగిన ఓట్ బచావ్, దేశ్ బచావ్’ ‘‘మహార్యాలీ ఆసేతు హిమాచల మంతటా ప్రజాప్రభంజనానికి దర్పణం పట్టింది.ఇండియా కూటమి’’ నాయకులు ఆదివారం మధ్యాహ్నం రామ్‌లీలా మైదాన్ వైపు లక్షలమంది ప్రజలు మహార్యాలీ చేశారు.మింటో రోడ్–కన్నాట్‌ప్లేస్ జంక్షన్ నుండి భారీసంఖ్యలో ఇండియా కూటమి పార్టీల నాయకులు,కార్యకర్తలు మహాప్రవాహంగా ప్రదర్శనలో తరలివెళ్ళారు.జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు,బ్యానర్లు,త్రివర్ణ పతాకాలతో కార్యకర్తలు కదం తొక్కారు. మోదీ వ్యతిరేక ప్లకార్డులు ప్రదర్శించారు.రామ్‌లీలా మైదాన్ ప్రాంతమంతా జనసముద్రంగా మారింది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీవాద్రా,భారత కమ్యూనిస్టుపార్టీ(సిపిఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా,సిపిఐ(ఎం) నాయకుడు ఎం.ఎ.బేబీ,సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య,సమాజ్‌వాదీపార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్,తృణమూల్ కాంగ్రెస్ నాయకులు మమతాబెనర్జీ,అభిషేక్ బెనర్జీ,జెకెఎన్‌సి నాయకుడు ఫారూఖ్ అబ్దుల్లా,పిడిపి నాయకురాలు మెహబూబా ముఫ్తీ తదితరులు ఈ భారీ ర్యాలీలో పాల్గొన్న ప్రముఖులలో ఉన్నారు.ఈ నాయకులు,కార్యకర్తలంతా ముందుగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే నివాసం వద్దకు టాపు లేని బహిరంగ వాహనాల్లో బయలుదేరారు. అక్కడి నుండి వారు రామ్‌లీలా వైపు పయనమయ్యారు.అక్కడ భారీ ర్యాలీలో పాల్గొంటారు.ఈ భారీ ర్యాలీలో ఎటుచూసినా మోదీ వ్యతిరేక బ్యానర్లు,ఓట్ చోటీ ప్లకార్డులు కనిపించాయి.రహదారిపై ప్రదర్శన ఒక ప్రవాహంలా గోచరించింది.మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతం నుండే రామ్‌లీలా మైదానం వద్దకు ఇండియా కూటమికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు వరద ప్రవాహంలా పోటెత్తారు. ముఖ్యంగా యువకులు పెద్దసంఖ్యలో ఈ ర్యాలీల్లో పాల్గొన్నారు.ప్రతిఒక్కరూ వివిధ నినాదాలతో ప్లకార్డులను ప్రదర్శించారు.ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణను నిలిపివేయాలని వారు నినాదాలు చేశారు.ఎన్నికల ప్రధాన కమిషనర్

తరువాయి 12లో

మహార్యాలీ మరిన్ని ఫొటోలు 12లో

400 సీట్లు ఇవ్వనందుకే

ఓటు తొలగించే యత్నం

మోదీని ఓడించేందుకు కాంగ్రెస్ వానర సైన్యం పోరాటం
విజయం సాధించేవరకూ విశ్రమించబోం
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్

గత 2024 ఎన్నికల్లో ప్రజలు బిజెపికి 400ల ఎంపి సీట్లను ఇవ్వకపోవడంతోనే పేదలు, దళితులు, గిరిజనులు, మహిళలపై కక్ష పెంచుకుని, వారి ఓటు హక్కును తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆరోపించారు. కులాలు, మతాల పేరుతో ప్రజలను విభజించి రెండు సార్లు అధికారంలోకి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, 2024 ఎన్నికల్లో 400 సీట్లు దాటితే, రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్లు రద్దు చేయాలని, దళితులు, గిరిజనులు, మహిళల ఓట్ల తొలగించాలని భావించారన్నారు. ‘ఇండియా కూటమి’ ఆధ్వర్యంలో

తరువాయి 8లో

తరుముకొస్తున్న ‘మురసు’

బలపడిన తీవ్ర అల్పపీడనం


భువనేశ్వర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ఆదివారం ‘మురసు’ తుఫాన్‌గా బలపడింది. దీంతో ఒడిశా ప్రభుత్వం రాష్ట్రంలోని దక్షిణ ప్రాంతంలో ముందస్తు జాగ్రత్త చర్యలను ముమ్మరం చేసింది. భారత వాతావరణ శాఖ (ఐఎండి) తన తాజా బులెటిన్‌లో ఆదివారం ఉదయం 11:30 గంటలకు ఈ తుఫాన్ నైరుతి, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమమధ్య బంగాళాఖాతం ప్రాంతంలో కేంద్రీకృతమై ఉందని పేర్కొంది. ఈ తుపాను 12.1ఓ ఉత్తర అక్షాంశం, 85.3ఓ తూర్పు రేఖాంశం వద్ద ఉంది. ఇది చెన్నైకి తూర్పుఆగ్నేయంగా సుమారు 560 కి.మీ, విశాఖపట్నానికి దక్షిణఆగ్నేయంగా 660 కి.మీ, నెల్లూరుకు తూర్పుఆగ్నేయంగా 630 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ తుఫాన్ పశ్చిమవాయవ్య దిశగా పయనిస్తూ, నవంబర్ 2 ఉదయానికి పశ్చిమమధ్య బంగాళాఖాతంలో

తరువాయి 8లో

పది నిమిషాల్లో ఇరాన్ అణుక్షేత్రాలు ధ్వంసం

మొజ్తాబా ఖమేనీ ప్రకటనకు ట్రంప్ తీవ్ర ఆగ్రహం

మార్–ఎ–లాగో : మళ్ళీ యుద్ధం ప్రారంభిస్తే శత్రువులకు దీటుగా సమాధానం చెప్పాలని ఇరాన్ సర్వోన్నతాధిపతి మొజ్తాబా ఖమేనీ తన సేనలను ఆదేశించడంతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.‘‘ఇరాన్ ఇప్పటికే నాశనమైంది,ఆ దేశంలో అన్ని అణుకేంద్రాలను ధ్వంసంచేశాం,ఇంకా రెండు అణుకేంద్రాలు మిగిలిపోయాయి,పిక్‌యాక్స్ పర్వతం కూడా మా దాడి లక్ష్యాల్లో ఉంది,మేం తల్చుకుంటే ఈ రెండు అణు క్షేత్రాలపై పది నిమిషాల్లో దాడి చేయగలం’’ అని ట్రంప్ హెచ్చరించారు.ఫ్లోరిడాలోని మార్–ఎ–లాగో నివాసంలో ట్రంప్ ఆదివారంనాడు మీడియాతో మాట్లాడుతూ,ఇరాన్ సైన్యంతో పాటు నౌకాదళం,వైమానికదళాలను తీవ్రస్థాయిలో అమెరికా సెంట్‌కామ్ ఇప్పటికే బలహీనపరిచిందని,ఇంకా పిక్‌యాక్స్ మౌంటెన్ వంటి లక్ష్యాలు మిగిలి ఉన్నాయని చెప్పారు.ఇరాన్ దగ్గర ఉన్న కీలకమైన అణువస్తువులను పిక్‌యాక్స్ పర్వతగుహల్లో దాచినట్లు నిఘా వర్గాల అంచనా.‘‘ఇరాన్‌పై ఎప్పుడు దాడి చేయాలనే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు,



తరువాయి 8లో

రెండు భావనలు, ఒక సాహిత్య ప్రపంచం

'మార్వెలస్ రియలిజం', 'మేజికల్ రియలిజం'..

సాహిత్యంలో కొన్ని భావనలు ఒకదానికొకటి ఎంత దగ్గరగా కనిపించినా, వాటి వెనుక ఉన్న తాత్విక దృక్పథాలు, చారిత్రక నేపథ్యాలు, సాంస్కృతిక మూలాలు వేర్వేరుగా ఉంటాయి. 'మార్వెలస్ రియలిజం', 'మేజికల్ రియలిజం' అలాంటి రెండు భావనలు. సాధారణంగా ఈ రెండింటినీ ఒకే సాహిత్య ప్రక్రియకు చెందిన పేర్లుగా వ్యవహరిస్తుంటారు. రెండింటిలోనూ వాస్తవిక జీవితంతోపాటు అద్భుతమైన, అతీంద్రియ అంశాలు సహజంగా మిళితమై ఉంటాయి. అయినప్పటికీ, వాటి మధ్య ఒక కీలకమైన తేడా ఉంది. ఒకటి లాటిన్ అమెరికా ప్రత్యేక చారిత్రక, సాంస్కృతిక అనుభవాల నుంచి పుట్టిన భావన కాగా, మరొకటి ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన విస్తృతమైన కథన ధోరణి. ఈ రెండు భావనల మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా వాటి పుట్టుకను పరిశీలించాలి. 'లో రియల్ మారవియోసో' అనే భావనను, 1949లో క్యూబాకు చెందిన ప్రముఖ రచయిత అలెహో కార్పెంటియర్ ప్రతిపాదించాడు. దీన్నే 'మార్వెలస్ రియలిజం'గా వ్యవహరిస్తారు. లాటిన్ అమెరికా చరిత్ర, భౌగోళిక స్వరూపం, సంస్కృతి, మత విశ్వాసాలు, సామాజిక జీవనంలోనే అద్భుతం అంతర్భాగంగా ఉందని కార్పెంటియర్ అభిప్రాయపడ్డాడు. అక్కడి జీవితాన్ని యథార్థంగా చిత్రించాలంటే అద్భుతాలను ప్రత్యేకంగా కల్పించాల్సిన అవసరం లేదని, ఆ ప్రాంత వాస్తవికతలోనే అవి సహజంగా ఉన్నాయని ఆయన వాదన. లాటిన్ అమెరికా నాగరికత అనేక సంస్కృతుల సంగమంతో రూపుదిద్దుకుంది. ఆదివాసీ సంప్రదాయాలు, ఆఫ్రికన్ వారసత్వం, స్పానిష్, పోర్చుగీస్ వలస సంస్కృతులు కలిసి అక్కడి సమాజానికి ప్రత్యేకమైన గుర్తింపునిచ్చాయి. ఈ సాంస్కృతిక కలయికను 'మెస్టిజాజే'గా, పేర్కొంటారు. దీనిని కేవలం జాతుల కలయికగా చూడడం సరికాదు. ఎందుకంటే, ఇది భాషలు, మతాలు, విశ్వాసాలు, జీవన విధానాలు, ప్రపంచాన్ని చూసే దృక్పథాల సమ్మేళనం కూడా. ఈ సమాజాల్లో ప్రకృతికి, పూర్వీకులకు, ఆత్మలకు, జానపద విశ్వాసాలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఒకే సంఘటనను హేతువాద దృష్టితో చూసేవారు ఒక విధంగా అర్థం చేసుకుంటే, స్థానిక సంప్రదాయాల నేపథ్యంలో చూసేవారు మరో విధంగా అనుభవిస్తారు. ఈ రెండు అనుభవాలూ అక్కడి జీవన వాస్తవికతలో భాగాలే. కార్పెంటియర్ ఉద్దేశం కూడా ఇదే. యూరోపియన్ సాహిత్య సంప్రదాయాలు అద్భుతాన్ని తరచుగా కల్పనగా సృష్టిస్తే, లాటిన్ అమెరికా సమాజంలో అది ఇప్పటికే జీవన అనుభవంలో ఉందని ఆయన గుర్తించాడు. అందువల్ల మార్వెలస్ రియలిజంలో అద్భుతం రచయిత సృష్టించిన మాయాజాలం కాదు. ఒక నిర్దిష్ట ప్రాంతపు చరిత్ర, సంస్కృతి, విశ్వాసాల నుంచి సహజంగా ఉద్భవించే వాస్తవికతలోని మరో పార్శ్వం.

ఇక, మేజికల్ రియలిజం విషయానికి వస్తే, అది ప్రపంచాన్ని ఆవహించిన కథన ధోరణి. అది ప్రాంతీయ పరిధిని దాటి ప్రపంచ సాహిత్యంలో విస్తరించిన విస్తృతమైన కథన పద్ధతి. వాస్తవిక ప్రపంచంలో అతీంద్రియ లేదా అద్భుత సంఘటనలను ఎలాంటి ప్రత్యేక వివరణ లేకుండా సహజంగా ప్రవేశపెట్టడం దీని ప్రధాన లక్షణం. ఈ కథనంలో మాంత్రిక సంఘటనలకూ, సాధారణ జీవితానికీ సమానమైన ప్రాధాన్యం ఉంటుంది. రచయిత వాటిని ఒకే ప్రశాంతమైన స్వరంతో వివరిస్తాడు. విమర్శకులు ఈ లక్షణాన్ని 'స్యూమ్యులస్ ఈక్వివలెన్స్' అనే భావనతో వివరిస్తారు. అంటే అద్భుతానికీ, సాధారణ వాస్తవానికీ కథనంలో ఒకే స్థాయి సహజత్వం కల్పించడం. కాగా, మార్వెలస్ రియలిజం, మేజికల్ రియలిజం మధ్య తేడాను ప్రధానంగా మూడు కోణాల్లో చూడవచ్చు. మొదటిది వాటి చారిత్రక, సాంస్కృతిక మూలాలు. మార్వెలస్ రియలిజం ప్రత్యేకంగా లాటిన్ అమెరికా చరిత్ర, సంస్కృతి, భౌగోళిక వాస్తవికతతో ముడిపడి ఉంది. మేజికల్ రియలిజం మాత్రం ఒక ప్రాంతానికి పరిమితం కాకుండా ప్రపంచంలోని అనేక సాహిత్య సంప్రదాయాల్లో కనిపిస్తుంది. రెండోది 'అద్భుతం' పట్ల వాటి తాత్విక దృక్పథం. మార్వెలస్ రియలిజంలో అద్భుతం ఆ ప్రాంతపు భౌతిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రపంచంలో నిజంగానే అంతర్భాగంగా ఉందనే భావన ప్రధానమైనది. మేజికల్ రియలిజంలో మాత్రం అద్భుతాన్ని, సాధారణ జీవితాన్ని సమానమైన కథన స్వరంతో చిత్రించడం ముఖ్యం. కథ ఎక్కడ జరిగినా ఈ పద్ధతిని అనుసరించవచ్చు. మూడోది వాటి సాహిత్య పరిధి. మార్వెలస్ రియలిజం ఒక నిర్దిష్ట సాంస్కృతిక అనుభవం నుంచి పుట్టిన భావన. మేజికల్ రియలిజం ఆ అనుభవాన్ని దాటి విస్తరించిన ప్రపంచ సాహిత్య ధోరణి. ఈ నేపథ్యంలో మార్వెలస్ రియలిజాన్ని మేజికల్ రియలిజానికి ప్రాంతీయ, చారిత్రక పునాదిగా చూడవచ్చు. ఈ రెండు సాహిత్య భావనలను పరస్పర విరుద్ధాలుగా చూడటం ఎంత తప్పో, పూర్తిగా ఒకటేనని భావించడం కూడా అంతే సరి కాదు. వీటి మధ్య సన్నిహిత సంబంధం ఉంది. రెండూ వాస్తవికతను కేవలం కంటికి కనిపించే ప్రపంచానికే పరిమితం చేయవు.



మార్వెలస్ రియలిజం అనే భావనను క్యూబాకు చెందిన రచయిత అలెహో కార్పెంటియర్ 1949లో ప్రతిపాదించారు. స్పానిష్లో 'లో రియల్ మారవియోసో' గా వ్యవహరించే ఈ భావనకు ప్రధానమైన తాత్విక పునాది ఏమిటంటే, అద్భుతం అనేది రచయిత కల్పనలో సృష్టించాల్సిన విషయం కాదు; కొన్ని సమాజాల చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక జీవనంలో అది సహజంగానే అంతర్భాగంగా ఉంటుంది.

మార్వెలస్ రియలిజం ప్రధానంగా అద్భుత వాస్తవికతను గుర్తించే తాత్విక దృక్పథమైతే, మ్యాజికల్ రియలిజం ఆ అద్భుతాన్నీ సాధారణ జీవితాన్నీ ఒకే కథనంలో మేళవించే విస్తృత సాహిత్య పద్ధతిగా పరిణామం చెందింది. అయితే ఈ రెండింటి మధ్య సరిహద్దులు ఎప్పుడూ కచ్చితంగా ఉండవు. అనేక రచనల్లో ఈ లక్షణాలు పరస్పరం కలిసిపోతాయి. అందువల్ల వాటిని పూర్తిగా వేర్వేరు గదుల్లో బంధించడం కంటే, వాటి చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాలను అర్థం చేసుకోవడం ముఖ్యం. ఈ భేదాన్ని సాహిత్య విమర్శకులు సౌందర్యాత్మక దృక్పథం, అస్తిత్వ సంబంధమైన దృక్పథం మధ్య తేడాగా కూడా విశ్లేషించారు. ప్రపంచ భాషల్లో మార్వెలస్ రియలిజం ఈ కథన ధోరణి ప్రపంచవ్యాప్తంగా విభిన్న సాంస్కృతిక రూపాలను సంతరించుకుంది. ఆఫ్రికా సాహిత్యం ఇందుకు ఒక ముఖ్యమైన ఉదాహరణ. నైజీరియాకు చెందిన డిఓ ఫాగున్వా యోరుబా జానపద సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలు, మానవ జీవితంలోని సంక్లిష్టతలను తన రచనల్లో మేళవించారు. అదే దేశానికి చెందిన అమోస్ టుటువోలా స్థానిక మౌఖిక కథన సంప్రదాయంలోని అద్భుత ప్రపంచాన్ని ఆంగ్ల రచనల్లోకి తీసుకొచ్చారు. సియెర్రా లియోన్ రచయిత సిల్ చెనీకోకర్, ఘనా రచయిత కోజో లాయింగ్ రచనల్లోనూ ఆఫ్రికన్ చరిత్ర, స్థానిక విశ్వాసాలు, రాజకీయ వాస్తవాలు విభిన్న కథన రూపాల్లో వ్యక్తమయ్యాయి. మొజాంబిక్‌కు చెంది న మియా కౌటో పోర్చుగీస్ భాషలో రాస్తూ ఆఫ్రికన్ మౌఖిక సంప్రదాయాలు, ప్రకృతి, సామూహిక జ్ఞాపకాలను ఆధునిక కథనంతో అనుసంధానించారు. ఆయన రచనల్లో మనిషికీ ప్రకృతికీ మధ్య ఉన్న సంబంధం కేవలం భౌతికమైనది మాత్రమేగాక, ఆధ్యాత్మికమైనదిగానూ ఆ విష్కృతమవుతుంది. కెన్యాకు చెందిన న్గూగీ వా థియోం గో గికుయు జానపద విశ్వాసాలు, వలసవాద చరిత్ర, రాజకీయ వ్యంగ్యాన్ని తన రచనల్లో మేళవించారు. ఈ రచయితల సాహిత్యాన్ని కేవలం మ్యాజికల్ రియలిజం అనే ఒకే పదంతో నిర్వచించడం కంటే, వాటి వెనుక ఉన్న స్థానిక జ్ఞాన సంప్రదాయాలను గుర్తించడం అవసరం. దక్షిణాఫ్రికాకు చెందిన బెస్సీహెడ్ రచనల్లో వ్యక్తిగత మానసిక సంఘర్షణలు, సామాజిక అణచివేత, ఆధ్యాత్మిక అనుభవాలు కలిసిపోతాయి. టర్కీ రచయిత్రి లతీఫె టెకిన్ గ్రామీణ జీవితంలోని జానపద విశ్వాసాలు, సామాజిక మార్పులు, పేదరికం వంటి అంశాలను అసాధారణమైన కథన భాషలో ఆవిష్కరించారు. ఇరాన్ రచయిత్రి షహర్నుష్ పార్సీపూర్ రచనల్లో మహిళల అనుభవాలు, సామాజిక నియంత్రణలు, కల్పనాత్మక, అతీంద్రియ అంశాలు ఒక ప్రత్యేకమైన సాహిత్య ప్రపంచాన్ని నిర్మిస్తాయి.

భారతదేశం ఇలాంటి సాహిత్య ప్రక్రియలకు అపారమైన సాంస్కృతిక వనరు. ఇక్కడి పురాణాలు, జానపద గాథలు, ఆదివాసీ కథనాలు, గ్రామదేవతల సంప్రదాయాలు, పూర్వీకుల ఆరాధన, ప్రకృతితో ముడిపడిన విశ్వాసాలు ఎన్నో శతాబ్దాలుగా ప్రజల జీవనంలో భాగంగా ఉన్నాయి. బెంగాలీ, మలయాళం, కన్నడ, తమిళం, మరాఠీ, ఒడియా, అస్సామీ, తెలుగు వంటి భాషల్లో స్థానిక విశ్వాసాలు, సామాజిక వాస్తవాలు, అద్భుత అనుభవాలు కలిసిన కథనాలు కనిపిస్తాయి. ప్రత్యేకించి ఆదివాసీ సాహిత్యంలో అడవి కేవలం చెట్ల సముదాయంతోపాటు, పూర్వీకుల జ్ఞాపకాల నిలయం, జీవనాధారం, ఆధ్యాత్మిక ప్రపంచం కూడా దర్శనమిస్తుంది. నదులు, కొండలు, జంతువులు, పక్షులు మనుషుల జీవితాలతో సంభాషించే జీవశక్తులుగా కనిపిస్తాయి. ఈ అనుభవాలను బయటి నుంచి వచ్చిన హేతువాద ప్రమాణాలతో మాత్రమే అంచనా వేయడం వాటి సాంస్కృతిక ప్రాముఖ్యతను తగ్గించినట్లవుతుంది. స్థానిక సమాజాల ప్రపంచ దృక్పథాన్ని గౌరవిస్తూ రచనలు చేయగలిగితే భారతీయ భాషల్లో ఈ కథన ప్రక్రియ మరింత వైవిధ్యాన్ని సంతరించుకుంటుంది. నేటి ప్రపంచం అనేక సంక్షోభాలను ఎదుర్కొంటోంది. ప్రపంచీకరణ, వలసలు, యుద్ధాలు, మతపరమైన సంఘర్షణలు, పర్యావరణ విధ్వంసం, ఆర్థిక అసమానతలు, సాంకేతిక పరిణామాలు మనిషి జీవితాన్ని సంక్లిష్టంగా మారుస్తున్నాయి. ఈ పరిణామాలను సంప్రదాయ వాస్తవిక కథన పద్ధతులతో మాత్రమే పూర్తిగా వ్యక్తీకరించడం కొన్నిసార్లు సాధ్యం కాకపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో మార్వెలస్ రియలిజం, మ్యాజికల్ రియలిజం రచయితలకు కొత్త వ్యక్తీకరణ అవకాశాలను అందిస్తాయి. ముఖ్యంగా పర్యావరణ సంక్షోభాన్ని చిత్రించడానికి ఈ ప్రక్రియ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఒక నది తన ఒడ్డున నివసించిన తరతరాల ప్రజల చరిత్రను గుర్తుంచుకుంటున్నట్లుగా, ఒక అడవి తన విధ్వంసానికి కారణమైన మనుషులను ప్రశ్నిస్తున్నట్లుగా, ఒక కొండ తనలో దాగిన గిరిజన నాగరికత జ్ఞాపకాలను వెల్లడిస్తున్నట్లుగా రచయిత కథను నిర్మించవచ్చు. ఇలాంటి రూపకాలు పర్యావరణ సమస్యను కేవలం గణాంకాలుగా కాకుండా మానవీయ, సాంస్కృతిక సంక్షోభంగా పాఠకుడికి చేరువ చేస్తాయి. అలాగే వలసలు, స్థానభ్రంశం, కులవివక్ష, జాతి వివక్ష, మహిళల అణచివేత వంటి సమస్యలను కూడా ఈ కథన పద్ధతిలో విభిన్నంగా ఆవిష్కరించవచ్చు. చరిత్రలో మరుగునపడిన ప్రజల గొంతుకలకు, అధికారిక చరిత్రలో చోటు దక్కని అనుభవాలకు సాహిత్యంలో స్థానం కల్పించవచ్చు. గతం వర్తమానంతో మాట్లాడేలా చేయడం, సామూహిక జ్ఞాపకాలను సజీవంగా నిలపడం ఈ ప్రక్రియకు ఉన్న ప్రధానమైన సామర్థ్యం. అయితేఐ ప్రతి అద్భుత సంఘటనను మార్వెలస్ రియలిజంగా పరిగణించకూడదు. కేవలం దెయ్యాలు, మంత్రాలు, అసాధారణ సంఘటనలు ఉన్నంత మాత్రాన ఒక రచన ఈ ప్రక్రియకు చెందదు. వాటికి కథలోని సామాజిక వాస్తవికతతో, పాత్రల సాంస్కృతిక అనుభవాలతో, రచయిత ప్రతిపాదించే అంతరార్థంతో సహజమైన సంబంధం ఉండాలి. స్థానిక విశ్వాసాలను కేవలం వినోదం కోసం ఉపయోగించడం కాకుండా వాటి వెనుక ఉన్న జీవన తాత్వికతను అర్థం చేసుకోవాలి. 'వాస్తవం అనేది కేవలం శాస్త్రీయంగా నిరూపించగలిగిన విషయాల సమాహారం మాత్రమే కాదు. మానవ సమాజాల అనుభవాలు, సాంస్కృతిక జ్ఞాపకాలు, స్థానిక విశ్వాసాలు, చారిత్రక గాయాలు కూడా వాస్తవికతను అర్థం చేసుకోవడంలో కీలకమైనవి' అనే పాఠాన్ని మ్యాజికల్ రియలిజంతోపాటు మార్వెలస్ రియలిజం కూడా మనకు అందిస్తుంది. ఈ దృక్పథం శాస్త్రీయ ఆలోచనను తిరస్కరించదనే విషయాన్ని ఇక్కడ ప్రస్తావించి తీరాలి. వాస్తవాన్ని అర్థం చేసుకోవడానికి ఒకే ఒక్క దృష్టికోణం సరిపోదని, ప్రపంచంలోని విభిన్న సమాజాల అనుభవాలను వాటి స్వంత సాంస్కృతిక సందర్భాల్లో అర్థం చేసుకోవాలని సూచిస్తుంది. మారుతున్న ప్రపంచంలో ఎలాంటి ప్రాధాన్యతలకు నోచుకోని ప్రజల జీవితాలను, కనుమరుగవుతున్న సంస్కృతులను, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని, చరిత్రలో మిగిలిపోయిన గాయాలను కొత్త కథన భాషలో వ్యక్తీకరించడానికి ఇవి శక్తిమంతమైన సాధనాలు. సాహిత్యం వాస్తవాన్ని యథాతథంగా ప్రతిబింబించడమే కాకుండా, దాని వెనుక దాగి ఉన్న అనేక అర్థాలను వెలికితీయాలి. ఆ బాధ్యతను నెరవేర్చడంలో మార్వెలస్ రియలిజం, మేజికల్ రియలిజం కీలక పాత్ర పోషించగలవు. వాస్తవికతకు అద్భుతాన్ని జోడించడం ఈ ప్రక్రియల ప్రత్యేకత కాదు; అద్భుతంలోనూ వాస్తవాన్ని గుర్తించడం వాటి అసలైన గొప్పతనం. అందుకే ఇవి కేవలం సాహిత్య ప్రయోగాలు కావు. ప్రపంచాన్ని మరింత విశాలంగా, బహుముఖంగా, మానవీయంగా అర్థం చేసుకునేందుకు దోహదపడే సృజనాత్మక దృక్పథాలు.

— సత్యశ్రీ

తెలుగు సరస్వతికి సాహితీ గొడుగు

సినిమా కవిత్వాన్నీ, సంప్రదాయ కవిత్వా న్నీ తెలుగు సాహితీ మాగాణంలో జోడెడ్లుగా సమంగా కదం తొక్కించి సాహితీ సే ద్యం చేసిన గొప్ప కలికుడు (కలం కారుడు) హాలికుడు... మహాకవి దాశరథి కృష్ణమాచా ర్య. సుమారు 80 ఏళ్ళ నాడే ప్రత్యేక తెలంగా ణ రాష్ట్ర ఆవిర్భావానికి...'నా తెలంగాణ కోటి రతణాల వీణ' అని ఎలుగెత్తి అక్షర రణ నినా దం చేసి విను వీధుల్లో తెలంగాణ సమర పతాకాన్ని పాతి... తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి మంతుడై బాటలు వేశాడు. ఇదే క్రమంలో తెలుగు భారతికి ముద్దుల పుత్రుడిగా... సకలాంధ్ర కవిగా, ప్రపంచానా ప్రథమ శ్రేణి నలంకరించిన మహాకవిగా ప్రసిద్ధి కెక్కా డు. 1925 జులై 22న మహబూబాబాద్ జిల్లా (ఉమ్మడి వరంగల్ జిల్లా) చిన్న గూడూరులో సనాతన సంప్రదాయ వైష్ణవ కుటుంబంలో జ్యేష్ఠ పుత్రుడిగా దాశరథి కృష్ణమాచార్య జన్మించాడు. ఈయన అనంతరం ప్రముఖ కవి, పండితుడు దాశరథి రంగాచార్య జన్మించాడు. తండ్రి వెంకటాచార్య గొ ప్ప కవి, పండితుడు. తల్లి వెంకటమ్మ గొప్ప హరికథ భాగవతారిని.



నవంబర్ 5
దాశరథి కృష్ణమాచార్య వర్ధంతి

దాశరథి ఉర్దూలో మెట్రిక్యులేషన్ (పదవ తరగతి), భోపాల్ విశ్వవిద్యాలయంలో ఇం టర్మీడియట్, ఉస్మానియా విశ్వ ద్యాలయంలో బిఏ. (ఇంగ్లీషు) చదివాడు. తెలుగు, ఉర్దూల్లో మంచి పండితుడైనా సంస్కృతం, ఆంగ్లంలో కూడా మంచి పట్టును సాధించాడు. తండ్రి స్ఫూర్తితో చిన్న నాటనే వ్యాకరణ సహిత చందోబద్ధ పద్య కవిత్వం రాశాడు. ఆయన ఆధు నిక భావాలు, ప్రజాపక్షం నిలిచి అక్షర గర్జన చేసే నిర్భయ, నిర్మొహమాట గంభీర మూర్తిమంతుడు కావడం చేత నిజాం నవాబు అరాచక, అవినీతి, అక్రమ పాలనను సహించ లేక పోయాడు. ఈనేపథ్యంలో నిజాం జాగిర్దారి నిరంకుశ విధానాలను ప్రతిఘటించడానికి గార్లలో గొప్ప ప్రజా ఉద్యమాన్ని ప్రభంజనంగా నడిపాడు. 1947లో హైద్రాబాద్లో నిజాం వ్యతిరేక ప్రజా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న దాశరథిని వరంగల్, నిజామాబాద్, హైద్రాబాద్ చంచల్‌గూడ జైళ్ళలో వేశారు. నిజామాబాద్ జైలు లో ఉండగా... పళ్ళు తోముకోడానికి ఇచ్చిన బొగ్గును కలంగా చేసుకొని, 'ఓనిజాము పిశాచమా! కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని!...', 'మానిజాం రాజు తర తరాల బూజు... ముస లి నక్కకు రాచరికమా?' అంటూ ఎద్దేవా చేస్తూ ప్రశ్నిస్తూ జైలు గోడలపై అక్ష ర పిడుగులు రాలుస్తూ, రణ నినాదాలు చేస్తూ 'నాతెలంగాణ కోటి రతణాల వీణ అంటూ ఎలుగెత్తి చాటుతూ రాశాడు. ఇందుకు ఆయన ఘోరంగా దెబ్బ లు తిన్నాడు. హైదరాబాద్ సంస్థానానికి 1948 సెప్టెంబర్ 17న స్వతంత్రం వచ్చాక, జైలు నుంచి విడుదలయిన అనంతరం దాశరథి తొలుత ఉపాధ్యాయుడుగా పని చేశాడు. అనంతరం పంచాయతీ ఇన్స్‌పెక్టర్, ఆకాశవాణి ప్రయోక్త వంటి ఉద్యోగాలు చేశాడు. నిజాం వ్యతిరేక ఉద్యమం నడిపి జైళ్ళ పాలయినా... వివిధ ఉద్యోగాలు చేసినా... ఆయన కవితా ప్రవృత్తిని మాత్రం మరువ లేదు. పైగా కవిగా లబ్దప్రతిష్ఠులయ్యాడు. కథలూ, నవలలూ,నాటికలూ, పద్యకావ్యాలూ, గేయాలూ, కవితలూ, గజల్స్, ఇలా సాహిత్యం లోని అన్ని ప్రక్రియల్లో గొప్ప రచనలు చేశాడు. ఈక్రమంలో దాశరథికి సినిమా పాటల రచనపై మక్కువ కలిగింది. అగ్ర హీరో అక్కినేని నాగేశ్వరరావు దృష్టి లో పడ్డారు. తెలంగాణ మరో మహాకవి సి.నారాయణరెడ్డి అగ్రహీరో ఎన్‌టిఆర్ ప్రోత్సాసంతో, 'గులేబకావళి' చిత్రంలో పూర్తి పాటలు రాసి ప్రసిద్ధుడైతే, ఎఎన్ఆర్ సిఫార్సుతో ఆత్రేయ 'వాగ్దానం' చిత్రంలో అవకాశమిస్తే, 'నా కంటి పాపలో నిలిచి పోరా' గీతాన్ని రాసి సినీ వినీలాకాశంలో తన జెండా పాతాడు. అనంతరం అక్కినేని తన సొంత చిత్రం 'ఇద్దరు మిత్రులు'లో అవకాశం ఇవ్వగా 'ఖుషీ ఖుషీగా నవ్వుతూ' పాట రాసి హిట్ కొట్టి శిఖరాగ్రానికి చేరుకున్నాడు. అప్పటి వరకు తెలుగు సినిమా పాటల రచనల్లో ఆంధ్ర రచయితల ఆధిపత్యం ఉండేది. తెలంగాణ నుంచి దాశరథి, సినారె ప్రవేశంతో అది పోయింది. సినీ గీతాల రారాజులుగా వారిరువురు వెలిగారు. వివిధ రసాలను మేళవించి, ఆణిముత్యాల్లాంటి ఎన్నో సినిమా పాటలు రాసి తెలుగు సినిమా ప్రేక్షకులను ఓలలాడించాడు. ఒకవైపు సినిమా రంగంలో తీరిక లేకుండా ఉన్నప్పటికీ, తన రచనా వ్యాసాంగాన్ని దాశరథి ఆపలేదు. 'అగ్నిధార', 'రుద్రవీణ', 'మహాబోధి', 'నాగార్జున చరిత్ర', 'పునర్నవం', 'మహేంద్రోదయం', 'మహ శిల్పి జక్కన్న' (నవల), 'కవితా పుష్పకం', 'అమృతాభిషేకం', 'గాలిబ్ గీతాలు' వంటి పలు రచనలు వెలువ రించారు. 'కవితా పుష్పకం' కావ్యానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు ను దక్కింది. 1981లో ఆంధ్ర విశ్వవిద్యాలయం దాశరథికి డాక్టరేట్ ఇచ్చింది. 1977 ఆగస్టు 15 నుండి 1983 వరకు ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవిగా గొప్ప గౌరవాన్ని పొందాడు. మడమ తిప్పని, రాజీపడని స్వాతంత్ర్యోద్యమ పోరాట పటిమ, అకుంఠిత దేశభక్తి, మహోన్నత కవితా సామర్థ్యాలతో శిఖరాగ్రానికి ఎదిగిన దాశరథి, తన జీవిత మహా ప్రస్థానాన్ని దిగ్విజయంగా ముగించుకొని 1987 నవంబర్ 5న తన 62 ఏళ్ళ వయసులో మహాభినిష్క్రమణ చెందాడు.

— తాళ్ళపల్లి యాదగిరి గౌడ్, 9949789939

ఈ వారం కవితలు

' కూలని కంచెలు '

నెత్తి మీద టోపీతో
నొసలు మీది బొట్టుతో
హిందూ, ముస్లింలుగా
కనపడ్డ ఇద్దరినినెత్తిన టోపీ,
నొసలు మీది బొట్టు తీసేసి
ఫోటువా తీత్తే ఇద్దరూ మనుషులు
గనే వచ్చిండ్లు మతమేది రాలే అండ్ల
సచ్చిపోయిన మా సారయ్య తాత
బొందను, సాయబ్ తాత కబర్
తవ్వి సూశిన భూమిలో ఇద్దరి
బొక్కలు మాత్రమే మిగిలినవి
మతమేది కనపల్లే వాళ్ళ సమాధులల్ల

ఎద్దు తునకల కోసం
మా తాత దగ్గరికి వచ్చి
ఇద్దరు కాయిసుగా కాల్చుకుతున్న
కమ్మటి వాసన జ్ఞాపకం
గుండె గది నిండా పరుసుకుంది
ఆటలాడేటప్పుడు
'అన్నా అన్నా ' అంటూ
మా ఎనకాలే తిరిగేటి అన్ను గాడు
పని మీద ఊరికి పోతే
'తమ్ముడా' అని ప్రేమగా పిలిసి
ఇంటికి పట్టుకపోయి బువ్వ పెట్టిన
అన్వర్ అన్న, పాషా,
రష్యు, ఇస్మాయిల్ గాడు
అందరం గూడి గోళీలాట ఆడింది
భూలచ్చిమి కాడి చింత చెట్టుకిందే!
బడికి పోతే ముద్దుగున్ననని
ఒళ్లే కూసోబెట్టుకుని పాఠం చెప్పిన
షాజియా టీచర్
రోగమచ్చిందని దవాఖానకు పోతే
మందుగోలిలిచ్చి ప్రేమగా నెత్తి
దువ్వే పాషా డాక్టర్
బాబీ రవ్వన్న మా తోడబుట్టిన
అన్నలెక్కంటూ ఇంట్ల
మనిషిలెక్కనే కలేతిరిగిన

బబ్బులు , పాషా బాబాయిలు
బాపు, చాచా, భాయ్ , సాలె ,
అమ్మి, దీదీ, అంటూ
ప్రేమగా పిలుసుకున్న మనుషులనే
ఇప్పుడు ప్రమాదకారులుగా
ఎందుకు చూపెడుతున్నారు?!
గండ శిలలతో పేర్చిన గోడలనైనా
పారో పలుగో వాడి పెకిలించవచ్చు
కాదంటే మందుపాతర పెట్టీ
పేల్చనూవచ్చు కానీ...
కనపడని ఈ కంచెలను కూల్చే
మందేదో కానత్తలేదు...

దిలీప్.వి

'ఊరు కొమ్మ'

ఊరు కొమ్మ ఎండిపోయి
పల్లెవృత్తులన్నీ
పట్నం బాట పట్టినయి
కొత్త పెళ్లికూతురులా
సింగారించుకొన్నవి

వావి వరసల మాటలకు నీళ్ళొదిలి
సార్ మేడం అంటూ పెద్దపీట వేస్తున్నయి
ఏ రోజు వెలుతురును
ఆ రోజే దులుపుకుంటున్న
జీవితము చీకటి కొమ్మకే చిక్కుకుంది
ఎంత పోగేసుకున్నా
కొనవోతే కొరివే అయితుంది.
చీకటిని ఎంత దంచినా
వెలుతురు జాడలేదు

ఊర్లో ఉన్నప్పుడు కలోగంజో
తాగి కాలం ఎల్లా తీసేటోళ్ళం
ఏదున్నా లేకున్నా ఊరు కడుపున
పెట్టుకొని చూసుకునేది

పట్టణంలో ఎక్కిరించే
నోరులే ఎక్కువైనవి పులిని చూసి
నక్క వాతలు పెట్టుకున్నట్లు ఉంది
కాలమేమో కాకపాయె
కంటతడి ఎండిపాయే కాలమోచ్చె
ఏం చేస్తే ఎంగిలి పడతమోఎమో
నువ్వన్నా కనికరించవే కాలమా
అభివృద్ధి గొడ్డలితో ప్రకృతిని
గాయపరిచినమని మనసున పెట్టుకోకు

గుండెల్లి ఇస్తారి, 9849983874

ప్రజల పక్షాన నిలిచిన అక్షరాలకు 'ప్రజాకవి మల్లావర్ఝుల' పురస్కారం

తెలంగాణ సాహిత్య చరిత్రలో ప్రజల జీవితాలను ప్రతిబింబించిన కవిత్వానికి, సామాజిక అన్యాయాలను ప్రశ్నించిన రచనలకు, మరుగున పడిన చరిత్రను వెలుగులోకి తెచ్చిన పరిశోధనలకు విశిష్టమైన స్థానం ఉంది. ఈ సాహిత్య వారసత్వానికి ప్రతీకగా నిలిచిన ప్రజాకవి 'మల్లావర్ఝుల సదాశివుడు' పేరుతో తెలంగాణ వికాస సమితి అందిస్తున్న స్మారక సాహిత్య పురస్కారాలకు 2024–25 సంవత్సరానికిగాను ప్రముఖ కవి, కథా రచయిత డా. చెమన్, 2025–26 సంవత్సరానికిగాను ప్రముఖ సాహిత్య విమర్శకుడు, పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాస్ ఎంపికయ్యారు. విభిన్న సాహిత్య ప్రక్రియల్లో కృషిచేస్తున్న ఈ ఇద్దరినీ ఒకే స్మారక పురస్కారంతో గౌరవించడం వెనుక అర్థవంతమైన సాంస్కృతిక సందేశం ఉంది. ఒకరు ప్రజల సమకాలీన జీవిత సంఘర్షణలను సృజనాత్మకంగా ఆవిష్కరిస్తే, మరొకరు తెలంగాణ సాహిత్య చరిత్రలో విస్మృతమైన అధ్యాయాలను వెలికితీస్తున్నారు.

ప్రజల గొంతుక... మల్లావర్ఝుల

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ముర్మూర్ గ్రామంలో జన్మించిన మల్లావర్ఝుల సదాశివుడు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే కవిగా, గాయకుడిగా, ఉద్యమకారుడిగా ప్రజల మధ్య జీవించారు. కులవివక్ష, సామాజిక అసమానతలు, దళితులపై కొనసాగుతున్న వివక్షను ప్రశ్నిస్తూ తన రచనలను సామాజిక చైతన్యానికి సాధనంగా మలిచారు. గోదావరి పరివాహక ప్రాంత రైతుల జీవితాలు, సింగరేణి కార్మికుల కష్టాలు, అణగారిన వర్గాల ఆత్మగౌరవ ఆకాంక్షలు ఆయన పాటల్లో ప్రతిధ్వనించాయి. 'తలాపున పారుతుంది గోదారి' అంటూ సాగే ఆయన ప్రసిద్ధ గేయం తెలంగాణ జీవితంలోని మౌలిక వైరుధ్యాన్ని ఆవిష్కరిస్తుంది. అపారమైన ప్రకృతి సంపద ఉన్నప్పటికీ దాని ఫలాలు ప్రజలకు అందని పరిస్థితిని ప్రశ్నిస్తుంది. ప్రజల భాషలోనే ప్రజల బాధను పలికించడం సదాశివుడి ప్రత్యేకత. తెలంగాణ మాండలికంలోని సహజత్వం, నుడికారం ఆయన పాటలకు జీవం పోశాయి. 'ఎర్రకుంకుమ' పాటల సంకలనం, 'సైరన్' వచన కవితా సంపుటి ఆయన సాహిత్య నిబద్ధతకు నిదర్శనాలు. దళిత ఆత్మగౌరవం, ప్రజాస్వామిక విలువలు, సామాజిక సమానత్వం కోసం ఆయన సాగించిన సాహిత్య, ఉద్యమ ప్రయాణం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చింది.

మల్లావర్ఝుల సదాశివుడి ప్రాంతానికే చెందిన పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం కుమ్మరికుంట గ్రామంలో జన్మించిన డా. చెమన్ వైద్యవృత్తిని కొనసాగిస్తూనే సాహిత్య, సామాజిక రంగాల్లో చురుకుగా పనిచేస్తున్నారు. విద్యార్థి దశ నుంచి విప్లవ విద్యార్థి ఉద్యమాలు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వరకు వివిధ ప్రజా ఉద్యమాలతో ఆయనకు అనుబంధం ఉంది. తెలంగాణ విద్యావంతుల వేదిక, తెలంగాణ రచయితల వేదిక వంటి సంస్థల ద్వారా తెలంగాణ ఆకాంక్షలకు మద్దతుగా నిలిచారు. గోదావరి ప్రాంతం, సింగరేణి బొగ్గు గనుల నేపథ్యంలో ఆయన కవిత్వం రూపుదిద్దుకుంది. భూగర్భంలో ప్రాణాలను పణంగా పెట్టి సమాజానికి వెలుగునిచ్చే కార్మికుల జీవితాల్లోని చీకట్లు ఆయనను కదిలించాయి. 'ఎడారి స్వప్నం మ ధ్య', 'ఆవిష్కరించని దృశ్యం' వంటి కవితా సంపుటుల్లో జీవిత సంఘర్ష ణ లు, సామాజిక అసమానతలు, ఆశలు, నిరాశలు, మానవ సంబంధాల సంక్లిష్టత వ్యక్తమవుతాయి. ప్రకృతి దృశ్యాలను, ప్రతీకలను సామాజిక వాస్తవికతను ఆవిష్కరించే సాధనాలుగా ఉపయోగించడం ఆయన శైలిలోని ప్రత్యేకత.

యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం రఘునాథపురంలో 1965 అక్టోబరు 10న జన్మించిన సంగిశెట్టి శ్రీనివాస్ తెలంగాణ సాహిత్య పరిశోధనకు విశేషమైన సేవలందించారు. ప్రముఖ రచయితలకే పరిమితం కాకుండా పాత పత్రికలు, విస్మృత రచయితలు, తొలి కథలు, ప్రాంతీయ సాహిత్య సంప్రదాయాలను వెలికితీయడంలో ఆయన కృషి ప్రశంసనీయం. 'షబ్నవీస్', 'దస్తుమ్', 'తెలంగాణ సాయుధ పోరాటం ఒక సబాల్టర్న్ దృక్కోణం', 'ఇంగితం' వంటి గ్రంథాలు ఆయన పరిశోధనా విస్తృతిని తెలియజేస్తాయి. ముఖ్యంగా తెలంగాణ పత్రికా చరిత్ర, తొలి తెలుగు పత్రికలు, కథా సాహిత్య వికాసం వంటి అంశాలపై ఆయన చేసిన పరిశోధనలు ప్రాంతీయ సాహిత్య చరిత్రకు విలువైన ఆధారాలను అందించాయి. విస్తృత దృక్పథంతో తెలంగాణ సాహిత్యాన్ని అధ్యయనం చేయడం సంగిశెట్టి ప్ర త్యేకత. పరిశోధకుడిగా, సంపాదకుడిగా, అనువాదకుడిగా, రచయితగా ఆయన అందించిన సేవలకు పలు సాహిత్య పురస్కారాలు లభించాయి. డా.చెమన్, సంగిశెట్టి శ్రీనివాస్ రచనా మార్గాలు భిన్నమైనప్పటికీ వారి లక్ష్యంలో సామాజిక బాధ్యత ప్రధానంగా కనిపిస్తుంది. అందుకే, ఈ ఇద్దరి ఎంపికలో మల్లావర్ఝుల సదాశివుడి సాహిత్య వారసత్వం ప్రతిఫలిస్తోంది. ఆవిలువలను తమ తమ రంగాల్లో కొనసాగిస్తున్న సాహితీవేత్తలకు ఆయన పేరుతో పురస్కారాలు అందించడం సముచితమైన నిర్ణయం. ప్రజల జీవితాలను పలికించే రచనలు, వారి చరిత్రను వెలుగులోకి తెచ్చే పరిశోధనలు కొనసాగినప్పుడే తెలంగాణ సాహిత్య వారసత్వం మరింత సుసంపన్నమవుతుంది. అదే మల్లావర్ఝుల సదాశివుడికి నిజమైన నివాళి.

డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

నవలా పురస్కారం కోసం ..

తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో, శ్రీమతి భూతం విమల స్మారక నవలా పురస్కారం (2027) కోసం 2024, 2025, 2026 సంవత్సరాలలో ప్రచురితమైన సామాజిక స్పృహ కలిగిన నవలలను (మూడు కాపీలు) ఆహ్వానిస్తున్నాం. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచంలో తెలుగు నవలా రచయితలు ఎవరైనా పోటీకి నవలలు పంపవచ్చు.

నవలలు పంపవలసిన చివరి తేదీ డిసెంబర్ 15, 2026.
ఎంపికైన ఉత్తమ నవల రచయితకు.. 5116/ నగదు బహుమతితో పాటు సముచిత సత్కారం ఉంటుంది.

రచనలు పంపవలసిన చిరునామా

భూతం ముత్యాలు, 4-11-117/1
చైతన్యపురి కాలనీ రోడ్డు నెంబర్ 2
గంధంవారి గూడెం రోడ్డు నల్లగొండ, తెలంగాణ
7893033077

కవితల పోటీ

చిన్నినారాయణరావు సాహితీ ఫౌండేషన్ -(నెల్లూరు),- 'పాలపిట్ట' సంయుక్త ఆధ్వర్యంలో కవితల పోటీ.

ఒక కవిత చదవగానే తెలియని అనుభూతితో మనసు పరవశించాలి. వస్తువు ఏదయినా దాని వ్యక్తీకరణలో నవ్యత ఉట్టిపడాలి. పాఠకులలో భావోద్వేగ తీవ్రతను ప్రోది చేయాలి. ఇలాంటి కవిత్వాన్ని ప్రోత్సహించాల న్న లక్ష్యంతో చిన్నినారాయణ రావు సాహితీ ఫౌండేషన్, పాలపిట్ట సంయుక్తంగా కవితల పోటీని నిర్వహించాలని సంకల్పించాయి. ఈ పోటీకి సకల ప్రాంతాల వారు తమ కవితలను పంపించవచ్చు.

బహుమతులు

ప్రథమ బహుమతి: రూ.5,000, **ద్వితీయ బహుమతి:** రూ.3,000, **తృతీయ బహుమతి:** రూ. 2,000. ఒక్కొక్క కవితకు రూ. 500 చొప్పున మరో పది కవితలకు ప్రత్యేక బహుమతులు
కవితలు పంపడానికి చివరి తేదీ: 30 నవంబర్ 2026.
ఫలితాల ప్రకటన: 20 డిసెంబర్ 2026.

నిబంధనలు

కవితా వస్తువు ఏదన్నది కవుల అభీష్టం. కాదేదీ కవితకు అనర్హం. కనుక మీరు రాయకుండా ఉండలేక రాసిన కవితలను ఈ పోటీకి పంపించవలసిందిగా మనవి. కవితా వస్తువు ఏదయినా అభివ్యక్తి సంవిధానం వినూత్నంగా ఉండాలి. ఎంచుకున్న వస్తువును చక్కని కవితగా మార్చే కౌశలం, ప్రతిభా సంపత్తులకు పోటీలో ప్రాధాన్యం ఉంటుంది. పోటీకి పంపించే కవితలు పూర్తిగా కొత్త కవితలయి ఉండాలి. ఇదివరకు ఎక్కడ ప్రచురితం, ప్రసారితమై వుండరాదు. అలాగే వాట్సాప్‌లో, బ్లాగ్‌ల్లో, సోషల్ మీడియా వేదికల్లో పోస్టు చేసి వుండకూడదు. ఈ పోటీకి పంపించిన కవితలను పోటీ ఫలితాలు వచ్చే వరకు ఎక్కడా పోస్టు చేయరాదు, ప్రచురించ రాదు. ఈ సహనం వున్నవారు మాత్రమే పోటీకి తమ కవితలు పంపించాలి. పోటీలో ఎంపికయిన కవితలు 'పాలపిట్ట'లో ప్రచురితమవుతాయి. ఒక్కొక్కరు ఒక కవిత మాత్రమే పోటీకి పంపించాలి. దీర్ఘకవితలు పరిశీలించబడవు. కవితల ఎంపికలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం. దీనిపై ఎలాంటి వాద వివాదాలకు తావు లేదు.

కవితలు పంపించాల్సిన చిరునామా

ఎడిటర్, పాలపిట్ట
ఫ్లాట్ నెం: 3, బ్లాక్-6
ఎం.ఐ.జి-2, ఎపిహెచ్‌బి, బాగ్ లింగంపల్లి
హైదరాబాద్ - 500 044
ఫోను: 94900 99327
palapittamag@gmail.com

బిసిల కోసం ప్రత్యేక కాలమ్

• టిఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న జనగణనలో ఒబిసి కులాల నమోదుకు ప్రత్యేక కాలమ్‌ను కేటాయించాలని, ఆదివాసీల మతాన్ని ప్రత్యేకంగా నమోదు చేయాలనే అంశాలపైన శాసనసభ, శాసనమండలి ప్రత్యేక సమావేశాలను తక్షణమే నిర్వహించాలని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒబిసిలకు ప్రత్యేక కాలమ్, ఆదివాసీల మత నమోదుపై ఉభయ సభల్లో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించేందుకు సిఎం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఆమె సిఎం ఎ.రేవంత్ రెడ్డికి ఆదివారం బహిరంగ లేఖ రాశారు. దేశంలో అత్యధిక జనాభా కలిగిన ఒబిసిల నుంచి ప్రస్తుత జనగణన ప్రక్రియపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని, స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినప్పటికీ ఒబిసిలకు జనాభా దామాషా ప్రకారం దక్కాల్సిన ఫలాలు అందడం లేదని, వారి సంఖ్యకు సంబంధించి ఎలాంటి చట్టబద్ధమైన లెక్కలు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. జనగణనలో కులం కాలమ్ ఉన్నప్పటికీ, ఒబిసిలను ప్రత్యేకంగా గుర్తించే అవకాశం లేకపోవడంతో వారిని ఇతర కులాల జాబితాలోకి చేర్చే పరిస్థితి ఏర్పడిందన్నారు.

ఆయిల్‌పామ్ రంగంలో తెలంగాణ సరికొత్త చరిత్ర

• ప్రాసెసింగ్‌లో 44.60 శాతం వృద్ధి.. రైతులకు రూ.1,100 కోట్ల చెల్లింపులు
• ప్రభుత్వ రంగంలో తొలి ఆయిల్‌పామ్ రిఫైనరీ ఏర్పాటుకు శ్రీకారం



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు, ప్రాసెసింగ్ రంగాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. రైతులకు మెరుగైన ఆదాయం కల్పించడంతో పాటు పారిశ్రామిక మౌలిక సదుపాయాలను విస్తరించే దిశగా తెలంగాణ కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ (టిజి ఆయిల్‌ఫెడ్) గణనీయమైన పురోగతి సాధించింది. 2025–26 సంవత్సరంలో గెలల ప్రాసెసింగ్‌లో 44.60 శాతం వృద్ధిని నమోదు చేయడంతో పాటు రైతులకు రూ.1,100 కోట్ల చెల్లింపులు చేసి రికార్డు సృష్టించింది. గత ఏడాది 3.27 లక్షల మెట్రిక్ టన్నుల గెలలను ప్రాసెస్ చేసిన సంస్థ.. ఈ ఏడాది 4.74 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచి ంది. అదనంగా 1.46 లక్షల మెట్రిక్ టన్నుల ప్రాసెసింగ్ చేపట్టింది. రోజువారీ ప్రాసెసింగ్ సామర్థ్యం 1,850 మెట్రిక్ టన్నులకు చేరగా, నెలవారీ ప్రాసెసింగ్ 50,150 మెట్రిక్ టన్నులుగా నమోదైంది. నర్మెట్టలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రాసెసింగ్ యూనిట్‌ను పూర్తి సామర్థ్యంతో నిర్వహించడం మరో కీలక విజయంగా నిలిచింది.

రైతులకు ఆర్థిక భరోసా :
రైతుల నుంచి కొనుగోలు చేసిన గెలలకు సంబంధించి సుమారు రూ.1,100 కోట్లను చెల్లించింది. ఏడాది పొడవునా మెట్రిక్ టన్నుకు సగటున రూ.23,100 ధర అందించింది. క్రాప్ హాలిడే లేకుండా ప్రాసెసింగ్ కొనసాగిస్తూ, గెలల సేకరణ, అన్‌లోడింగ్‌లో రైతులకు ఇబ్బందులు తగ్గించే చర్యలు చేపట్టింది. నాణ్యమైన ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీతో పాటు జీవ ఎరువులను 50 శాతం సబ్సిడీపై అందించేందుకు ప్రణాళిక రూపొందించింది.

ప్రభుత్వ రంగంలో తొలి రిఫైనరీ :
ఆయిల్‌పామ్ రంగంలో మరో చారిత్రక ముందడుగుగా ప్రభుత్వ రంగంలోనే తొలి ఆయిల్‌పామ్ రిఫైనరీ ఏర్పాటుకు టిజి ఆయిల్‌ఫెడ్ చర్యలు చేపట్టింది. విజయ బ్రాండ్ వంట నూనెల ఉత్పత్తి, ప్యాకింగ్, పంపిణీని విస్తరించేందుకు ఆటోమేటెడ్ మెగా ప్యాకింగ్ స్టేషన్‌ను కూడా ఏర్పాటు చేసింది. ప్రస్తుతం అప్పారావుపేట, అశ్వారావుపేట, నర్మెట్టల్లో మూడు ప్రాసెసింగ్ యూనిట్లు నిర్వహిస్తుండగా, బీచుపల్లి, మహబూబాబాద్, అశ్వారావుపేటల్లో అదనపు యూనిట్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. కల్లూరు గూడెం యూనిట్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

పర్యావరణహిత అభివృద్ధికి ప్రాధాన్యం :
ప్రాసెసింగ్ సామర్థ్యం పెంపుతో పాటు పర్యావరణ పరిరక్షణకు జీరో లిక్విడ్ డిశ్చార్జ్ విధానాన్ని అమలు చేస్తోంది. నట్ ఉత్పత్తి, పామ్ కెర్నల్ ఆయిల్ రికవరీలోనూ గణనీయమైన వృద్ధి సాధించింది. మొత్తంగా రైతులకు మెరుగైన ధరలు, ప్రాసెసింగ్ సామర్థ్యం విస్తరణ, ఆధునిక పారిశ్రామిక కల్పనతో తెలంగాణను ఆయిల్‌పామ్ రంగంలో అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో టిజి ఆయిల్‌ఫెడ్ ముందుకు సాగుతోంది.

ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో నీటి వినియోగం తగ్గించేందుకు చర్యలు

• సిఎం రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మంచినీటి వనరులను పరిరక్షించేందుకు, గృహావసరాలకు సంబంధం లేని ఇతర అవసరాల కోసం మంచినీటి వినియోగాన్ని తగ్గించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ నగరం నిరంతరం విస్తరిస్తున్న క్రమంలో నీటి భద్రతకు, విలువైన జల వనరుల సుస్థిర నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి) 37వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి బోర్డు అధికారులకు, ఉద్యోగులకు, సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. గత 37 సంవత్సరాలుగా హైదరాబాద్ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడంతో పాటు, మురుగునీటి నిర్వహణ సేవలను కల్పించడంలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి కీలక పాత్ర పోషించిందన్నారు. హైదరాబాద్ నగరాభివృద్ధి, ప్రజారోగ్యం, సమగ్ర ప్రగతికి బోర్డు అందించిన విశేష సేవలను సిఎం అభినందించారు. 'దయల్ గ్రీన్ ట్యాంకర్ గ్రీన్ ట్యాంకర్ ఆపరేషన్స్' కార్యక్రమాన్ని ప్రారంభించడాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. సుస్థిర నీటి నిర్వహణ దిశగా ఇది సరైన సమయంలో చేపట్టిన కీలకమైన కార్యక్రమంగా ఆయన అభివర్ణించారు. ప్రభుత్వ శాఖలు, పరిశ్రమలు, నిర్మాణ సంస్థలు, వాణిజ్య సంస్థలు తమ తోటల పెంపకానికి, నిర్మాణ పనులకు , పారిశ్రామిక అవసరాల కోసం శుద్ధి చేసిన మురుగునీటిని మరింత విస్తృతంగా వినియోగించాలని కోరారు. తద్వారా మంచినీటిపై ఆధారపడటం తగ్గడంతో పాటు, అత్యవసర గృహావసరాలకు మంచినీరు అందుబాటులో ఉండేలా చూడవచ్చని అన్నారు. నీటి సంరక్షణను సమిష్టి బాధ్యతగా స్వీకరించాలని, సుస్థిరమైన, నీటి భద్రత కలిగిన హైదరాబాద్ నిర్మాణంలో భాగస్వాములై ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సిఎం రేవంత్ రెడ్డి ప్రజలకు, సంబంధిత భాగస్వాములందరికీ పిలుపునిచ్చారు. కోర్ అర్బన్ రీజియన్ ప్రజలకు సేవలందించే లక్ష్యంతో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి తన ప్రస్థానంలో మరిన్ని విజయాలు సాధించాలని సిఎం ఆకాంక్షించారు.

మౌలిక సదుపాయాలు కీలకం

• ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



ప్రజాపక్షం/హైదరాబాద్ : పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఆర్థిక కార్యకలాపాల విస్తరణకు మెరుగైన రహదారుల అనుసంధానం, పటిష్టమైన మౌలిక సదుపాయాలు అత్యంత కీలకమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు తెలిపారు. రంగారెడ్డి జిల్లా, షాబాద్ మండలం, హైతాబాద్ ప్రాంతంలో సంజయ్ జాజు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా సిటిఆర్ఎల్ఎస్, వెల్‌స్పన్, పరిశ్రమలను సందర్శించి, ఆయా సంస్థల కార్యకలాపాలు, పారిశ్రామిక అవసరాలు, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. అనంతరం ఆయా ఆయా సంస్థల ప్రతినిధులతో మాట్లాడి, కంపెనీల కార్యకలాపాలు, ఉత్పత్తి సామర్థ్యం, పారిశ్రామిక అవసరాలు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమల ప్రతినిధులు తమ సంస్థల కార్యకలాపాలు, భవిష్యత్ అవసరాలు, పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించిన అంశాలను వివరించారు. అనంతరం హైతాబాద్ ప్రాంతంలో చేపడుతున్న రేడియల్ రోడ్డు నిర్మాణ పనులను సంజయ్ జాజు పరిశీలించారు. ముఖ్యంగా రేడియల్ రోడ్డు నంబర్ 2లో చైనేజ్ 20.50 కిలోమీటర్ల వద్ద జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించి, నిర్మాణ పనుల స్థితిగతులు, సాంకేతిక అంశాలను, పనుల అమలుకు సంబంధించిన వివరాలను ఆయన ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన రవాణా సదుపాయాలను బలోపేతం చేయడం ద్వారా పారిశ్రామిక కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందని, ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ పర్యటనలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, ఆర్‌డిఒ పార్థసింహ రెడ్డి, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి రాజ్యాంగమే మూలస్తంభం

• బిజెపి నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా పోరాడాలి
• ఖర్గే, రాహుల్ గాంధీ నాయకత్వంలో ఓటు పరిరక్షణ ఉద్యమం



ప్రజాపక్షం/హైదరాబాద్ : దేశ ప్రజాస్వామ్య పరిరక్షణకు, ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడేందుకు ప్రజాస్వామ్య శక్తులన్నీ ఐక్యంగా పోరాడాలని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు & ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యానికి రాజ్యాంగమే మూలస్తంభమని, ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'ఓటు బచావో – దేశ్ బచావో' మహా సంగ్రామ్ ర్యాలీలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. అంతకుముందు తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నాలు దేశానికి ప్రమాదకరమని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో వ్యవహరిస్తూ ప్రజల ఓటు హక్కును కాలరాస్తున్నదని మంత్రి విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే సర్వాధికారులని, వారు తమ ఓటు ద్వారా ప్రభుత్వాలను ఎన్నుకునే హక్కును కలిగి ఉంటారని చెప్పారు. అటువంటి కీలకమైన హక్కుకు భంగం కలిగించే చర్యలను ప్రజాస్వామ్యవాదులంతా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మరింత పట్టుదలతో పని చేయాలని జూపల్లి పిలుపునిచ్చారు. ప్రజల హక్కులను కాపాడటం, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా బిజెపి ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించాలని అన్నారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని అధికారం నుంచి దించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు.

ఖర్గే, రాహుల్ నాయకత్వంలో ఉద్యమం..
కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడేందుకు పోరాటం కొనసాగుతోందని మంత్రి తెలిపారు. ఈ ఉద్యమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు చురుగ్గా భాగస్వాములు కావాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సాగుతున్న ఈ పోరాటాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించాలని జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు.

దీపావళి కానుకగా రూ.8వేలు అని సైబర్ మోసం

• ప్రధాని పేరుతో వాట్సాప్‌లో తప్పుడు ప్రచారం
• లింక్ క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాలకు ముప్పు
• ఒటిపి, యుపిఐ పిన్, బ్యాంకు వివరాలు వెల్లడించొద్దు : టిజిసిఎస్‌బి

ప్రజాపక్షం/హైదరాబాద్: దీపావళి పండుగ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి పౌరుడికి రూ.8 వేల నగదు ప్రయోజనం అందిస్తోందంటూ వాట్సాప్‌లో ప్రచారమవుతున్న సందేశం పూర్తిగా నకిలీదని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) హెచ్చరించింది. ప్రధానమంత్రి పేరును ఉపయోగించుకుంటూ ప్రజలను మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు ఈ కొత్త ఎత్తుగడకు తెరతీశారని వెల్లడించింది. సందేశంలో ఇచ్చిన అనుమానాస్పద లింక్‌ను క్లిక్ చేయడం ద్వారా వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని అప్రమత్తం చేసింది.పండుగల సమయంలో ప్రజల్లో ఉండే ఆసక్తి, ప్రభుత్వ పథకాలపై ఉన్న నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని మోసగాళ్లు ఈ తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారని టిజిసిఎస్‌బి పేర్కొంది. లింక్‌ను తెరిస్తే నకిలీ వెబ్‌సైట్ల ద్వారా బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారం సేకరించడం, యుపిఐ లావాదేవీల ద్వారా నగదు కాజేయడం లేదా పరికరాల్లో హానికర సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టడం వంటి మోసాలకు పాల్పడే అవకాశం ఉందని తెలిపింది. ఒకవేళ సైబర్ మోసానికి గురై నగదు కోల్పోతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే బ్యాంకును సంప్రదించడంతో పాటు జాతీయ సైబర్ నేరాల హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేయాలని లేదా www.cybercrime. gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ సూచించారు.

కాజీపేటలో భారీగా రైలు బోగీల తయారీయే లక్ష్యం

• కాజీపేట రైలు మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌కు భారీ ఉత్పత్తి లక్ష్యం
• మూడేళ్లలోనే 2,400 బోగీల తయారీకి ప్రణాళిక
• 2030–31లో అత్యధికంగా 960 బోగీల తయారీ



ప్రజాపక్షం/కాజీపేట : గ్రేటర్ వరంగల్ పరిధిలోని కాజీపేట మండలం అయోధ్యపురంలో నిర్మితమవుతున్న రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ (ఆర్ఎంయూ)కు రైల్వే బోర్డు భారీ ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ యూనిట్‌లో రానున్న ఆరేళ్లలో ఏకంగా 3,200 నాన్ ఏసీ మెము కోచ్‌లను తయారు చేయాలని నిర్ణయించింది. 2026–27 ఆర్థిక సంవత్సరం నుంచి 2031–32 వరకు ఏటా ఎన్ని బోగీలు తయారు చేయాలన్న వివరాలతో కూడిన ఉత్పత్తి ప్రణాళికకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. ఈ మేరకు అక్టోబరు 26న రైల్వే బోర్డు డైరెక్టర్ (మెకానికల్ ఇంజినీరింగ్) జయంత్ రామచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంతో కాజీపేట రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ భవిష్యత్తులో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోనే కీలకమైన రైలు బోగీల తయారీ కేంద్రంగా ఎదిగేందుకు మార్గం సుగమమైంది.

ఏడాదికేడాది పెరగనున్న ఉత్పత్తి
రైల్వే బోర్డు ఆమోదించిన ప్రణాళిక ప్రకారం 2026–27 ఆర్థిక సంవత్సరంలో 32 కోచ్‌ల తయారీతో ఉత్పత్తి కార్యక్రమం ప్రారంభం కానుంది. ఆ తర్వాతి ఏడాది 2027–28లో 368 కోచ్‌లు, 2028–29లో 480 కోచ్‌లు తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2029–30, 2030–31 ఆర్థిక సంవత్సరాల్లో అత్యధికంగా ఏడాదికి 960 చొప్పున కోచ్‌లను ఉత్పత్తి చేయనున్నారు. చివరి ఏడాది 2031–32లో మరో 400 కోచ్‌ల తయారీకి ప్రణాళిక రూపొందించారు. ఇలా ఆరేళ్ల కాలానికి కలిపి మొత్తం 3,200 కోచ్‌ల ఉత్పత్తిని ఖరారు చేశారు. ప్రారంభంలో తక్కువ సంఖ్యతో మొదలై, క్రమంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకుంటూ వెళ్లేలా ఈ ప్రణాళికను రూపొందించడం విశేషం.

200 రైళ్లకు సరిపడా బోగీలు
కాజీపేట యూనిట్‌లో తయారుచేయనున్న 3,200 కోచ్‌లను 16 బోగీల చొప్పున రేకులుగా (రైలు సెట్లుగా) రూపొందించనున్నారు. ఈ లెక్కన మొత్తం 200 రేకుల తయారీకి ఈ ఉత్పత్తి సరిపోనుంది. ప్రయాణికుల రవాణాలో కీలకమైన నాన్ ఏసీ మెము రైళ్లకు అవసరమైన కోచ్‌లను ఈ యూనిట్‌లో తయారు చేయనున్నారు. ఈ ఉత్పత్తి ప్రణాళికకు రైల్వే మంత్రిత్వ శాఖ ఆర్థిక డైరెక్టరేట్ కూడా ఆమోదం తెలిపినట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు ఈ ఉత్తర్వులను పంపడంతో పాటు రైల్వే బోర్డులోని సంబంధిత విభాగాలకు సమాచారం అందించారు.

కాజీపేటకు పారిశ్రామిక గుర్తింపు
అయోధ్యపురంలో ఏర్పాటు చేస్తున్న రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌కు భారీ స్థాయిలో ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించడం వరంగల్ ప్రాంత పారిశ్రామిక అభివృద్ధికి కీలక పరిణామంగా భావిస్తున్నారు. రైల్వే బోగీల తయారీకి సంబంధించిన కార్యకలాపాలు విస్తరించడంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. అనుబంధ పరిశ్రమలు, విడిభాగాల సరఫరా సంస్థలు, రవాణా, ఇతర సేవారంగాల అభివృద్ధికి కూడా ఈ యూనిట్ దోహదపడనుంది. ఆరేళ్లలో 3,200 కోచ్‌ల తయారీ లక్ష్యంతో కాజీపేట రైల్వే యూనిట్ తెలంగాణలోనే కీలకమైన రైల్వే పారిశ్రామిక కేంద్రంగా ఎదిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

విద్యార్థుల హాజరీపై ప్రత్యేక దృష్టి

• ఎఫ్ఆర్ఎస్‌లో 100 శాతం హాజరు నమోదు చేయాలి: కార్యదర్శి రవి గుగులోతు



ప్రజాపక్షం/హైదరాబాద్: గురుకుల విద్యార్థుల హాజరును ప్రతి రోజూ ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్)లో 100 శాతం నమోదు చేయాలని టిజిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్ కార్యదర్శి రవి గుగులోతు ఆదేశించారు. విద్యార్థుల గైర్హాజరుకు గల కారణాలను గుర్తించి, తిరిగి పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న యూనిఫాంలు, ఇతర విద్యార్థి సామగ్రి పంపిణీని నవంబర్ 2లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జోనల్ అధికారులు, జిల్లా సమన్వయకర్తలు, ప్రిన్సిపాళ్లతో ఆదివారం నిర్వహించిన జూమ్ సమావేశంలో విద్యార్థుల హాజరు, యూనిఫాంలు, ఇతర సామగ్రి సరఫరా, పంపిణీ, ప్రొవిజన్ల ఇండెంట్‌పై సమీక్షించారు. సుమారు 1.44 లక్షల మంది విద్యార్థులకు రెండో జత యూనిఫాంలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు వివరించగా, పంపిణీలో ఉన్న వ్యత్యాసాలను సరిచేసి పెండింగ్ యూనిఫాంలను వెంటనే అందించాలని కార్యదర్శి ఆదేశించారు. సామగ్రి ఇండెంట్, సరఫరా, స్వీకరణ, పంపిణీ వివరాలను కొత్త యాప్‌లోనే నమోదు చేయాలని, యాప్‌లోని సాంకేతిక సమస్యలను నవంబర్ 2లోగా పరిష్కరించాలని ఆదేశించారు. 2027–28 విద్యా సంవత్సరానికి అవసరమైన సామగ్రి ఇండెంట్‌ను కూడా వాస్తవ విద్యార్థుల సంఖ్య ఆధారంగా అదే తేదీలోగా సమర్పించాలని సూచించారు. నెలవారీ ప్రొవిజన్ల ఇండెంట్‌ను ప్రతి నెల 5వ తేదీలోగా సమర్పించాలని, స్థానికంగా ప్రొవిజన్లు కొనుగోలు చేయకుండా నిర్దేశిత విధానాన్ని పాటించాలని స్పష్టం చేశారు. పెండింగ్ సరఫరాలు, పంపిణీ, సామగ్రి సర్దుబాటు, యాప్‌లో వివరాల నమోదును నవంబర్ 2లోగా పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని జోనల్ అధికారులు, డిసిఓలు, ప్రిన్సిపాళ్లను రవి గుగులోతు ఆదేశించారు.

నేడు సిపిఐ కరువు యాత్ర



• ఎండిపోయిన పొలాలను పరిశీలించనున్న పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యం
• నల్లగొండ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

ప్రజాపక్షం/నల్లగొండ : నల్లగొండ జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులు, వర్షాభావంతో ఎండిపోతున్న పంట పొలాలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో సోమవారం (నవంబర్ 2) కరువు యాత్ర నిర్వహించనున్నారు. ఈ యాత్రలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొని వివిధ గ్రామాల్లో ఎండిపోయిన పంటలను పరిశీలించనున్నారు. కరువు యాత్రలో భాగంగా మునుగోడు మండలం చల్మెడ గ్రామం, చండూరు మండలంలోని బంగారుగడ్డ, నాంపల్లి మండలంలోని నర్సింహులగూడెం గ్రామాల్లో పర్యటించి రైతులతో నేరుగా మాట్లాడనున్నారు. ఆయా గ్రామాల్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండిపోయిన వరి, పత్తి పంటలను పరిశీలించి, రైతులకు జరిగిన పంట నష్టాన్ని అంచనా వేయనున్నారు. సాగు కోసం రైతులు చేసిన పెట్టుబడులు, ప్రస్తుతం ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులు, వ్యవసాయానికి అవసరమైన నీరు, విద్యుత్ సరఫరా సమస్యలను రైతుల నుంచి తెలుసుకోనున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో నల్లగొండ జిల్లాలో పెద్ద ఎత్తున రైతులు వరి, పత్తి పంటలను సాగు చేశారు. అయితే ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతోపాటు, వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో అనేక ప్రాంతాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది.ముఖ్యంగా సాగునీరు అందక, బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులుగా పెట్టిన రైతులు పంటలు చేతికందక నష్టాల పాలవుతున్నారని సిపిఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండ జిల్లాలోని క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి జిల్లాను పూర్తిస్థాయిలో కరువు జిల్లాగా ప్రకటించాలని, రైతుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి, కరువు సహాయక చర్యలు వెంటనే ప్రారంభించేలా ఒత్తిడి తీసుకురావడమే ఈ కరువు యాత్ర ప్రధాన ఉద్దేశమని నాయకులు పేర్కొన్నారు.

ఓటు హక్కుపై దాడిని సహించేది లేదు

• 'సర్' రద్దు చేయాలి.. జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలి
• ఢిల్లీ ఇండియా కూటమి సభలో ఎఐవైఎఫ్ తెలంగాణ నేతల డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎన్నికల్లో ప్రజల తీర్పే ప్రభుత్వాలను నిర్ణయించాలి తప్ప... ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పుల ద్వారా రాజకీయ ప్రయోజనాలు పొందే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారతాయని ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర నాయకులు విమర్శించారు. ఓటర్ల పేర్ల తొలగింపు ద్వారా ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేస్తున్నారంటూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఎఐవైఎఫ్ తెలంగాణ నేతలు పాల్గొని తమ నిరసన గళాన్ని వినిపించారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి శ్రీమాన్, ప్రధాన కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఎన్నికల వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉపయోగించుకుంటోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల ఓట్ల తొలగింపునకు సంబంధించిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కళ్యాణ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



శ్రీలంక నౌకాదళం అదుపులో భారత మత్స్యకారులు

కొలంబో: శ్రీలంక నౌకాదళం ఆదివారం భారత్‌కు చెందిన మత్స్యకారులను అదుపులోకి తీసుకొని, వారు ప్రయాణిస్తున్న పడవను స్వాధీనం చేసుకుంది. మత్స్యకారులు తలైమన్నార్‌కు ఉత్తరాన ఉన్న అంతర్జాతీయ తీర రేఖ దాటి తమ జలాల్లోకి అక్రమంగా ప్రవేశించారని వారు ఆరోపిస్తున్నారు. శ్రీలంక నౌకాదళం అధికారుల వివరాల ప్రకారం... తమ ప్రాదేశిక జలాల్లోకి పెద్ద ఎత్తున మత్స్యకారులు ప్రవేశించారనే సమాచారం మేరకు నార్త్ సెంట్రల్ నావల్ కమాండ్ ఆపరేషన్ చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఏడుగురు మత్స్యకారులను అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి పడవను స్వాధీనం చేసుకున్నారు. వారిని మన్నార్‌లోని మత్స్యశాఖ అధికారులకు అప్పగిస్తామని నౌకాదళం అధికారులు తెలిపారు. మత్స్యకారుల విషయంలో భారత్–శ్రీలంక మధ్య తరచూ వివాదం నెలకొంటోంది. శ్రీలంక ప్రాదేశిక జలాల్లోకి అక్రమంగా ప్రవేశించారనే ఆరోపణలపై గతంలో పాక్ జలసంధిలో భారత మత్స్యకారులపై శ్రీలంక నౌకాదళం కాల్పులు జరిపి పడవలను స్వాధీనం చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జఫ్నాకు దక్షిణంగా తమ జలాల్లోకి అక్రమంగా ప్రవేశించారని ఆరోపిస్తూ గత నెలలో 9 మంది భారత మత్స్యకారులను శ్రీలంక నౌకాదళం అరెస్టు చేసింది.



సామాజిక న్యాయం కోసం ఐక్య పోరాటానికి పుట్ట లక్ష్మణ్ పిలుపు

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : ప్రజల హక్కులు, సామాజిక న్యాయం,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం లాల్ నీలి ఐక్యతతో కృషి చేయాని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు పుట్ట లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 290వ వారం నిత్య పూలమాల కార్యక్రమంలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.రాజ్యాధికారం అంటే పదవులు అనుభవించడం కాదని ప్రజలకు సేవ చేయడమేనన్నారు. ఓటు ప్రజల హక్కు అయుధమని పేర్కొంటూ అంబేద్కర్ రాజాంగ విలువల స్ఫూర్తితో సమానత్వం స్వేచ్ఛ సామాజిక న్యాయం కోసం ముందుకు సాగాలని కోరారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య యువతకు ఉపాధి, పేదలకు ఉచిత వైద్యం అందించే సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వాములకు నిత్యాన్నదానం ప్రారంభం



ప్రజాపక్షం/కూకట్‌పల్లి : అయ్యప్ప స్వాముల దీక్షా కాలాన్ని పురస్కరించుకుని కెపిహెచ్‌బి కాలనీ రోడ్ నెంబర్ 2లోని సాయిబాబా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. అయ్యప్ప స్వాముల సమక్షంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వాముల దీక్షా సమయంలో భక్తులకు అన్నదానం చేయడం ఎంతో పవిత్రమైన సేవ అని పేర్కొన్నారు. అన్నదానం మహాదానమని, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం గొప్ప పుణ్యకార్యమని అన్నారు. అయ్యప్ప స్వాముల కోసం ప్రతిరోజూ నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ముందుకు వచ్చిన నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సేవా కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగాలని, అయ్యప్ప స్వాముల ఆశీస్సుల ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాముల, స్థానిక నాయకుల, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



కెపిహెచ్‌బి కాలనీ రోడ్ నంబర్ 2లో అయ్యప్ప స్వాముల అన్న సమారాధన కార్యక్రమం ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ రాష్ట్ర జాయింట్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, సినీ నటులు శ్రీకాంత్, ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ సౌజన్యంతో తొలిరోజు అన్న సమారాధన నిర్వహించగా, ఆయన స్వయంగా పాల్గొని అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదం వడ్డించారు. అయ్యప్ప స్వాముల సేవలో పాల్గొనడం ఎంతో పవిత్రమైన బాధ్యత అని, స్వాముల ఆశీస్సులు సమాజ శ్రేయస్సుకు దోహదపడతాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ అన్న సమారాధన కార్యక్రమం నవంబర్ 1నుంచి 2027 జనవరి 1 వరకు నిరంతరాయంగా కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో కొల్లా శంకర్, శ్రీనివాస్ గోవిందా, పాదం సూర్య, బండారి రమేష్ సుభాష్‌తో పాటు స్థానిక నాయకులు, అయ్యప్ప భక్తులు, పెద్ద సంఖ్యలో స్వాములు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ప్రభుత్వ చీఫ్ విప్



ప్రజాపక్షం/తాండూరు : తాండూరులో జరిగిన పలు శుభ కార్యక్రమాలకు ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఆదివారం తాండూరుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ డిసిసిబి వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్ సోదరుడు శంకర్ గౌడ్ మనువడు, మనువారులు నూతన వస్త్రధారణ కార్యక్రమంలో పాల్గొన్న మహేందర్‌రెడ్డి చిన్నారులను ఆశీర్వదించారు. సల్లా గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డితో పాటు ఆయన వెంట డాక్టర్ సంపత్‌కుమార్, రవిగౌడ్, సురేందర్‌రెడ్డి, రవి తదితరులు ఉన్నారు. అనంతరం పట్టణంలో నూతన ఏర్పాటు చేసిన ఉడిపి కృష్ణ హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గృహ ప్రవేశానికి మాజీ ఎమ్మెల్యే హాజరు

ప్రజాపక్షం/తాండూరు : యాలాల మండల పరిధి గోరేపల్లి గ్రామంలోని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వై.నర్సిములు నూతన గృహప్రవేశ వేడుకలకు తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సిములు కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించడంతోపాటు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట పలువురు మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పాత భవనాలే కామధేనువులు..

- రూ.101 పన్ను చెల్లింపుదారులే లక్ష్యం
- ఇష్టారాజ్యంగా బల్దియా సిబ్బంది వసూళ్ల పర్వం
- పట్టించుకోని జోనల్, డిప్యూటీ కమిషనర్లు



ప్రజాపక్షం/హైదరాబాద్ : మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) పరిధిలో కొందరు అధికారులు, సిబ్బంది అక్రమార్జనే ధ్యేయంగా విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారు. ముఖ్యంగా పాత భవనాలను లక్ష్యంగా చేసుకుని, నోటీసుల పేరుతో భయాందోళనలు సృష్టిస్తూ యజమానుల నుంచి రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు (టిఐ), బిల్ కలెక్టర్లు (బిసి) పెద్ద ఎత్తున నోటీసులు జారీ చేస్తూ ఈ వసూళ్ల దందా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ప్రధానంగా సున్నా విస్తీర్ణం, సున్నా ఆస్తిపన్ను కలిగి ఉన్న ఇళ్లు, అలాగే రాయితీ కింద కేవలం రూ.101 పన్ను చెల్లించే భవనాలే ఈ అవినీతి అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఆస్తి పన్ను అసెస్‌మెంట్‌ను సవరిస్తామని, కొలతల్లో తేడాలున్నాయని, భారీగా జరిమానాలు పడతాయని యజమానులను తీవ్రంగా బెదిరిస్తున్నారు. పన్ను అంచనాలను భారీగా పెంచి చూపుతూ, తమకు ఎంతోకొంత ఇస్తే పన్నును తక్కువగా విధిస్తామని ఆశచూపి దర్జాగా వసూళ్లకు తెరతీశారు. చార్మినార్ జోన్ పరిధిలోని సంతోష్ నగర్ ప్రాంతంలో ఇటీవల వెలుగు చూసిన ఘటనే దీనికి ప్రత్యక్ష నిదర్శనం. అక్కడి ఒక పాత ఇంటికి సంబంధించి విస్తీర్ణం సవరణ పేరుతో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ మూడు నెలల క్రితం యజమానికి నోటీసు ఇచ్చారు. మూడేళ్ల బకాయిల కింద ఏకంగా రూ.1.5 లక్షలు చెల్లించాలని భయపెట్టడంతో ఆ యజమాని అంత మొత్తాన్ని సదరు అధికారికి నగదు రూపంలో అందజేశారు. అయితే, దబ్బులు తీసుకున్న రెండు నెలలైనా సదరు అధికారి నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడంతో విసిగిపోయిన బాధితుడు నేరుగా కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదుతో కంగారుపడ్డ టిఐ హుటాహుటిన రూ.26 వేల పన్ను చెల్లించినట్లు రసీదు పంపినప్పటికీ, మిగిలిన సొమ్ముపై ఎలాంటి సమాధానం ఇవ్వలేకపోయారు. దీనిపై విచారణ జరిపిన కమిషనర్ సదరు ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌ను వెంటనే సస్పెండ చేశారు. ఇలా మూడు కార్పొరేషన్‌ల పరిధిలో వసూళ్ల జోరుగా సాగుతోంది. సంబంధిత జోనల్ కమిషనర్లు, సర్కిల్ డిప్యూటి కమిషనర్లు ఆస్తి పన్ను చెల్లింపు దారుల సమస్యలు పట్టించుకోకపోవడంతో బాధితులు కార్యాలయాల చుట్టు ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఆస్తిపన్ను మదింపుసకు సంబంధించి అంశాలను పట్టించుకోకపోవడంతో పాటు కొత్తగా నిర్మించిన భవనాలకు ఆస్తిపన్ను నిర్ధారణ అంశాన్ని గాలికి వదిలేశారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనితో కార్పొరేషన్‌లు ఆదాయం కోల్పోతుండగా, మరోవైపు పన్ను చెల్లింపుదారుల దగ్గర ఇష్టారాజ్యంగా వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.



అంబేడ్కర్ ఆశయాల సాధనే లక్ష్యంగా కృషి చేయాలి

ప్రజాపక్షం/బోడుప్పల్ : అంబేడ్కర్ రాజ్యాంగపరంగా కల్పించిన రాజ్యాంగ హక్కులను పొందిన వారంతా తమ బాధ్యతగా ఆయన ఆశయాల సాధన లక్ష్యంగా కృషి చేయాలని అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య కోరారు. రాజ్యాగ నిర్మాత డా.బిఆర్ అంబేడ్కర్ విగ్రహానికి బోడుప్పల్ సర్కిల్‌లో 402వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాత భావితరాల భవిష్యత్తు బాగుండాలనే యోచనతో బడుగు, అణగారిన వర్గాలందరికి అవసరమైన మేరకు రిజర్వేషన్ల విధానాన్ని ప్రవేశ పెట్టారని, తద్వారా దేశంలో లక్షలాది మంది వాటి ఫలితాలను అనుభవిస్తున్నారన్నారు. కాగా ఇటీవలి కాలంగా అంబేడ్కర్ కార్యక్రమాలను, ఆశయాలను చులకన చేస్తూ మాట్లాడుతున్న వారిని తిప్పి కొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమం భూపరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య, గరుగుల యాకయ్య, బండారి సాయి, రాపోలు వెంకటేష్, రామకృష్ణ, చిల్ల అంజయ్య, శ్రీనివాస్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి మరిన్ని నిధులు

- పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ



ప్రజాపక్షం/కూకట్‌పల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానంద నగర్ డివిజన్ పరిధి శాంతి నగర్ కాలనీలో ఎమ్మెల్యే సీడీపీ నిధుల రూ.10లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతినగర్ కాలనీలో అన్ని హంగులతో, సకల సౌకర్యాలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. కాలనీవాసులు సమష్టిగా కృషి చేసి ఈ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవడం అభినందనీయమని, శాంతినగర్ కాలనీ ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ కమ్యూనిటీ హాల్‌ను కాలనీవాసుల సంక్షేమం, అభివృద్ధి కోసం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాలనీలో సమావేశాలు, సభలు, చిన్నపాటి శుభకార్యాలు, జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కాలనీ అభివృద్ధికి భవిష్యత్తులోనూ మరిన్ని నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నానని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వివేకానందనగర్ డివిజన్‌తో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటూనే అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు. కాలనీ వాసులు తమ దృష్టికి తీసుకచ్చే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు, శాంతినగర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మల్కారం క్వారీలో ప్రమాదం
నీటిలో మునిగి ఇద్దరు యువకులు మృతి



ప్రజాపక్షం/జవహర్‌నగర్ : సరదాగా గడిపేందుకు వెళ్లి క్వారీ నీటిలో దిగిన ఇద్దరు యువకులు గల్లంతైన విషాద సంఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కారం క్వారీ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. జవహర్‌నగర్ ఎస్‌హెచ్ఓ సైదులు, తెలిపిన వివరాల ప్రకారం... యూపాల్ ప్రాంతానికి చెందిన రక్షిత్ (19), మురారి (19), పీయూష్ (18), సయాన్ (18), రోహిత్ (18) అనే ఐదుగురు మిత్రులు ఆదివారం ఉదయం సరదాగా గడిపేందుకు మల్కారం క్వారీ వద్దకు వచ్చారు. అక్కడ భోజనాలు సిద్ధం చేసుకుని తిన్న అనంతరం, ప్లేట్లను శుభ్రం చేస్తుండగా కొన్ని ప్లేట్లు ప్రమాదవశాత్తు క్వారీ నీటిలో పడిపోయాయి. పడిపోయిన ప్లేట్లను బయటకు తీసేందుకు సయాన్, రోహిత్ నీటిలోకి దిగారు. ఈ క్రమంలో లోతైన నీటి ప్రాంతంలోకి వెళ్లి కాలు జారడంతో ఇద్దరూ నీటిలో మునిగి గల్లంతయ్యారు. ఒడ్డున ఉన్న మిగతా ముగ్గురు స్నేహితులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఉదయం 9:30 గంటలకు 100 డయల్ ద్వారా సమాచారం అందుకున్న వెంటనే జవహర్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం డిఆర్ఎఫ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. డిఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గల్లంతైన యువకుల కోసం గాలింపు చర్యలు వేగవంతం చేశారు. మృతి చెందిన సయాన్, రోహిత్, యువకుల మృత దేహాలను బయటకు తీశారు, పోస్టుమార్టం నిమిత్తం శవాలను గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన బాలురు..
తల్లిదండ్రులకు అప్పగింత



ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : తప్పిపోయిన ఇద్దరు మైనర్ బాలురను కేవలం మూడు గంటల్లో గుర్తించి క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించిన ఘట్‌కేసర్ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించారు.కొండాపూర్ గ్రామానికి చెందిన ఓర్సు శివప్రసాద్ (12) ములుగురం యశ్వంత్ (13) కనిపించడం లేదని వారి తల్లులు అక్టోబర్ 31 రాత్రి 8,40 గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరూ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఫిర్యాదు అందిన వెంటనే ఇన్‌స్పెక్టర్ పి.కిరణ్ ఆధ్వర్యంలో ఉప పోలీసు అధికారులు ఎ.శేఖర్, ఎ.రాఘవేంద్ర పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. కానిస్టేబుళ్లు సత్యనారాయణ, రాజు సమన్వయంతో కేవలం మూడు గంటల్లోనే వరంగల్ రైల్వేస్టేషన్‌లో బాలురను గుర్తించారు. పాఠశాలకు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారని అందుకే ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయామని బాలురు తెలిపారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లలతో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా మెలగాలని వారి సమస్యలను ఓపికగా విని ప్రేమతో మార్గనిర్దేశం చేయాలని పోలీసులు సూచించారు. పిల్లలు కనిపించకుండా పోతే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



ధిల్లీ సమరభేరిలో డా.సత్యం శ్రీరంగం

ప్రజాపక్షం/కూకట్‌పల్లి : దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు సంరక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధిల్లీలోని రాంలీలా మైదానంలో ఆదివారం నిర్వహించిన ఓట్ చోరీ వ్యతిరేక సమరభేరి కార్యక్రమంలో పిసిసి సభ్యులు, టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం పాల్గొన్నారు. కాంగ్రెస్, ఇండియా కూటమి నాయకులతో కలిసి నిరసన కార్యక్రమానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజల ఓటు హక్కును కాపాడాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై వచ్చిన ఆరోపణలపై న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటుకు సమాన విలువ ఉండాలని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగాలని అన్నారు. ఓటు హక్కు, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ ఏ,బీ బ్లాక్ అధ్యక్షులు పి.నాగిరెడ్డి, తూము వేణు, మాజీ పట్టణ అధ్యక్షులు సతీష్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాళ్లు రమాదేవి, సంధ్య, సీనియర్ నాయకులు సాధుప్రతాప్ రెడ్డి, కృష్ణరాజ్‌పుత్, సుంకన్న, తమ్మినేని ప్రవీణ్, విట్టల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకురాళ్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



ప్రజాపక్షం/బొంరాస్‌పేట్ : వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌సిప్ అర్హత పరీక్షకు హాజరైన విద్యార్థులను తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు రవీందర్‌గౌడ్, చంద్రశేఖర్, గోపాల్ అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని పోటీ పరీక్షల్లో ప్రతిభ కనపరచలని సూచించారు. ఎన్ఎంఎంఎస్ పరీక్ష ద్వారా ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకార వేతనం పొందే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. బొంరాస్‌పేట్, దుద్యాల, కుదురుమళ్ల, చిలుముల, మైలారం, రేగడిమైలారం, హకీంపేట్, చౌదరిపల్లి తదితర పాఠశాలలో విద్యార్థులు కాళాశాలలో ఉన్నత పాఠశాల నంబర్‌వన్ పాఠశాలలోని 225 పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేసిన ఉపాధ్యాయులను కూడా అభినందించారు.

పంచలింగల్‌లో మొసలి కలకలం



ప్రజాపక్షం/మర్పల్లి : వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండల పరిధిలోని పంచలింగల్ గ్రామ పరిధిలోని నివాగులో మొసలి కనిపించడంతో స్థానికంగా కలకలం రేగింది. అటుగా వెళ్తున్న రైతులు మొసలిని గమనించి తాడుతో పట్టుకొని హైదరాబాద్ జూకు తరలించారు.

నేడు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు!

- మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 7 గంటల వరకు పలు మార్గాల్లో మళ్లింపులు
- 13 కీలక కూడళ్లకు దూరంగా ఉండాలని పోలీసుల సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్: బిజెపి చేపట్టనున్న పాదయాత్రతో సోమవారం నగరంలోని పలు ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి రానున్నాయి. బిజెపి పాదయాత్ర బిజెఆర్ విగ్రహం నుంచి ఎంజె మార్కెట్ వరకు కొనసాగనున్న నేపథ్యంలో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 7 గంటల వరకు అవసరాన్ని బట్టి ట్రాఫిక్‌ను మళ్లించడంతోపాటు ఆంక్షలు విధించనున్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని, ఆంక్షలు అమలయ్యే కూడళ్లు, రహదారుల వైపు వెళ్లకుండా ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ఏఆర్ పెట్రోల్ పంపు నుంచి బిజెఆర్ విగ్రహం వైపు వచ్చే వాహనాలను నాంపల్లి రైల్వే స్టేషన్, రవీంద్రభారతి వైపు మళ్లించనున్నారు. జాంబాగ్, అఫ్జల్‌గంజ్ నుంచి జిపిఓ వైపు వచ్చే వాహనాలను ఎంజె మార్కెట్ వద్ద తాజ్ ఐలాండ్ వైపు మళ్లిస్తారు. తాజ్ ఐలాండ్ నుంచి ట్రూప్‌బజార్ మీదుగా బ్యాంక్ స్ట్రీట్ వైపు వెళ్లే వాహనాలను అఫ్జల్‌గంజ్ వైపు మళ్లించనున్నారు. లిబర్టీ నుంచి బిజెఆర్ విగ్రహం వైపు వెళ్లే వాహనాలకు కూడా ఆంక్షలు ఉంటాయి. హిమాయత్‌నగర్ నుంచి వచ్చే వాహనాలను ఓల్ అంబేద్కర్ విగ్రహం, ట్యాంక్‌బండ్ వైపు మళ్లిస్తారు. బషీర్‌బాగ్ జంక్షన్ వద్ద ఓల్ ఎమ్మెల్యే క్వార్టర్స్, రాజారెడ్డి మార్గ్ నుంచి వచ్చే వాహనాలను హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ కాంప్లెక్స్ వైపు మళ్లించనున్నారు.చాపెల్ రోడ్, ఎస్‌బిఐ రోడ్, సుజాత స్కూల్ జంక్షన్ వైపు వెళ్లే వాహనాలకు కూడా మళ్లింపులు ఉంటాయి. కింగ్‌కోఠి నుంచి అబిడ్స్ వైపు వెళ్లే వాహనాలను బషీర్‌బాగ్, బొగ్గులకుంట వైపు మళ్లిస్తారు. బొగ్గులకుంట నుంచి బాటా జంక్షన్ వైపు, ఎంజె మార్కెట్ నుంచి జిపిఓ, నాంపల్లి స్టేషన్ రోడ్ వైపు వాహనాలకు అనుమతి ఉండదు. జిపిఓ నుంచి ఎంజే మార్కెట్ వైపు కూడా రాకపోకలను నిలిపివేయనున్నారు.

ఈ కూడళ్లు, మార్గాలకు దూరంగా ఉండాలి...

లిబర్టీ, రవీంద్రభారతి, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ జంక్షన్, ఏఆర్ పెట్రోల్ పంపు, బషీర్‌బాగ్, బిజెఆర్ విగ్రహం, ఎస్‌బిఐ గన్‌ఫౌండ్రి, జిపిఓ, నాంపల్లి టి జంక్షన్, తాజ్ ఐలాండ్, ఎంజె మార్కెట్, అఫ్జల్‌గంజ్, జాంబాగ్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఉండే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. కట్టమైసమ్మ–చిక్కడపల్లి, నారాయణగూడ–లిబర్టీ, స్మశానవాటిక జంక్షన్–హెచ్‌టిపి, బషీర్‌బాగ్–బ్యాంక్ స్ట్రీట్, రామ్‌కోటి–తాజ్‌మహల్ హోటల్, రామ్‌కోటి–బాటా జంక్షన్, పాత అంబేద్కర్ విగ్రహం–డిఎంహెచ్ఎస్, చాదర్‌ఘాట్–ఎంజే మార్కెట్, అఫ్జల్‌గంజ్–ఎంజే మార్కెట్, ఎంజె మార్కెట్–రవీంద్రభారతి తదితర మార్గాల్లోనూ రాకపోకలకు అంతరాయం కలగనుంది. సికింద్రాబాద్ నుంచి రసూల్‌పురా, రాణిగంజ్ మార్గాల్లో నూ ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయి. పంజాగుట్ట నుంచి సచివాలయం వైపు వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు.ఆర్‌టిసి బస్సులను కూడా మళ్లించారు. ప్రత్యామ్నాయ రూట్లలో వెళ్లాల్సి ఉంటుంది.

చీకట్లో వన్యప్రాణుల సందడి..
తెల్లవారుజామున పక్షుల కిలకిలలు!

ప్రజాపక్షం/హైదరాబాద్ : నగర జీవనంలో ప్రకృతికి దూరమవుతున్న ప్రజలకు పచ్చని వనంలో అరుదైన అనుభూతిని అందించేందుకు తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టిజిఎఫ్‌డిసి) వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. రాత్రివేళల్లో సంచరించే వన్యప్రాణుల కదలికలను పరిశీలించడం నుంచి తెల్లవారుజామున పక్షుల కిలకిలరావాలను ఆస్వాదించడం వరకు ప్రకృతిలోని విభిన్న కోణాలను పరిచయం చేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్ బొటానికల్ గార్డెన్‌లో శనివారం రాత్రి నాక్టర్నల్ వాక్, ఆదివారం తెల్లవారుజామున బర్డ్ వాక్ కార్యక్రమాలను నిర్వహించింది. డెక్కన్ వుడ్స్ అండ్ ట్రైల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాక్టర్నల్ వాక్‌లో రాత్రి చీకటి అలుముకున్న తర్వాత ప్రకృతిలో చోటుచేసుకునే మార్పులు, రాత్రిపూట చురుగ్గా సంచరించే జీవుల కదలికలు, వాటి శబ్దాలను పాల్గొన్నవారు పరిశీలించారు. పగటిపూట సాధారణంగా కనిపించని ప్రకృతి ప్రపంచాన్ని దగ్గరగా తెలుసుకునే అవకాశం కల్పించారు. అలాగే ఆదివారం తెల్లవారుజామున నిర్వహించిన బర్డ్ వాక్‌లో బొటానికల్ గార్డెన్‌లోని వివిధ పక్షి జాతులను పరిశీలించారు. వాటి ప్రత్యేక లక్షణాలు, ప్రవర్తన, సహజ ఆవాసాల గురించి నేచురలిస్టులు వివరించారు. పక్షుల జీవన విధానాన్ని నిశితంగా గమనిస్తూ ప్రకృతితో మమేకమయ్యేలా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ రెండు కార్యక్రమాలకు డెక్కన్ వుడ్స్ అండ్ ట్రైల్స్‌కు చెందిన నేచురలిస్ట్ బృందం మార్గదర్శకత్వం వహించింది. బొటానికల్ గార్డెన్‌లోని జీవవైవిధ్యం, రాత్రివేళల్లో చురుగ్గా ఉండే వన్యప్రాణులు, వివిధ పక్షి జాతుల విశేషాలను వివరించింది.ప్రకృతి ఆధారిత పర్యాటకాన్ని ప్రోత్సహించడంతో పాటు వన్యప్రాణులు, జీవవైవిధ్య పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని టిజిఎఫ్‌డిసి వెల్లడించింది. నగరం నడిబొడ్డున ఉన్న పచ్చని ప్రాంతాలను కేవలం విహార కేంద్రాలుగానే కాకుండా ప్రకృతి విద్య, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే వేదికలుగా తీర్చిదిద్దవచ్చని ఈ కార్యక్రమాలు చాటిచెప్పాయి.

డేటా సెంటర్ల ప్రమాదంపై ప్రజలందరూ అప్రమత్తం కావాలి

మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు



ప్రజాపక్షం/షాద్‌నగర్: డేటా సెంటర్ల ప్రమాదంపై ప్రజలందరూ అప్రమత్తం కావాలని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. ఆదివారం పట్టణంలోని వారి కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ ఫరూఖ్ నగర్ మండలం ఎలికట్ట గ్రామసమీపంలో నిర్మిస్తున్న డేటా సెంటర్ల పెద్ద ఎత్తున రేడియేషన్ వచ్చే అస్కారం ఉందని, దాంతో వన్య ప్రాణులతోపాటు ప్రజలకు, జీవరాసులకు ప్రమాదం చోటు చేసుకునే అస్కారం ఉందన్నారు. అనుమతులు ఇచ్చే సమయంలో ప్రభుత్వాలు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని ఆకాంక్షించారు. సమావేశంలో అన్మారీ వెంకటయ్య ఉన్నారు.

ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయండి

షాద్‌నగర్ జెఎసి కన్వీనర్ టిజి శ్రీనివాస్



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ : ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ జెఎసి కన్వీనర్ టిజి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం షాద్‌నగర్ ఆర్టీసి బస్టాండ్ ఆవరణలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టిజి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడకపోవడంతోనే ఈ ప్రాంతం సాగు నీరు, తాగునీటికి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సమీపంలో కృష్ణానది జలాలు ప్రవహిస్తున్నా ఒడిసి పట్టుకోలేని దుస్థితి ఏర్పడుతుందన్నారు. పార్టీలకు అతీతంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెఏసి కోఆర్డినేటర్ రవీంద్రనాథ్, కో కన్వీనర్ అర్జునప్ప, కార్య నిర్వాహక సభ్యులు ఆకాష్ నాయక్, నాగరాజు పాల్గొన్నారు

కొత్తపేట..కేశంపేట రహదారి గుంతలతో ప్రజల ఇక్కట్లు



ప్రజాపక్షం/కేశంపేట: గుంతలమయంగా మారిన రహదారితో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దూరం చేసేందుకు కొత్తపేట..కేశంపేట రోడ్డును డబుల్ లైన్ రోడ్డుగా విస్తరించాలని బిజెపి నాయకుడు కర్రెడ్ల నరేందర్‌రెడ్డి కోరారు. గుంతల మయంగా మారిన రోడ్డును ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తపేట గ్రామం నుండి కేశంపేట మండల కేంద్రం వరకు సింగిల్ బిటి రోడ్డు ఉండటం.. అదికాస్తా గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందించి డబుల్ రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఐక్యత



ప్రజాపక్షం/కడ్తాల్ : ఆధ్యాత్మిక కార్యక్రమాలు మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ ప్రజల్లో భక్తిభావం, ఐక్యతను పెంపొందిస్తాయని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం చల్లంపల్లి గ్రామంలో మంతపురం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీలక్ష్మీ సుదర్శన మహా యాగం కార్యక్రమానికి సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువులు బ్రహ్మశ్రీ డాక్టర్ బమ్మిడిపాటి రవికృష్ణ శర్మ, వేద పండితులు, గ్రామపెద్దలు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా తిరుపతి రెడ్డి, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, నరేందర్ గౌడ్,తల్లోజు రఘు,గుర్క శివ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తుల్జా భవానీ దేవాలయ అభివృద్ధి పనులు

ప్రజాపక్షం/కడ్తాల్ : కడ్తాల్ మండల పరిధిలోని గనుగుమర్ల తండా గ్రామంలోని పోచమ్మగడ్డ తండాలో తుల్జా భవానీ అమ్మవారి ఆలయ కడప, దర్వాజా నిలబెట్టే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి ఆమనగల్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమ నాయక్, సేవాలాల్ సేన తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల్ మండల ఉపసర్పంచుల సంఘం అధ్యక్షుడు జర్పుల లక్పతి నాయక్ హాజరయ్యారు. తండా ప్రజల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో అమ్మవారి ఆశీస్సులతో అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భిక్షపతి, బిక్కు నాయక్, సేవాలాల్ సేన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, వార్డు సభ్యులు రాజు నాయక్, మాజీ వార్డు సభ్యులు రాణి జగన్ నాయక్, నాయకులు రాజు నాయక్, టిక్లాల్ నాయక్, దేశ్య నాయక్, కిషన్ నాయక్, పండునాయక్, బాలునాయక్, రాజేందర్ నాయక్ పాల్గొన్నారు.

నీటి సంరక్షణ లక్ష్యంగా

‘గ్రీన్ ట్యాంకర్’ సేవలు ప్రారంభం

ముల్లకత్వ ఎస్‌టిపి వద్ద ప్రారంభించిన సిఎంసి కమిషనర్ డాక్టర్ జి.సృజన

తాగునీటిని పొదుపుగా వాడాలి

పచ్చదనం, నిర్మాణాలకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలని విజ్ఞప్తి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రజలు వీలైనంత వరకు తోటల పెంపకం, పచ్చదనం నిర్వహణ, నిర్మాణ పనులు లాంటి అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటిని వినియోగించాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ డాక్టర్ జి. సృజన కోరారు. మంచినీటిని అనవసరంగా వృథా చేయకుండా పొదుపు చేయాలని నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సైబరాబాద్ పరిధిలోని ముల్లకత్వ మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టిపి) వద్ద జలమండలి, అర్బన్ బయోడైవర్సిటీ (యుబిడి) విభాగాల సమన్వయంతో ఏర్పాటు చేసిన ‘గ్రీన్ ట్యాంకర్’ సేవలను ఆదివారం కమిషనర్ లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో జలమండలి ఇడి మందల సంతోష్, జి.ఎం(ఒఅండ్‌ఎం) హరీశ్‌శంకర్, ఎస్‌టిపి జిఎం తిప్పన్న పాల్గొన్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నివాస సంక్షేమ సంఘాలు, విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలు, ప్రజలు తోటల పెంపకం, ల్యాండ్‌స్కేపింగ్, నిర్మాణ పనుల వంటి అవసరాలకు శుద్ధి చేసిన నీటినే వాడాలని సూచించారు. మురుగునీటి పునర్వినియోగాన్ని ప్రోత్సహించడం, మంచినీటి వనరులపై ఒత్తిడి తగ్గించడం, స్థిరమైన పట్టణ పచ్చదనాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ గ్రీన్ ట్యాంకర్ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువచ్చినట్లు తెలిపారు. సైబరాబాద్ పరిధిలో పచ్చదనం, పార్కులు, తాగునీరు అవసరం లేని ఇతర పనులకు శుద్ధి చేసిన ఎస్‌టిపి నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సేవలను పొందగోరే ప్రజలు హెల్ప్‌లైన్ నెంబర్ 155313 కు ఫోన్ చేసి గ్రీన్ ట్యాంకర్లను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతంలో మార్పులు వచ్చి నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున, ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని, స్థిరమైన నీటి నిర్వహణ విధానాలను అవలంబించాలని సిఎంసి కమిషనర్ స్పష్టం చేశారు.

గంజాయి, అక్రమ మద్యం పట్టివేత

మల్లాపూర్‌లో 2.2 కిలోల గంజాయి..

కీసరలో 16 డిఫెన్స్ మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాపక్షం/హైదరాబాద్: మల్కాజిగిరి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రెండు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి గంజాయి, అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాచారం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పార్క్ మల్లాపూర్ ఎక్స్ రోడ్ సమీపంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా మహా బూబ్ అనే వ్యక్తి వద్ద 2.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మల్కాజిగిరి అసిస్టెంట్ కమిషనర్ ప్రదీప్‌రావు తెలిపారు. పట్టుబడిన గంజాయితో పాటు నిందితుడిని నాచారం ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు వెల్లడించారు. ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కీసరలో అక్రమంగా విక్రయిస్తున్న 16 డిఫెన్స్ మద్యం బాటిళ్లను ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. రోహిత్ (26) మద్యం బాటిళ్లను సరఫరా చేస్తుండగా, రాచర్ల సుబ్బారావు (57) వాటిని విక్రయిస్తున్నట్లు మల్కాజిగిరి ఎస్ హనుమంతరావు తెలిపారు. పట్టుబడిన మద్యం బాటిళ్లతో పాటు నిందితులను ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.



డ్రంక్ అండ్ డ్రైవ్.. 205 మందిపై కేసులు

మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు.. ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిక



ప్రజాపక్షం/రంగారెడ్డి: వీకెండ్ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 205 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసినట్లు సైబరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ డిసిపి (అడ్మిన్) జి.నరేందర్ తెలిపారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో పట్టుబడిన వారిలో 177 మంది ద్విచక్ర వాహనదారులు, 8 మంది ఆటో డ్రైవర్లు, 20 మంది కార్ల డ్రైవర్లు ఉన్నారు.

కేసుల వివరాలు....బ్లడ్ ఆల్కహాల్ కాన్సంట్రేషన్ (బి ఎసి) ఆధారంగా పరిశీలిస్తే.. 174 మంది 36 నుంచి 200 ఎంజీ/100 ఎంఎల్ మధ్య, 20 మంది 201 నుంచి 300 ఎంజీ/100 ఎంఎల్ మధ్య, మరో 11 మంది 301 నుంచి 550 ఎంజీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ స్థాయితో పట్టుబడ్డారు. వీరందరినీ చట్టపరమైన చర్యల్లో భాగంగా కోర్టుకు హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడపడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే భారతీయ న్యాయ సంహిత (బి ఎన్ ఎస్)2023లోని సెక్షన్ 105 కింద కేసు నమోదు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ సెక్షన్ కింద నేరం రుజువైతే గరిష్టంగా పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

గత వారం 289 డ్రంక్ డ్రైవింగ్ కేసుల పరిష్కారం...

గత వారం (26.10.2026 నుంచి 31.10.2026 వరకు) నమోదైన డ్రంక్ డ్రైవింగ్ కేసుల్లో 289 కేసులను న్యాయస్థానాలు పరిష్కరించాయి. వీరిలో 26 మందికి జరిమానాతో పాటు జైలు శిక్ష, ఇద్దరికి జరిమానాతో పాటు సామాజిక సేవ, మరో 261 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసు అధికారులు వెల్లడించారు.

రేడియల్ రోడ్డు పనులు వేగవంతం

ప్రభుత్వ చీఫ్‌సెక్రటరీ సంజయ్ జాజు

ప్రజాపక్షం/షాబాద్: రేడియల్ రోడ్డు పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ సంజయ్‌జాజు అన్నారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో జరుగుతున్న రేడియల్ రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం రేడియల్ రోడ్డు భూసేకరణకు సంబంధించన అంశాలను, సనుల పురోగతిపై టిజిఐఐసి మేనేజింగ్ డైరెక్టర్, వైస్‌చైర్మన్ శశాంక్, కలెక్టర్ నారాయణరెడ్డి, హెచ్‌ఎండిఎ కమిషన్ సర్ఫరాజ్‌లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపటిన రేడియల్ రోడ్డు పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు స్వమన్వయంతో రేడియల్ రోడ్డు పనులను పరిశీలించి పనులను పూర్తి చేయాలని తెలిపారు.



కారు బోల్తా...ఒకరు మృతి

ముగ్గురికి గాయాలు



ప్రజాపక్షం/రంగారెడ్డి: కారు అదుపుతప్పి బోల్తా పడటంతో ఒకరు మృతిచెందగా, మరో ముగ్గురు గాయపడిన ఘటన ఆదివారం చేవెళ్ల మండల పరిధిలోని పామెన గేటు సమీపంలో చోటుచేసుకుంది. సంఘటనకు సంబందించి స్థానికులు, పోలీస్‌ల కథనం ప్రకారం...షాబాద్ మండలం పోత్గల్ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌గౌడ్, మురళీ గౌడ్, ఒగ్గు వెంకటయ్య, కార్ల శివకుమార్ కారులో ప్రయాణిస్తుండగా పామెన గేటు సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాజ్‌కుమార్‌గౌడ్ అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా, ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు స్పందించి క్షతగాత్రులను108లో మొయినాబాద్ మండలంలోని భాస్కర ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం. ఈ ప్రమాదానికి గల కారణాలు,క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు పక్క గుంతలు పూడ్చండి



ప్రజాపక్షం/కొందుర్గు: రోడ్డు పక్కన ఉన్న గుంతలను పూడ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు. కొందుర్గు మండల పరిధిలోని రామచంద్రాపూర్ గ్రామ స్టేజీ వద్ద రోడ్డు పక్కన గుంతలు ఏర్పడటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బి అధికారులు సకాలంలో స్పందించి గుంతలు పూడ్చివేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

ఇష్టానుసారంగా రోడ్డు తవ్వకాలు



ప్రజలకు తప్పని ఇబ్బందులు

రోడ్డు కటింగ్ అనుమతులు అంతంత మాత్రమే..

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న జిహెచ్‌ఎంసి అధికారులు

డ్రైనేజీ పనుల్లో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం

రోడ్డుపై ఉన్న మట్టిని విక్రయిస్తున్న వైనం




ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: రోడ్డు తవ్వకాల పేరుతో కాంట్రాక్టరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రణవ్ గ్రూప్ ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల్లో నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అనుమానాలు స్థానిక ప్రజల్లో వ్యవమవుతున్నాయి. 600 ఎంఎం డయా పైప్‌లైన్‌కు 300 ఎంఎం డయా డ్రైనేజీ పైపును అనుసంధానం చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో మురుగునీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, రోడ్డు తవ్వకాల ద్వారా వెలికితీసిన మట్టిని కాంట్రాక్టర్ విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి సంబంధించిన అధికారులు ఎంతమేరకు అనుమతులు మంజూరు చేశారు... పనులకు సంబంధించిన నిబంధనలు ఏమిటి? అనే విషయాలపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు కటింగ్ అనుమతులు అంతంత మాత్రమే..? రోడ్డు తవ్వకాల పనులను సంబంధించి కాంట్రాక్టర్‌కు జారీ చేసిన అనుమతులు ఏ మేరకు ఉన్నాయని,, ప్రత్యామ్నాయ మార్గం ఉన్నా.. ప్రజలకు ఇబ్బందులు తప్పవా? ప్రణవ్ గ్రూప్, మారం అపార్ట్‌మెంట్స్ డ్రైనేజీ లైన్ విషయంలో అధికారుల తీరుపై అనుమానాలు। ప్రణవ్ గ్రైప్ వెనుక భాగం నుంచి గోకుల్ ఎన్‌క్లేవ్ మీదుగా డ్రైనేజీ లైన్‌కు అనుసంధానం చేసే అవకాశం ఉన్నప్పటికీ, ఆ మార్గాన్ని పరిశీలించకుండా ప్రధాన రహదారిని తవ్వకాలకు ఎంచుకోవడంపై స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలపై స్పష్టత ఇవ్వకుండా అధికారులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు పునఃపరిశీలన చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికుల డిమాండ్ చేస్తున్నారు.

ఎల్ నినో..వర్షాభావంతో ‘గృహజ్యోతి’కి షాక్

పెరుగుతున్న విద్యుత్ వినియోగం





ప్రజాపక్షం/షాద్‌నగర్: ఎల్ నినో ప్రభావం..వర్షాభావ పరిస్థితుల నేపధ్యంలో గృహజ్యోతి పథకానికి షాక్ తగులుతుంది. వాతావరణంలో ఏర్పడుతున్న మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న 200 యూనిట్ల విద్యుత్ దాటే అస్కారం ఉంది. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో తీవ్ర చలి ఉండాల్సి ఉండగా ఎల్ నినో, వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగానే ఉష్ణోగ్రతలు పెరిగి విద్యుత్ వినియోగం పెరుగుతుందని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ఆశించిన దాని కంటే విద్యుత్ వినియోగం ఎక్కువగానే పెరిగిందన్నారు. నెలకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్న కుటుంబాలు ఆ పరిమితిని దాటితే జీరో బిల్లుకు బదులుగా సాధారణ బిల్లుల మాదిరిగానే చెల్లించాల్సి ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరిగితే విద్యుత్ వినియోగం అదే స్థాయిలో పెరిగే అవకాశం ఉంటుందని, నెలకు 170నుండి 200యూనిట్ల మధ్య విద్యుత్‌ను వినియోగించే కుటుంబాలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపధ్యంలో ఫ్యాన్లు, ఎసిలు ఎక్కువ సేపు నడవటం, కూలర్ల వినియోగం పెరగడం వంటి కారణాలతో నెలవారి విద్యుత్ బిల్లు పెరిగే అస్కారం ఉంటుంది. విద్యుత్‌ను పొదుపుగా వినియోగిస్తేనే జీరో విద్యుత్ బిల్లును పొందేందుకు అస్కారం ఉంటుందని అంటున్నారు. ఒకవైపు విద్యుత్ అధికారుల సూచనలు, మరోవైపు ప్రభుత్వ ప్రకటనలతో వినియోగదారులు సందిగ్దంలో పడిపోయారు.

విద్యుత్ సరఫరాలో కోతలు

విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపధ్యంలో అధికారులు సమయపాలన లేకుండా కోతలు విధిస్తూ కాలం వెలదీస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి మొదలుకొని మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాల వరకు విద్యుత్ కోతలు అంచలంచలుగా పెరుగుతున్నాయి. అధికారులు చేస్తున్న సూచనలను పరిగణలోకి తీసుకున్న ప్రజలు ఎలాగైనా తమకు గృహజ్యోతి పథకం వర్తించాలనే లక్ష్యంతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ వినియోగం క్రమంగా తగ్గిస్తున్నారని చెప్పవచ్చు. కానీ పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా కొన్ని ప్రాంతాలలో విద్యుత్ వినియోగం పెరగడం వల్ల 200యూనిట్లు దాటి సాధారణ బిల్లులు చెల్లింపులకు సిద్దమవుతున్నారు. గృహజ్యోతి పథకం ప్రయోజనం పొందుతున్న కుటుంబాలు వినియోగంపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అవసరం లేని సమయాల్లో విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, టీవీలు, ఇతర విద్యుత్ పరికరాలను నిలిపి వేయాలని సూచనలు చేస్తున్నారు. విద్యుత్‌ను ఆదాచేసే ఎల్‌ఈడి బల్బుల తోపాటు సమర్థవంతమైన పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని, నెలవారీగా 200యూనిట్లు దాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేస్తున్నారు.

డివిజన్‌లో

41,281 గృహజ్యోతి లబ్దిదారులు

షాద్‌నగర్ డివిజన్‌లోని ఆరు మండలాల్లో మొత్తం 41,281 గృహజ్యోతి లబ్దిదారులు ఉన్నారని విద్యుత్ డిఇ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. డివిజన్‌లో మొత్తం 28,954 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, 90,802విద్యుత్ కనెక్షన్లు గృహ అవసరాలకు ఉన్నాయని, గృహజ్యోతి పథకం కింద 41,281 ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని డిఇ తెలిపారు. 14,250 కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, ఇప్పటి వరకు విద్యుత్ వినియోగం 114మెగావాట్లు అవసరం ఉందని, డిమాండ్‌కు తగ్గినంతనే విద్యుత్ వస్తుందని తెలిపారు. బోరుబావుల వద్ద పంటలు ఎండిపోకుండా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యవసాయ పంటలు ఎండిపోకుండా ఉండేందుకు విద్యుత్‌ను ఉన్నదానికంటే అదనంగా మారో నాలుగు గంటల పాటు ఇస్తున్నట్లు తెలిపారు. రబీ సీజన్ లో మాత్రం ఆరుతడి పంటలను సాగుచేసేందుకు రైతులు కృషి చేయాలని కోరారు.

రిట్ పిటిషన్ల మాయాజాలం?

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: రిట్ పిటీషన్ల పేరిట వేధిస్తున్నారంటూ కొందరు స్థానిక సంఘాల నేతలు ఆందోళన బాటపడుతున్నారు. నల్లగుట్ట కేంద్రంగా ఏళ్లుగా యథేచ్ఛగా సాగుతున్న వసూళ్ల రాకెట్‌ను నిరోధించడం కోసం డిసిలు, జెడ్‌సిలు జోక్యం చేసుకోవాలని వారు కోరారు. రాంగోపాల్ పేట్ డివిజన్ పరిధిలో సామాజిక కార్యకర్త ముసుగులో ఒకే వ్యక్తి ఏళ్ల తర బడి వరుస రిట్ పిటిషన్లు వేస్తూ స్థానికులు, వ్యాపారులను బెదిరింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఇది ఒక వ్యక్తి చేసే పని కాదని, ఇది ఒక వ్యవస్థీకృత వసూళ్ల ముఠాగా తయారైందని వారు వాపోతున్నారు. ఈ విషయంపై స్థానికులతో పాటు ప్రజా సంఘాల నేతలు కవాడీగూడ డిసిని కలిసి వివరించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడాలి



ప్రజాపక్షం/తిరుమలగిరి: ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు పోరాడాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఢిల్లీలోని రాంలీలా మైదానంలో చేపడుతున్న నిరసన కార్యక్రమంలో పాల్గొ నేందుకు శ్రీగణేష్ కార్యకర్తలు, నాయకులతో కలిసి ఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా స్వామ్య విలువలను కాపాడటం, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను సాధించడం, ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ఈ పోరాటానికి ప్రజలు సంఘీభావం తెలపాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు దుస్థితి చూడండి సారూ..



ప్రజాపక్షం/కంటోన్మెంట్: గుంతలమయంగా మారిన రోడ్లు.. చినుకుపడి తే నడిచికూడా వెళ్లలేని దుస్థితి నెలకొందని బొల్లారం జనప్రియ షెల్టర్స్ స్నే హ ఎన్‌క్లేవ్ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పూర్తిగా గుంతలమయమై, నీరు నిలిచిపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. ఈ రహదారిలో చీకటి పడిందంటే కచ్చితంగా చి న్నపిల్లలు, వృద్ధులు, మహిళలు నడిచి వెళ్లలేకపోతున్నారని స్థానికులు ఆం దోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా కంటోన్మెంట్ సిఇఒ, సంబంధిత అధి కారులు స్పందించి రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని కోరుతున్నారు.

ఎన్నికల కమిషన్ విఫలం



ప్రజాపక్షం/సనత్‌నగర్/అమీర్‌పేట్: అర్హులైన గ్రాడ్యుయేట్‌లను ఓటర్లుగా నమోదు చేయించడంలో ఎన్నికల కమిషన్ అధికారులు విఫలమయ్యారని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు. ఆదివారం సనత్‌నగర్, అమీర్‌పేట్ డివిజన్‌లలో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమాల్లో డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, నాయకులు సురేష్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, కరు ణాకర్‌రెడ్డి, రాజేష్ ముదిరాజ్, శేఖర్, హరి, పీయూష్ గుప్త, పురుషోత్తం, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, అశోక్ యాదవ్, నామన సంతోష్ కుమార్, కూతురు నర్సింహ, గుడిగే శ్రీనివాస్ యాదవ్, కట్టా బలరాం, ప్రదీప్ గౌడ్, కాలనీ ప్రతినిధులు గౌతమ్, రమణ, ప్రసన్న కుమార్, జోగిం దర్ సింగ్, రాజిరెడ్డి, శ్రీకాంత్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శబరిమల పాదయాత్రకు శ్రీకారం

ప్రజాపక్షం/బేగంపేట్: అయ్యప్ప మాలధారణ అనేది కేవలం ఒక సంప్ర దాయం మాత్రమే కాదని.. అదొక గొప్ప ఆధ్యాత్మిక క్రతువు అని మాజీమ ంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం బేగంపేట్‌లోని ప్రకాష్‌నగర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద 175 మంది అయ్యప్ప స్వాముల బృందం శబరిమల వరకు సాగించే పాద యాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శేఖర్, ఆరీఫ్, అఖిల్, బంటి, గురు స్వాములు బుచ్చిబాబు, బాలు, చింటు తదితరులు పాల్గొన్నారు.

నేడు మహా పాదయాత్ర

ప్రజాపక్షం/ఖైరతాబాద్: ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం.. అరాచకవాదాన్ని అంతం చేద్దాం.. అనే నినాదంతో నిర్వహించనున్న మహాపాదయాత్రలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా బిజెపి ఖైరతాబాద్ నేతలు కోరారు. ఈ మేరకు ఖైరతాబాద్ బిజెపి డివిజన్ అధ్యక్షుడు ఎ.ఆదర్శ, నేతలు ఎన్.ప్రేంరాజ్, వి.రామ్‌మోహన్‌రావు, ఎన్.నగేష్, వీణా మాధురి మాట్లా డుతూ.. నవంబర్ 2వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నిజాం కళాశాల సమీ పంలోని బిజెఆర్ విగ్రహం వద్ద ఈ పాదయాత్ర ప్రారంభమై ఎంజెమార్కెట్ వరకు కొనసాగనుందని తెలిపారు.

ఎస్‌టి కమిషన్, ఏకలవ్య కార్పొరేషన్ తేవాలి

ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ : రాష్ట్రంలో ప్రత్యేక ఎస్‌టి కమిషన్, ఏక లవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు, ప్రధానకార్యదర్శి కూతాడి రవికు మార్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్ల బ్‌లో వారు మాట్లాడారు. ఎస్‌టి కమిషన్ ఏర్పాటు అనంతరం కమిషన్ చైర్మన్‌గా ఎరుకల సామాజిక వర్గానికి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎరుకల కుటుంబాలకు బ్యాంకులతో సంబంధం లేకుండా రూ.12లక్షల రుణం ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్‌టిలో ఎబిసిడి వర్గీక రించాలన్నారు. ములుగు జిల్లా రామానుజపురంలో ఎరుకల నాంచారమ్మ పంచకుట ఆలయాన్ని పునఃనిర్మించాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షులు వనం రమేశ్, శ్రీరాం ఆనంద్, రమేశ్, కోనేటి రాజు, దేవరాయ యాదగిరి, కెమ్మసరం సరళ తదితరులు పాల్గొన్నారు.

‘డయల్-ఎ-గ్రీన్ ట్యాంకర్’ సేవలకు శ్రీకారం

- శుద్ధి చేసిన మురుగునీటితో నగర పచ్చదనానికి కొత్త ఊపిరి నిర్మాణ పనులు
- మొక్కల పెంపకానికి శుద్ధి చేసిన నీటినే వినియోగించాలి
- మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి





ప్రజాపక్షం/హైదరాబాద్ : భూగర్భ జలాల వినియో గాన్ని తగ్గించి, శుద్ధి చేసిన మురుగునీటిని సమర్థవం తంగా పునర్వినియోగంలోకి తీసుకురావడం ద్వారా నగ రంలో పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జలమండలి ‘డయల్ఎ గ్రీన్ ట్యాంకర్’ కార్యక్రమాన్ని ప్రారంభించింది. నాగోల్ లోని ఎస్‌టిపి వద్ద మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి, జలమండలి ఈ.డి. ఎస్.పంకజ, మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, ఎల్.బి.నగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వినయ్ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని మొక్కలకు, నిర్మాణ పనులకు శుద్ధి చేసిన నీటినే వాడాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థల సమన్వ యంతో శుద్ధి చేసిన మురుగునీటిని వివిధ అవసరాలకు పునర్వినియోగించడం ద్వారా తాగునీరు, భూగర్భ జలా లపై ఒత్తిడిని తగ్గించవచ్చని అన్నారు. రహ దారి మీడియన్‌లలో మొక్కల పెంపకం, పార్కులు, గార్డెనింగ్‌తో పాటు భవన నిర్మాణ పనుల వంటి తాగునీరు అవసరం లేని పనులకు కూడా శుద్ధి చేసిన నీటిని విని యోగించాలని అధికారులకు సూచిం చారు. ఈ అవసరాలకు బోరు నీటిని విని యోగించకుండా, అందుబాటులో ఉన్న శుద్ధి చేసిన నీటికే ప్రాధాన్యత ఇవ్వాల న్నారు. డయల్ఎగ్రీన్ ట్యాంకర్ సేవలను విస్తృతంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి, నీటి పునర్వినియోగంపై అవ గాహన కల్పించాలని ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని అవ సరమైన తాగునీరు కానీ వినియోగాల కోసం పొందేం దుకు ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్ 155313 కు కాల్ చేసి డయల్ఎగ్రీన్ ట్యాంకర్ సేవలను వినియోగించుకోవచ్చని అన్నారు. ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసు కుంటూ, భూగర్భ జలాలపై ఆధారపడటాన్ని తగ్గించి, పచ్చదనంతో కూడిన పరిశుభ్రమైన నగరాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు.

మురసు తుఫాన్ పట్ల అప్రమత్తం

ప్రజాపక్షం/హైదరాబాద్‌సిటీ: మురసు తుఫాన్ ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో బల మైన ఈదురుగాలులు, వర్షాలు కురిసే అవకా శం ఉన్న నేపథ్యంలో టిజిఎన్‌పిడిసిఎల్ అప్రమత్త మైంది. సంస్థ పరిధిలోని 21 సర్కిళ్ల అధికారులు, ఫీల్ సిబ్బంది సోమవారం ఉదయమే తమ విధి నిర్వహణ కేంద్రాలకు తప్పనిసరిగా చేరుకోవాల ని ఆదేశించింది. సూర్యాపేట్, నల్గొండ, యాదా ద్రి భువనగిరి, సిద్దిపేట్ జిల్లాలతో పాటు క్యూర్ ప్రాంతంలో వాతావరణ పరిస్థితులపై ప్రత్యేక దృ ష్టి సారించాలని సూచించింది. విద్యుత్ లైన్లు, స్త ంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లను తనిఖీ చేసి ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించింది. అత్యవసర మరమ్మతుల కోసం సిబ్బంది, వాహ నాలు, పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని, వి ద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. తుఫాను ప్రభావం ఉన్నంతకాలం అధికారులు, సిబ్బంది 24 గంటల పాటు అప్రమత్తంగా ఉం టూ పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించింది. 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు విజ్ఞప్తి చేసింది.

ల్యాండ్‌స్కేపింగ్‌కు శుద్ధి చేసిన జలాల వినియోగం





ప్రజాపక్షం/హైదరాబాద్ : నీటి సంర క్షణ, పర్యావరణ పరిరక్షణ దిశగా హెచ్‌ఎండిఏ అడుగు వేసింది. సచివా లయ ప్రాంగణంలోని ల్యాండ్‌స్కేపిం గ్‌గా గార్డెన్ నిర్వహణకు, మొక్కలకు నీరు పోసేందుకు మంచినీటికి బదు లుగా రోజూ సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టిపి) ద్వారా శుద్ధి చేసిన నీటిని వినియోగించడం ప్రారంభించారు. రోజుకు సుమారు 1,50,000 లీటర్ల మంచినీటిని ఆదా చేస్తూ, శుద్ధి చేసిన మురుగునీటిని సమర్థవంతంగా పునర్వి నియోగిస్తున్నారు. జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి గ్రీన్ వాటర్ ట్యాంకర్లను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో హెచ్‌ఎండిఏ అసిస్టెంట్ డైరె క్టర్ ఆఫ్ హార్టికల్చర్ డి. చక్రపాణి, హార్టి కల్చర్ ఆఫీసర్ వి. జి. సుందర్, ఎఫ్ఎ స్ఓ సీతారాములు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అలాగే బేగంపేటలోని గ్రీన్ ల్యాండ్స్ గెస్ట్ హౌస్ వద్ద ఉన్న ల్యాండ్‌స్కేప్ గార్డెన్ నిర్వహణకు కూడా ఎస్‌టిపి శుద్ధి చేసిన నీటిని వినియోగిస్తు న్నారు. దీని ద్వారా రోజుకు మరో 30,000 లీటర్ల మంచినీటి వినియోగా నికి ప్రత్యామ్నాయాన్ని ఏర్పరిచి నీటి సంరక్షణకు తోడ్పడుతున్నారు.

వారియర్స్‌కు తీరని అన్యాయం

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: ఓ వైపు ఎల్ ని నోతో విపత్కర పరిస్థితి... మరోవైపు అవినీతి, బం దుప్రీతి, లోపించిన జవాబుదారితనం, కనిపించని పారదర్శకత, నశించిన మానవత్వం... అనే అంశాలు జలమండలిని కలచివేస్తున్నాయి. జల మండలిని కొందరు నిలువునా దోచుకుంటున్నా రని.. ఇందులో భాగంగానే ఇటీవల లోక్‌భవన్ రహదారిలో ఎసిబి అధికారులు ఓ అధికారి నుంచి రూ. 2.40 లక్షలు స్వాధీనం చేసుకోవడం జలమండలిని అప్రతిష్టపాలు చేసేవిగా మారాయి. ఈ క్రమంలోనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రెండు రోజుల క్రితం వినతిపత్రం ఇవ్వడం జరి గింది. ముఖ్యంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయం, అవినీతిపై స్పందించిన ప్రభుత్వం విజిలెన్స్ విచారణలు చేపట్టడంతో జల మండలి అధికారుల్లో వణుకు మొదలయ్యింది. క్షేత్రస్థాయిలో వారియర్స్‌గా పోరాడుతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను జలమండలి ఎండి కె.అశో క్‌రెడ్డి పూర్తి స్థాయిలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరో పణలు వస్తున్నాయి. వెంగళరావునగర్ డివిజన్‌లో విధుల్లో ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నర్సింహారెడ్డి చనిపోయిన సమయంలో ఎండి అశోక్‌రెడ్డి పూర్తిగా మానవత్వం లేకుండా వ్యవహరించారని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మండిపడుతున్నారు. క్షేత్రస్థాయిలో పోరాడుతున్న వారిని పక్కన పెట్టడం ఏమిటని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రశ్ని స్తున్నారు. రెండు నెలల వ్యవధిలో ఆరుగురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మృతిచెందితే జలమండలి ఉన్నతాధికారులు ఏమేరకు న్యాయం చేశారు? అనే అంశంపై ఎండి అశోక్‌రెడ్డి బహిరంగ చర్చ జరపాలని వారు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమిపై హస్తం నేత కన్ను?

లష్కర్‌లో క్రమంగా ప్రభుత్వ భూములు కబ్జా పట్టించుకోని హైదరాబాద్ జిల్లా కలెక్టర్?

ప్రభుత్వ స్థలాలు గుర్తించాలి: గ్రేటర్ మాలమహానాడు

ప్రజాపక్షం/కంటోన్మెంట్: అక్కడ గజం స్థలం రూ.3 లక్షలపై మాటే. కొనుగోలు చేద్దామన్నా స్థలం లభించదు. రద్దీ ప్రాంతం కావడంతో అక్కడ ఉన్న ప్రభుత్వ స్థలంపై ఓ హస్తం నేత కన్ను పడింది. ఇంకేముంది సంబం ధిత 300 గజాల స్థలం కబ్జాకు యత్నాలు మొదలయ్యాయి. ఇప్పటికే ఈ స్థలంపై హైకోర్టులో కేసు కూడా నడుస్తోంది. ఈ విషయాలపై సికింద్రాబా ద్ రెవెన్యూ అధికారులు నోరుమెదపడం లేదు. కనీసం అక్కడ రెవెన్యూ అ ధికారులు ప్రభుత్వ భూమి అని పేర్కొంటూ బోర్డు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుండటంతో సదరు నేత ఆ స్థలాన్ని సొంతానికి వాడుకుంటు న్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదంతా ఎక్కడ అనుకుంటున్నారా.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న మోండా డివిజన్ పరిధిలోకి వ చ్చే రెజిమెంటల్‌బజార్ సమీపంలోని సిమ్రన్ పార్క్ హోటల్ పక్కన ప్రభు త్వ స్థలం వ్యవహారం. ఇటీవల ప్రకాష్‌నగర్ డివిజన్ పరిధిలోని భగవం తాపూర్‌లోనూ 76 గజాల ప్రభుత్వ స్థలంలోని టాయిలెట్లు కూల్చివేసి క బ్జా చేశారనే ఆరోపణలు మరువకముందే మరో బాగోతం వెలుగులోకి వచ్చింది. అసలు సికింద్రాబాద్ ఆర్‌డిఓ పరిధిలో ప్రభుత్వ భూములు క బ్జాలకు గురవుతుంటే ఆర్‌డిఓ, తహశీల్దార్లు ఏం చేస్తున్నారు? ఈ వ్యవహా రాలపై కలెక్టర్ ప్రియాంక అలా స్పందించాలని గ్రేటర్ హైదరాబాద్ మాల మహానాడు అధ్యక్షుడు ఎల్.గిరిజా శంకర్ డిమాండ్ చేస్తున్నారు.

ఢిల్లీ నిరసనలో నగర నేతలు







ప్రజాపక్షం/అమీర్‌పేట్: ఓటు హక్కు పరిరక్ష ణ, ప్రజాస్వామ్య విలువల సంరక్షణ కోసం ఢిల్లీలోని రాంలీల మైదానంలో నిర్వహించిన నిరసనలో క్యూర్ పరిధికి చెందిన నాయకులు, నేత లు పాల్గొన్నారు. ఈ క్రమంలోనే ఓట్ చోర్ దేశ్ బచావో కార్యక్రమంలో మాజీ గొల్కొండ హస్తకళల సంస్థ చైర్మన్, ఒబిసి అబ్జర్వర్ ఐల మధు గౌడ్ పాల్గొడం జరిగింది. ఒబిసి రాష్ట్ర కన్వీనర్ కేతూరి వెంకటే ష్‌తో కలిసి ఓటు హక్కు పరిరక్షణకు తమ సంఘీ భావాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో మల్లేష్ యాదవ్, శ్రవణ్, కొండ నాగరాజు, రాజేష్ తదిత రులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా.. సనత్‌నగర్ ఇంచార్జి డా.కోట నీలిమ నాయకత్వంలో ఎన్ఆర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవులపల్లి రవి కిరణ్ ఆధ్వర్యంలో ర్యాలీలో పాల్గొన్న నేతలు, కార్యక ర్తలు ప్రజాస్వామ్య హక్కుల పరిర క్షణకు తమ సంఘీభావాన్ని చాటారు. కార్యక్రమంలో వినోద్ కుమార్, బ్రహ్మయ్య ఉప్పుటూరి, అనిత, సునీత తదితరులు పాల్గొ న్నారు. కాగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో నేతలు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో భారీగా నకిలీ నోట్లు పట్టివేత



హైదరాబాద్ : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో భారీగా నకిలీ నోట్లు పట్టుబడిన ఘటన కలకల ం రేపింది. నిందితుడు ముంబయి ఎల్‌టిటి ఎక్స్ ప్రెస్ జనరల్ కోచ్‌లో జైపూర్ నుంచి ముంబయి నగరానికి తరలిస్తుండగా పోలీసులు పట్టుకు న్నారు. రాజస్థాన్‌లోని బికనీర్ ప్రాంతానికి చెందిన శివరతన్ మహియా అనే వ్యక్తిని అదుపు లోకి తీసుకుని అతడి నుంచి రూ.60 లక్షల విలువైన నకిలీ కరెన్సీ నోట్లను వారు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో నిందితుడు ఓ ప్రకాశ్ నకిలీ కరెన్సీ నోట్ల బ్యాగ్‌ను అక్టోబర్ 28న జైపూర్ రైల్వే స్టేషన్‌లో శివరతన్‌కు ఇచ్చి, ముంబయిలోని ఓ వ్యక్తికి అందజేయాలని సూచించాడు. నకిలీ నోట్లు తరలించినందుకు రూ.2.20 లక్షలు ఇస్తానని వారు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఒప్పందం మేరకు మైసూర్ ఎక్స్‌ప్రెస్‌లో కాచిగూడ చేరుకున్న నిందితుడు అక్టోబర్ 31న ముంబయి ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేస్తుండగా రైల్వే పోలీసులు పట్టుకు న్నారు. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు ఓం ప్రకాశ్ పరారీలో ఉన్నట్లుగా పోలీసులు తెలి పారు. గతంలో అతడి పై రాజస్థాన్‌లో క్రిమినల్ కేసులు ఉన్నట్లుగా ప్రాథమికంగా గుర్తించారు. పరారీలో ఉన్న నిందితుడు కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు.

ప్రత్యర్థి వర్గాల మధ్య కాల్పులు ముగ్గురు మృతి

ఇంఫాల్: మణిపూర్‌లోని నోనీ జిల్లాలో ప్రత్యర్థి సాయుధ వర్గాల మధ్య జరి గిన కాల్పుల్లో కుకీ వర్గానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మరణించారు. పోలీ స్‌ల వివరాల ప్రకారం కెక్రో నాగా గ్రామంలో ఈ కాల్పులు మొదల య్యాయి. అటవీ ప్రాంతంలోని కొండ గ్రామంలో గంటల తరబడి కాల్పులు కొనసాగాయి. మరణించిన వారిని థాంగ్లెన్‌సాంగ్ సింగ్‌సన్, థాంగ్‌ఖోసెయ్ హౌకిప్, లామ్మిన్‌సాంగ్ కిప్‌జెన్‌గా గుర్తించారు. వీరు చురాచాంద్‌పూర్ జిల్లా లోని హెంగ్లెప్, థాన్లోన్ ప్రాంతాలకు చెందినవారని పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. వీరు ‘గ్రామ స్వచ్ఛంద కార్యకర్తలు’ (విలేజ్ వాలంటీర్లు) . ‘ఆ ప్రాంతంలో తగిన భద్రతా చర్యలు చేపట్టాం’ అని అధికారి తెలిపారు. మరో వైపు, కుకీ వర్గానికి చెందిన అత్యున్నత సంస్థ ‘కుకీ ఇన్పి మణిపూర్’ (కె ఐఎం), ఈ ముగ్గురు యువకుల హత్యను తీవ్రంగా ఖండించింది. ఈ ఘటన వెనుక ‘నాగా మిలిటెంట్ గ్రూపులు’ ఉన్నాయని ఆరోపించిన కెఐఎం, ‘న్యాయం జరగాలని, బాధ్యులను గుర్తించాలని, ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని’ డిమాండ్ చేసింది.

గతేడాదితో పోలిస్తే అక్టోబరులో...

19.3శాతం పెరిగిన ‘కోల్ ఇండియా’ బొగ్గు ఉత్పత్తి

67.2 మిలియన్ టన్నులు నమోదైందని వెల్లడి



కోల్‌కతా : తమ బొగ్గు ఉత్పత్తి గత ఏడాదితో పోలిస్తే అక్టోబరులో 19.3శాతం పెరిగి 67.2 మిలియన్ టన్ను లకు (ఎంటి) చేరుకుందని ఆదివారం కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్) తెలిపింది. స్టాక్ ఎక్స్ఛేంజీలకు దాఖలు చేసిన తాత్కాలిక డేటా ప్రకారం...ప్రభుత్వ యాజమాన్యంలోని ఈ మైనింగ్ సంస్థ గత ఏడాది ఇదే నెలలో 56.4 ఎంటిల ఉత్పత్తి చేసింది. అక్టోబరులో అమ్మకాలు 70.3 ఎంటిలుగా నమోదు అయ్యాయి. ఇది ఏడాది క్రితం నాటి 59.2 ఎంటిలతో పోలిస్తే 18.7 శాతం అధికం. 2026–27 ఏప్రిల్–అక్టోబరు కాలానికి , కోల్ ఇండియా లిమిటెడ్ ఉత్పత్తి గత ఏడాది ఇదే కాలంలోని 385.5 ఎంటిల నుంచి 0.7శాతం పెరిగి, 388.2 ఎంటిలకు చేరింది. ఏడు నెలల కాలంలో అమ్మ కాలు 9.2 శాతం పెరిగి 416.2 ఎంటిల నుంచి 454. 6 ఎంటిలకు చేరుకున్నాయి. అనుబంధ సంస్థలలో మహానది కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎంసిఎల్) అక్టోబరు 25.3శాతం పెరుగుదలతో 20.8 ఎంటిల అత్యధిక ఉత్ప త్తిని నమోదు చేసింది. సౌత్ ఈస్టర్న్ కోల్డ్ ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎస్ఇసిఎల్) 17.4 శాతం పెరుగుదలతో 14.3 ఎంటిల ఉత్పత్తిని చేసింది. వెస్ట్రన్ కోల్డ్ ఫీల్డ్స్ లిమిటెడ్ (డబ్ల్యుసిఎల్) అత్యంత వేగవంతమైన వృద్ధిని నమోదు చేసింది. దీని ఉత్పత్తి 64.7శాతం పెరిగి5.9 ఎంటిలకు చేరింది. ఈస్టర్న్ కోల్డ్ ఫీల్డ్స్ లిమిటెడ్ (ఇసిఎల్) 27.9శాతం వృద్ధితో 4.6 ఎంటిలు ఉత్పత్తి చేయగా, సెంట్రల్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ (సిసిఎల్) ఉత్పత్తి 26.1శాతం పెరిగి7.3 ఎంటిలకు చేరింది. భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ (బిసిసిఎల్) 7.1శాతం వృద్ధితో 2.9 మిలియన్ టన్నుల ఉత్పత్తిని నమోదు చేసింది. నార్తర్న్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎన్‌సిఎల్) మాత్రమే క్షీణ తను నమోదు చేసిన ఏకైక ప్రధాన అనుబంధ సంస్థగా నిలిచింది. దీని ఉత్పత్తి 4.3శాతం తగ్గి 11.4 మిలి యన్ టన్నులకు పడిపోయింది. సప్ల య్‌ల విషయానికి వస్తే, అక్టోబరులో వెస్ట్రన్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ సరఫ రాలు 50.2శాతం వద్ద నిలిచి 6.7 ఎంటిలకు చేరాయి. కాగా, సిసిఎల్ సరఫరాలు 44.7శాతం పెరిగి 8.0ఎంటిలకు చేరాయి. ఈస్టర్న్ కోల్ ఫీల్డ్ సరఫరాలు 35.1శాతం పెరిగి 4.9 మెట్రిక్ టన్నులకు చేరాయి. మహానది కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ 13.0శాతం పెరుగుదలతో 20.6 ఎంటిలను, సౌత్ ఈస్టర్న్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ 19.5శాతం పెరుగుదలతో 15.6 మిలియన్ టన్నులను రవాణా చేశాయి. నార్తర్న్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ సప్లయ్‌లు 1.1శాతం తగ్గి11.2 మెట్రిక్ టన్నులకు పడిపోయాయి. ఏప్రిల్–అక్టోబరు కాలంలో ఎన్‌సిఎల్‌లో 14.6శాతం, ఎంసిఎల్‌లో 4.2శాతం, బిసిసిఎల్‌లో 9.8శాతం ఉత్పత్తి క్షీణించగా, డబ్ల్యుసిఎల్, సిసిఎల్, ఇసిఎల్ వరుసగా 15.9శాతం, 21.1శాతం, 12.3శాతం వృద్ధిని నమోదు చేసింది. ఒక ప్రత్యేక ఫైలింగ్‌లో, సింగిల్ విండో మోడ్ అగ్నాస్టిక్ (ఎ స్‌డబ్ల్యు ఎంఎ) ఇ–వేలం కింద అక్టోబరులో 12.9 మెట్రిక్ టన్నుల బొగ్గును ఆఫర్ చేసి, ఆఫర్ చేసిన పరి మాణంలో 91 శాతం అయిన 11.80 మిలియన్ టన్ను లను కేటాయించుకున్నట్లు తెలిపింది. ఈ బొగ్గు నోటిపై ధరపై సగటున 140శాతం ప్రీమియంను పొందింది.అక్టోబర్‌లో నార్తర్న్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ తన మొత్తం 0.21 ఆఫర్ చేసిన పరిమాణానికి కేటాయింపు జరగడంతో, 283శాతంతో అధిక ప్రీమియంను పొందింది. ఆ తర్వాత ఎన్ఇసి 209 శాతంతో, ఎంసి ఎల్ 181 శాతంతో, ఎస్‌సిఇఎల్ 162శాతంతో, ఇసి ఎల్ 132శాతంతో నిలిచాయి. బిసిసిఎల్ 29శాతంతో అత్యల్ప ప్రీమియంను నమోదు చేసింది. 2026–27 ఏప్రిల్–అక్టోబరు కాలానికి , సిఐఎల్ ఇ–వేలం ద్వారా 155.11 ఎంటిలను ఆఫర్ చేసి, నోటిఫైడ్ ధరపై సగ టున 68శాతం ప్రీమియంతో 68.90 మిలియన్ టన్నులు లేదా 44శాతాన్ని కేటాయించింది.

'ఐడిబిఐ ప్రైవేటీకరణ'ను మానుకోవాలి

- ముక్తకంఠంతో కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక డిమాండ్

న్యూఢిల్లీ : మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం భారత పారిశ్రామిక అభివృద్ధి బ్యాంక్ (ఐడిబిఐ) ప్రైవేటీకరణను తక్షణమే ఉపసంహరించుకుని, ప్రజా యాజమాన్యం, ఆర్థిక సార్వభౌమత్వాన్ని పరిరక్షించాలని 10 జాతీయ కార్మిక సంఘాలతో కూడిన జాయింట్ ప్లాట్‌ఫారమ్ ఆఫ్ సెంట్రల్ ట్రేడ్ యూనియన్స్ (జెపిసిటియు) ముక్తకంఠంతో డిమాండ్ చేసింది. ఏఐటియుసి, ఐఎన్‌టియుసి, సిఐటియు, హెచ్‌ఎంఎస్, ఏఐయుటియుసి, టియుసిసి, ఎస్ఇడబ్ల్యుఎ, ఏఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, యుటియుసిలతో కూడిన కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక (జెపిసిటియు) ఆదివారం ఇక్కడ విడుదల చేసిన ఒక సంయుక్త ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఐడిబిఐ బ్యాంక్‌లోని భారత కమిషన్, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి)ను విదేశీ నియంత్రణలో ఉన్న ప్రైవేట్ సంస్థకు బదిలీచేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని జెపిసిటియు తీవ్రంగా ఖండించింది. నివేదించబడిన అవకతవకలపై విచారణ జరపాలని, అమ్మకాన్ని నిలిపివేసి, లావాదేవీ పత్రాన్నింటినీ బహిరంగపర్చాలని ఈ కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక డిమాండ్ చేసింది. ఐడిబిఐ కేవలం మరొక వాణిజ్య బ్యాంక్ కాదని, ఇది భారతదేశ ఆర్థిక వ్యవస్థ పునాదులను బలోపేతం చేస్తూ, మౌలిక సదుపాయాల కల్పనలో చరిత్రాత్మక పాత్ర నిర్వర్తించిందని, దీనిని అమ్ముకునే ఆస్తిగా మార్చకూడదని హితవు పలికింది. కార్మిక సంఘాలు ఈ



తప్పుడు విధానాన్ని గట్టిగా తిరస్కరిస్తున్నాయని స్పష్టం చేసింది. ఆర్థిక సంస్థలను విదేశీ పెట్టుబడులకు అప్పగించాలనే 'ఆతృతలో, కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పదేపదే చేస్తున్న 'స్వదేశీ', 'ఆత్మనిర్భరత' అనే నినాదాలు డొల్లగా వినిపిస్తున్నాయని ఆరోపించింది. ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేయడం, ప్రజాస్వామ్యాన్ని పెంపొందించడం అవసరమని అభిప్రాయపడింది. లక్ష్మీ విలాస్ బ్యాంక్‌ను సింగపూర్‌కు చెందిన డిబిఎస్ బ్యాంక్ ఇండియాలో విలీనం చేయడం, ఎన్‌బిడిఇలో మెజారిటీ వాటాను కొనుగోలు చేయడం, సిఎస్‌బి బ్యాంక్‌లో 'ఫెయిర్‌ఫాక్స్'కు గణనీయమైన యాజమాన్యం ఉండటం వంటివి, విదేశీ లావాదేవీలు పెరుగుతున్న ఉనికిని సూచిస్తున్నాయని ఆరోపించింది. ఇవి నిర్మాణంలో విభిన్నంగా ఉన్నప్పటికీ, బ్యాంకింగ్ విధానం యొక్క అశుభకరమైన దిశకు నిదర్శనంగా నిలుస్తున్నాయని, భారత బ్యాంకింగ్ విదేశీకరణ, ఆర్థిక సార్వభౌమత్వంపై దాని ప్రభావం పట్ల ఈ ప్రతిపాదన తీవ్ర ఆందోళనను రేకెత్తిస్తోందని పేర్కొంది. 2026 అక్టోబరు 29నాటి బిజినెస్ వరల్డ్ రిపోర్ట్ సవరించిన పారామితుల ప్రకారం కొత్త వాల్యూయేషన్‌లు ప్రారంభించకముందే, ఐడిబిఐ అమ్మకం ప్రతిపాదన యొక్క సమగ్రతపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోందని జెపిసిటియు ధ్వజమెత్తింది. ఈ ఆరోపణలు తీవ్రమైనవని, వీటిపై స్వతంత్రంగా, కాలపరిమితితో కూడిన విచారణ జరిపించాలని, విలువ మదింపు పారామితులను మదింప చేయడానికిగల కారణాలను, ఈ ప్రక్రియ ప్రజా ప్రయోజనాలను తగినంతగా పరిరక్షించిందా? లేదా? అనే విషయాన్ని ప్రభుత్వం తప్పనిసరిగా వెల్లడించాలని, లేనిపక్షంలో, అది ప్రజా విశ్వాస ద్రోహం, న్యాయ అపహాస్యం, ఉద్దేశపూర్వకదాడిగా పరిగణించబడుతుందని జెపిసిటియు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. బాధ్యులను నిర్దాక్షిణ్యంగా జవాబుదారీగా చేయాలని డిమాండ్ చేసింది. ప్రజా ఆస్తులను అపారదర్శక పద్ధతులలో విక్రయించడం ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని ఆరోపించింది. పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కోరింది.జెపిసిటియు డిమాండ్లలో 1).వాటాల బదిలీ లేదా నిర్వహణాపరమైన పరిశీలన.2). బిడ్డింగ్, వాల్యుయేషన్, నిర్ణయ ప్రక్రియలలో నివేదించబడిన అవకతవకలపై ఒక స్వతంత్ర కాలపరిమితితో కూడిన విచారణ జరపాలి. 3). విలువ నిర్ధారణ నివేదికలు, సవరించిన విలువ నిర్ధారిత పద్ధతి, సంబంధిత పత్రాలతో సహా అన్ని లావాదేవీపత్రాలను పూర్తిగా వెల్లడించడం, బిడ్‌లు, ఎంపిక చేసిన ఆఫర్‌ను అంగీకరించడానికి నమోదు చేసిన కారణాలు. 4). లావాదేవీపై పార్లమెంటరీ పరిశీలన, ప్రభుత్వ యాజమాన్యంపై దాని ప్రభావాలు, గతంలో ఇచ్చిన హామీలు. 5). ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడం, ప్రభుత్వ యాజమాన్యం కింద ఐడిబిఐని బలోపేతం చేయడం, వినియోగదారుల ప్రయోజనాలు, దాని అభివృద్ధి పాత్రకు విధానపరమైన నిబద్ధత ఉన్నాయని తెలిపింది.

ఫైటర్ స్క్వాడ్రన్ల సంఖ్య పునరుద్ధరణ...

స్వదేశీ కార్యక్రమాల వేగవంతమే ప్రధాన ప్రాధాన్యతలు

- భారత వైమానిక దళం నూతన చీఫ్ అశుతోష్ దీక్షిత్ వెల్లడి

న్యూఢిల్లీ : భారత వైమానిక దళానికి (ఐఎఎఫ్) మంజూరైన స్క్వాడ్రన్ ఫైటర్ల సంఖ్యను పునరుద్ధరించడం, తేజస్, అడ్వాన్స్‌డ్ మీడియం కొంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ (ఏఎంసిఎ) వంటి స్వదేశీ కార్యక్రమాలను వేగవంతం చేయడం, త్రివిధ దళాల సమన్వయాన్ని బలోపేతం చేయడం వంటివి తన ప్రధాన ప్రాధాన్యతలుగా ఉంటాయని భారత వైమానికదళం నూతన అధిపతి అశుతోష్ దీక్షిత్ ఆదివారం తెలిపారు. 29వ వైమానిక దళాధిపతిగా శనివారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మరుసటి రోజు మాట్లాడుతూ ఆయన తాను ప్రధానంగా దృష్టి కేంద్రీకరించే రంగాలను 'వాయు' (విఏవైయు) అనే సంక్షిప్త నామంతో వివరించారు. అప్రమత్తత, కార్యాచరణ సంసిద్ధత, ఆత్మ నిర్భరత, యుక్తి (వ్యూహాత్మక నూతనత్వం), త్రివిధ దళాల సమష్టి కృషిగా తన దార్శనికతను నిర్వచించారు. ఆత్మ నిర్భరతకు తన ప్రాధాన్యతను నొక్కిచెపుతూ, 3,500గంటలకు పైగా విమానయాన అనుభవం ఉన్న నిష్ణాతుడైన పైలట్ అశుతోష్ దీక్షిత్, తేజస్ లైట్ కొంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ (ఎల్‌సిఎ ఎంకె ఐఎ), ఎల్‌సిఎ ఎంకె 2, దీంతో పాటు ఏఎంసిఎ కార్యక్రమాలు తన 'అత్యంత ప్రాధాన్యత'గా ఉంటాయని చెప్పారు. ఐఏఎఫ్ కోసం రూ.1.10లక్షల కోట్లకు పైగా వ్యయంతో 180 ఎల్‌సిఎ ఎంకె ఐఎ జెట్‌లను కొనుగోలు చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) తో రెండు వేర్వేరు ఒప్పందాలు కుదుర్చుకుంది. ఏరోనాటికల్స్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడిఎ) హెచ్ఏఎల్ ఎల్‌సిఎ ఎంకె 2 వేరియంట్‌పై పనిచేస్తుండగా, ఏఎంసిఎ అభివృద్ధికి సంబంధించిన ఫ్రేమ్ వర్క్‌ను ఖరారు చేస్తున్నారు. 'తేజస్ ఎంకె ఐఎ, 2, ఏఎంసిఎ, భారతీయ సెన్సార్లు, భారతీయ ఆయుధాలకు మేం



అత్యంత ప్రాధాన్యతనిస్తాం. మేం భారతీయ పరిష్కారాలతోనే పోరాడతాం. మా కార్యాచరణ అవసరాలకు తగిన సంఖ్యలో వాటిని అందుబాటులో ఉంచుకుంటాం. పోరాడి గెలవడమే మా బాధ్యత, కానీ అన్నింటికంటే ముఖ్యంగా విశ్వసనీయమైన వాయుశక్తి ద్వారా సంఘర్షణను నివారించడం మా బాధ్యత' అని రేస్‌కోర్స్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ల పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన లాంఛనప్రాయ గౌరవ వందనం అనంతరం అశుతోష్ దీక్షిత్ విలేకరులతో మాట్లాడారు. భారత వైమానిక దళం పోరాట శక్తిని మంజూరైన స్థాయికి 'పునరుద్ధరించడం' కూడా తన ప్రధాన కర్తవ్యం అవుతుందని కూడా ఎయిర్ చీఫ్ మార్షల్ తెలిపారు. అధికారికంగా ప్రకటించిన 40 ఫైటర్ స్క్వాడ్రన్ల సంఖ్య 30కి తగ్గడంతో, యుద్ధ విమానాల కొరతతో ఐఏఎఫ్ సతమతం అవుతోంది. మన భద్రతా వాతావరణం సవాల్‌గానే ఉంది. అంతేకాకుండా, డ్రోన్లు, సుదూర ఖచ్చితత్వ ఆయుధాలు, అంతరిక్షం, సైబర్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), విద్యుదయాస్కాంత వర్ణపటం వంటి కొత్త సాంకేతికతలు, వ్యవస్థల ద్వారా యుద్ధ స్వరూపం పునర్నిర్మిస్తోంది' అని యాన అన్నారు. ఆత్మనిర్భరత గురించి వివరిస్తూ , స్వదేశీ ప్లాట్‌ఫారమ్‌లు, ఆయుధాలు ప్రవేశపెట్టాల్సిన అవసరాన్ని అశుతోష్ దీక్షిత్ నొక్కిచెప్పారు. వాయుసేన నాయకులు, అగ్నివీరులు, పౌరులు, మాజీ సైనికులు, వీరనారులు వారి కుటుంబాల సంక్షేమానికి తాను ప్రాధాన్యత ఇస్తానని వాయుసేన చీఫ్ నొక్కిచెప్పారు. దీక్షిత్ తన పూర్వ అధికారి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపి.సింగ్‌ను కూడా ప్రశంసించారు. ఆయన నాయకత్వంలో భారత వైమానిక దళం 'ఆపరేషన్ సిందూర్ సమయంలో ఖచ్చితమైన, నిర్ణయాత్మక వాయుశక్తి ఏమి సాధించగలదో ప్రదర్శించిందని దీక్షిత్ పేర్కొన్నారు. అత్యంత సన్నద్ధతతో ఉన్న బలగాన్ని అప్పగించినందుకు ఏపి.సింగ్‌కు ధన్యవాదాలు అని అశుతోష్ దీక్షిత్ చెప్పారు. గౌరవవందనం స్వీకరించడానికి ముందు నూతన ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ అమరవీరుల గౌరవార్థం జాతీయ యుద్ధ స్మారకం (ఎన్‌డబ్ల్యుఎం) వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. ఆయన వేడుకకు ముందు కుటుంబ సభ్యులతో కలిసి తన తల్లి నిర్మలా దీక్షిత్, అత్త కమలాపాందేల పాదాలను తాకి ఆశీర్వాదం తీసుకున్నారు. పర్యావరణ అనుకూల రవాణాకు ఆయన ఇస్తున్న ప్రోత్సాహానికి నిదర్శనంగా కొత్త వైమానిక దళ అధిపతి ఎలక్ట్రిక్ వాహనంలో పరేడ్ మైదానానికి చేరుకున్నారు.

బెంగళూరు-ముంబయి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు షురూ

బెంగళూరు : రెండు ప్రధాన మహానగరాలైన బెంగళూరు, ముంబయిల మధ్య రాత్రిపూట రైలు అనుసంధానాన్ని బలోపేతం చేస్తూ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఆదివారం నాడు వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ తొలి ప్రయాణాన్ని జెండా ఊపి ప్రారంభించారు. కర్ణాటకకు వెళ్లే తదుపరి వందే భారత్ స్లీపర్ రైలు బెంగళూరు నుంచి బయలుదేరి, ఉత్తర కర్ణాటకలోని వివిధ ప్రాంతాలను కలుపుతూ హుబ్బళ్లి వైపు వెళ్లి, ఆ తర్వాత పుణె, ముంబైల వైపు ప్రయాణిస్తుందని కూడా ఆయన ప్రకటించారు. బెంగళూరులోని సర్ ఎం విశ్వేశ్వరయ్య టెర్మినల్ (ఎస్ఎంవిటి) నుంచి బయలుదేరిన 16 కోచ్‌ల వందే భారత్ స్లీపర్ రేక్‌తో కూడిన ఈ తొలి ప్రత్యేక రైలు, సోమవారం ఉదయం 6.15 గంటలకు ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ (సిఎస్ఎంటి)కు చేరుకుంటుందని అధికారులు తెలిపారు. కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, హెచ్ డి కుమారస్వామి, రాష్ట్ర మంత్రులు వి సోమన్న, శోభా కరంద్లాజే, పార్లమెంట్ సభ్యులు తేజస్వి సూర్య, పి సి మోహన్, సి ఎన్ మంజునాథ్ తదితరులు



హాజరయ్యారు. ముంబయి-బెంగళూరు మార్గంలో నవంబర్ 2 నుండి, తిరుగు ప్రయాణంలో నవంబర్ 3 నుండి రైలు సాధారణ సేవలు ప్రారంభమవుతాయని నైరుతి రైల్వే తెలిపింది. బెంగళూరు నుండి ముంబయికి వెళ్లే రైలు నెం. 27652 సోమవారాలు మినహా వారానికి ఆరు రోజులు నడుస్తుంది. ఇది ఎస్ఎంవిటి బెంగళూరు నుండి రాత్రి 7.45 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 11.55 గంటలకు సిఎస్ఎంటి ముంబయి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో, రైలు నెం. 27651 ఎస్ఎంవిటి ముంబయి నుండి రాత్రి 8.10 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం ఎస్ఎంవిటి బెంగళూరు చేరుకుంటుంది. ఈ సర్వీసు మంగళవారాలు మినహా వారానికి ఆరు రోజులు నడుస్తుంది. నేడి ఐటి, స్టార్టప్ రాజధాని అయిన బెంగళూరును, ఆర్థిక రాజధాని అయిన ముంబయితో వందే భారత్ స్లీపర్ అనుసంధానించనుందని, ఇందుకు సహకరించిన ఎంపిలు, మంత్రులు, కర్ణాటక ప్రజలు, రైల్వే అధికారులు, సిబ్బంది అందరికీ నా హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని సభను ఉద్దేశించి వైష్ణవ్ అన్నారు. ఈ రైలు బెంగళూరు నుంచి బయలుదేరి, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, గుంతకల్ మీదుగా ప్రయాణించి, ఆ తర్వాత రాయచూర్, యాద్గిర్, కలబురగిలను కలుపుతూ కర్ణాటకలోకి తిరిగి ప్రవేశిస్తుందని ఆయన అన్నారు.

జోషిమఠ్ హెలికాప్టర్ ప్రమాదం

మృతదేహాల వెలికితీత

చమోలి : ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్ సమీపంలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన ఆరుగురి మృతదేహాలను ఆదివారం ఉదయం వెలికితీసి రిషికేశ్‌లోని ఎయిమ్స్‌కు పంపినట్లు చమోలి జిల్లా యంత్రాంగం తెలిపింది. శుక్రవారం, బద్రీనాథ్ పుణ్యక్షేత్రం నుంచి డెహ్రాడూన్‌కు తిరిగి వస్తుండగా, జోషిమఠ్‌లోని చాయ్ గ్రామం సమీపంలో ఒక కొండపై హెలికాప్టర్ కూలిపోయింది. మృతదేహాలను రోడ్డు మార్గంలో జోషిమఠ్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్‌సి)కి తీసుకువచ్చారు. అవసరమైన లాంఛనాలను పూర్తి చేసిన తర్వాత, మృతదేహాలను హెలికాప్టర్ ద్వారా రిషికేశ్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)కు పంపినట్లు అధికారులు తెలిపారు. దుర్గమమైన, ఎత్తైన కొండ ప్రాంతంలో సవాలుతో కూడిన పరిస్థితుల మధ్య భారత సైన్యం, ఐటిబిపి, ఎస్‌డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్, పోలీసులు, జిల్లా యంత్రాంగం, అటవీ శాఖ బృందాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయని జిల్లా యంత్రాంగం తెలిపింది. 'మృతులందరూ ఆరుగురి మృతదేహాలను రెస్క్యూ బృందాలు కష్టతరమైన పర్వత మార్గాల గుండా కాలినడన బయటకు తీశాయి' అని ఆదివారం జిల్లా



యంత్రాంగం జారీ చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. హెలికాప్టర్ కూలిపోయిన తర్వాత శుక్రవారం ఈ ఆపరేషన్ ప్రారంభమైంది, కానీ కష్టతరమైన భూభాగం, మారుమూల ప్రదేశం కారణంగా, బృందాలు ఈ ఆపరేషన్‌ను పూర్తి చేయడానికి 24 గంటలకు పైగా సమయం పట్టింది.

ఇతర బలగాలకు చండీగఢ్ పోలీసులు ఆదర్శం

కొనియాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా

చండీగఢ్ : చండీగఢ్ పోలీసులు తమ విధులను అత్యుత్తమంగా నిర్వహించారని, దేశవ్యాప్తంగా ఉన్న ఇతర పోలీసు బలగాలకు ఆదర్శంగా నిలిచారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదివారం పేర్కొన్నారు. వారిని అభినందించారు. 1966 నుండి చండీగఢ్



పోలీసులు నగరాన్ని రక్షించేందుకు అవిశ్రాంతంగా కృషి చేశారని, తద్వారా దేశ పోలీసు చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయాన్ని లిఖించారని ఆయన అన్నారు. గత 60 ఏళ్లుగా, ఉత్తర ప్రాంతానికి కేంద్ర బిందువుగా ఉన్న చండీగఢ్, భారతదేశ భద్రతకు తనవంతు సహకారాన్ని అందించడంలో విజయవంతమైందని విశ్వసిస్తున్నానని చెప్పారు. చండీగఢ్ పోలీసుల 60వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అమిత్ షా, ఆ బలగానికి 'ప్రెసిడెంట్స్ కలర్' (రాష్ట్రపతి గౌరవ చిహ్నం)ను ప్రదానం చేశారు. చండీగఢ్ పోలీసులు తమ విధులను అసాధారణ రీతిలో నిర్వహించారని, దేశంలోని ఇతర పోలీసు బలగాలకు ఒక ప్రమాణాన్ని (బెంచ్‌మార్క్) నెలకొల్పారని ఆయన కొనియాడారు. ఈ 'ప్రెసిడెంట్స్ కలర్' గౌరవం, ఆ బలగం అందించిన ఆరు దశాబ్దాల సేవ, అంకితభావం, నిబద్ధతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. భారతదేశాన్ని మాదకద్రవ్య రహిత దేశంగా మార్చేందుకు మనం కట్టుబడి ఉన్నామని పేర్కొన్న అమిత్ షా, 'దేశంలో ఏదైనా ఒక పోలీసు విభాగం ముందుగా మాదకద్రవ్య రహిత విభాగంగా మారితే, అది కచ్చితంగా చండీగఢ్ పోలీసులే అవుతారని నమ్ముతున్నాను' అని అన్నారు. చండీగఢ్ పోలీసు విభాగంలో అమరులైన వారికి నివాళులర్పించిన అమిత్ షా, విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేయడం అనేది ఒక సైనికుడికి, అలాగే వారు పనిచేసిన సంస్థకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. చండీగఢ్ పోలీసు విభాగంలో కొత్తగా చేర్చిన 141 వాహనాల గురించి ప్రస్తావిస్తూ, ఇవి స్పందన సమయం (రెస్పాన్స్ టైమ్), గస్తీ, కదలిక సామర్థ్యం, సాంకేతికత, ఆధునిక పోలీసింగ్ వ్యవస్థను గణనీయంగా బలోపేతం చేస్తాయని ఆయన చెప్పారు. ప్రస్తుతం స్పందన సమయం విషయంలో చండీగఢ్ పోలీసులు దేశంలోనే రెండో స్థానంలో ఉన్నారని, ఈ 141 కొత్త వాహనాల రాకతో వచ్చే ఏడాది నాటికి దేశవ్యాప్తంగా ఉన్న పోలీసు బలగాల్లో వారు అగ్రస్థానానికి చేరుకుంటారని తాను నమ్ముతున్నానని ఆయన పేర్కొన్నారు.

కన్నడ జెండాకు అధికారిక

'రాష్ట్ర జెండా' హోదా కల్పిస్తాం

ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ స్పష్టీకరణ

బెంగళూరు : పసుపు, ఎరుపు రంగులు కలిగిన కన్నడ జెండాకు అధికారిక 'రాష్ట్ర జెండా' హోదా కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ స్పష్టం చేశారు. ప్రభుత్వ భవనాలపై జాతీయ జెండాతో పాటు ఈ కన్నడ జెండాను కూడా ఎగురవేసేలా చట్టపరమైన ఏర్పాట్లు చేస్తామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన 'కర్ణాటక రాజ్యోత్సవం' సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డికె ప్రసంగిస్తూ, రాబోయే బెళగావి శాసనసభ సమావేశాల్లో ఈ అంశంపై చర్చిస్తామని ఆయన చెప్పారు. 'ఇప్పుడే మీరు జాతీయ జెండాను ఎగురవేయడాన్ని చూశారు. ఆ జాతీయ జెండా పక్కనే, నేను కన్నడ జెండాను ఎగురవేశాను. ఈ కన్నడ జెండాకు అధికారిక రాష్ట్ర జెండా హోదా కల్పించే విషయంపై ప్రభుత్వం ఇప్పటికే చర్చలు జరిపింది' అని శివకుమార్ అన్నారు. గతంలో కూడా తాము మంత్రివర్గంలో నిర్ణయం తీసుకుని కేంద్ర ప్రభుత్వానికి అభ్యర్థన పంపామని, కానీ దానికి గుర్తింపు లభించలేదు అని ఆయన తెలిపారు. ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, బెళగావి శాసనసభ సమావేశాల్లో దీనిపై చర్చిస్తామని చెప్పారు. ఈ విషయాన్ని చర్చకు తీసుకుచ్చి,



మంత్రివర్గంలో నిర్ణయం తీసుకుంటానని, చట్టపరమైన చట్రాన్ని రూపొందిస్తానని చెప్పారు. జాతీయ జెండాను ఎగురవేసే ప్రతి ప్రభుత్వ భవనంపై, దాని పక్కనే ఈ కన్నడ జెండాను కూడా ఎగురవేసేలా అధికారిక నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. కర్ణాటకకు ఎలాగైతే సొంత రాష్ట్ర గీతం ఉందో, అలాగే కన్నడిగుల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఒక అధికారిక రాష్ట్ర జెండా ఉండాలనేది తమ ప్రభుత్వ ఆకాంక్ష అని శివకుమార్ పేర్కొన్నారు. భారతమాత పుత్రిక అయిన 'కర్ణాటక మాత' కోసం ఎలాగైతే రాష్ట్ర గీతం ఉందో, అలాగే కన్నడిగుల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే అధికారిక రాష్ట్ర జెండా ఉండాలని తాము కోరుకుంటున్నామని ఆయన అన్నారు. ఇప్పటికే ఈ పసుపు-ఎరుపు రంగు జెండా కన్నడిగుల మనోభావాలకు ప్రతీకగా మారిందని చెప్పారు. 'కర్ణాటక జ్ఞాన సంప్రదాయం, సంస్కృతి, మత సామరస్యం, శాంతిని చాటిచెప్పే ఈ జెండాకు అధికారిక గుర్తింపునిచ్చి, రాష్ట్ర జెండా హోదా కల్పించాలని తాము ఆలోచిస్తున్నాము' అని ఆయన చెప్పారు.

ఇద్దరు ఇఆర్‌ఒలను సస్పెండ్ చేయండి

యుపి ఇసిఒకు ఎన్నికల సంఘం ఆదేశం

న్యూఢిల్లీ : ఉత్తర ప్రదేశ్‌లోని పిలిభిత్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఇద్దరు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను (ఇఆర్‌ఒలను) సస్పెండ చేయాలని, వారిపై నమోదైన ఎఫ్ఐఆర్‌కు శిక్షా నిబంధనను జతచేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. శనివారం ఉత్తర ప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారికి (ఇసిఒ) రాసిన లేఖలో, ఇఆర్‌ఒలు మయాంక్ గోస్వామి, హేమంత్ చౌదరిలను తక్షణమే సస్పెండ్ చేయాలని కమిషన్ ఆదేశించింది. వారి ఛార్జ్ షీట్లను పరిశీలన (వెట్టింగ్) కోసం ఇసికి సమర్పించాలి, కమిషన్ ముందస్తు అనుమతి లేకుండా వారిని తిరిగి విధుల్లోకి తీసుకోలేరు. ఈ ఇద్దరు అధికారులు, ఓటర్ రిజిస్ట్రేషన్ కేంద్రం కంప్యూటర్ ఆపరేటర్ అనిల్ కుమార్‌పై ఇప్పటికే ఉన్న ఎఫ్ఐఆర్‌కు భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), 2023లోని సెక్షన్ 198ను జతచేయాలని కూడా ఎన్నికల సంఘం ఆదేశించింది. వారి కేసులను కఠినంగా విచారించాలని ఎన్నికల సంఘం పేర్కొంది. కేవలం ఒక అధికారి ఇచ్చిన లిఖితపూర్వక వివరణ ఆధారంగా, తమ సిఫార్సు మేరకు ప్రారంభించిన విచారణను నిలిపివేసే ముందు క్రమశిక్షణా అధికారులు తప్పనిసరిగా తమను సంప్రదించాలని కమిషన్ స్పష్టం చేసింది. ప్రధానంగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) వంటి ప్రతిపక్ష పార్టీలు పెద్ద ఎత్తున ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని ఆరోపించడంతో ఈ వివాదం చెలరేగింది. పిలిభిత్‌లో లాగిన్ వివరాలను దుర్వినియోగం చేశారన్న ఫిర్యాదుల నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఓటరు నమోదు కేంద్రాలలోని కంప్యూటర్ సహాయకుల ఇసిఐ నెట్ పోర్టల్ ఐడిలను నిష్క్రియం చేయాలని ఉత్తర ప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి నవదీప్ రిన్వా గతంలో జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. తమ కింద ఆపరేటర్లుగా పనిచేస్తున్న కంప్యూటర్ సహాయకుల లాగిన్ ఐడిలను నిష్క్రియం చేసిన తర్వాత, సంబంధిత ఇఆర్‌ఒల నుండి ధృవీకరణ పొందాలని కూడా జిల్లా ఎన్నికల అధికారులను కోరారు.

పిలిభిత్ అసెంబ్లీ నియోజకవర్గంలో 10,470 ఓటర్ల నమోదులలో జరిగిన అవకతవకలపై వచ్చిన ఆరోపణలపై జరిపిన విచారణ అనంతరం ఈ చర్య తీసుకున్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client, Syed Jamal Uddin S/o. Khaja Fareed Uddin, R/o. H.No. 2-1-318/2, Kurannapet, Nirmal Dist : Nirmal. I hereby issuing this Public Notice that, Syed Jamal Uddin S/o. Khaja Fareed Uddin is the owner and possessor of the Plot bearing No. 9, in Sy.No. 844, total extent 2312.05 Sq.Fts., = 256.94 Sq. Yds., situated at Kurannapet, Harijanwada, under Municipality, Nirmal, Dist : Nirmal, bounded by :- East : Open Land of others, West : Open Plot Nos. 8 & 10, North : 30' Wide Road, South : Open Plot No. 11, having purchased the Plot from his Vendor Amjad Ali Khan under Regd. Sale deed No. 4713/2014 dt : 17-09-2014 of SRO, Nirmal.

That the Vendor derived title to the property through Regd. Sale deed No.7543/2013 dt : 8-11-2013 of SRO, Nirmal which is the link document. That after purchase of above plot, Syed Jamal Uddin has constructed the house over the plot, and the Municipality, Nirmal has allotted the H.No. 2-2-21/20/4/7 of Kurannapet, Harijanwada, Nirmal.

The Regd. Sale Deed No. 7543/2013 dt : 08-11-2013 was lost by him, on 2-10-2026 when he was going to Gayatri Bank, Br : Nirmal on Motor Cycle. The said document could not traced out in spite of best search to his level best. That he is intending to create mortgage of the above property in favour of Gayatri Urban Bank, Br : Nirmal for availing Loan. That he has obtained the certified copy of the said Regd. Sale Deed No. 7543/2013 dt : 08-11-2013 from the SRO, Nirmal.

The said property can be accepted by the bank for the proposed loan, No person will have any rights, title or interest over the said property, if anybody has got any objection, title or interest over the property they may approach within (7 days) from the date of this notice.

Hence this Public Notice.

Date : 01-11-2026
Place : Nirmal

Sd/- CH. JAYANTH KUMAR
B.A., LL.M., Advocate,
Nirmal.
Cell: 9440208007

రైతులు, వ్యవసాయ పారిశ్రామికవేత్తలకు

'కృషి గౌరవ్ సమ్మాన్' పురస్కారం

షిల్లాంగ్ : సుస్థిర వ్యవసాయం, గ్రామీణ వ్యవస్థాపకతకు చేసిన సేవలకు గాను మేఘాలయకు చెందిన ఆరుగురు రైతులు, వ్యవసాయ పారిశ్రామికవేత్తలకు 'కృషి గౌరవ్ సమ్మాన్ 2026' పురస్కారం ప్రదానం చేసినట్లు అధికారులు ఆదివారం తెలిపారు. రిభోయ్ జిల్లాలోని ఉమియాంలో ఉన్న సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ (సిఎయు)కి చెందిన కాలేజ్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ ఇన్ అగ్రికల్చరల్ సైన్సెస్ (సిపిజిఎస్ఎఎస్)లో శనివారం జరిగిన అకడమిక్ అసెంబ్లీ 2026లో ఈ పురస్కారాలను ప్రదానం చేసినట్లు వారు తెలిపారు. ఈ పురస్కార గ్రహీతలలో ఆధునిక చిరుధాన్యాల సాగుకు మార్గదర్శకత్వం వహించి, దాని సాగును ప్రోత్సహించినందుకు వెస్ట్ గారో హిల్స్‌లోని సదోల్‌పారా గ్రామానికి చెందిన చెక్‌జింగ్ సంగ్మా; చిరుధాన్యాలకు విలువ ప్రోత్సహించినందుకు వెస్ట్ జైంతియా హిల్స్‌లోని ఖందూలి గ్రామానికి చెందిన దరప్‌బియాంగ్ ములియా; మేఘాలయ సాంప్రదాయ చిరుధాన్యాల వారసత్వాన్ని పరిరక్షించినందుకు ఖందూలికి చెందిన సిత్రియన్ సురోంగ్ ఉన్నారు. పశ్చిమ జైంతియా హిల్స్‌లోని ములియే గ్రామానికి చెందిన 'మేఘాలయ లకడాంగ్ లేడీ'గా ప్రసిద్ధి చెందిన ట్రినిటీ సయో, దేశీయ లకడాంగ్ పసుపు సాగును ప్రోత్సహించినందుకు ఆయనకు సత్కారం లభించింది. రిభోయ్ జిల్లాలోని థాడ్నాంగ్నియావ్ గ్రామానికి చెందిన జెమ్మడ మార్వెన్, దేశీయ పంటలు, వ్యవసాయ జీవవైవిధ్యాన్ని పరిరక్షించినందుకు అవార్డును అందుకున్నారు. కాగా, రిభోయ్‌లోని



మార్నగర్‌లో ఉన్న మణిపూర్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ అయిన మిడాట్ ఎం బినో, సాంప్రదాయ సుగంధ ద్రవ్యాల పంటలను ప్రపంచ మార్కెట్ అవకాశాలుగా మార్చడంలో ఆయన చేపట్టిన వ్యవసాయ పారిశ్రామిక కార్యక్రమాలకు గుర్తింపు పొందారు. మేఘాలయలో సాంప్రదాయ చిరుధాన్యాల సాగును పునరుద్ధరించడానికి, ప్రోత్సహించడానికి చేసిన కృషికి గాను, అవార్డు గ్రహీతలలో ఇద్దరిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 139వ ఎపిసోడ్‌లో ఇంతకుముందు ప్రశంసించారు. 'ఎన్ఇపి 2020 ద్వారా తరగతి గదుల పరివర్తన: దేశీయ జ్ఞానం, సంస్కృతి, అనుభవపూర్వక అభ్యాసాన్ని ఏకీకృతం చేయడం' అనే ఇతివృత్తంతో పూర్వోత్తర్ జనజాతి శిక్షా సమితి (పిజెఎస్ఎస్), సిపిజిఎస్ఎఎస్, సిఎయు సంయుక్తంగా అకడమిక్ అసెంబ్లీని నిర్వహించాయి. ఈ సభను ఉద్దేశించి సిఎయు వైస్ ఛాన్సలర్ డాక్టర్ అనుపమ్ మిశ్రా మాట్లాడుతూ, సుస్థిర వ్యవసాయ అభివృద్ధి కోసం దేశీయ జ్ఞానాన్ని ఆధునిక శాస్త్రీయ ఆవిష్కరణలతో అనుసంధానించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

బిజెపి కన్నాట్ ప్లేస్‌లో దుకాణాలను

బలవంతంగా మూసివేయించింది

- ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మండిపాటు
- ఢిల్లీ వచ్చిన వారు షాపింగ్ చేయాలని సూచన

న్యూఢిల్లీ : ఢిల్లీ కన్నాట్ ప్లేస్‌లోని దుకాణాలను బిజెపి బలవంతంగా మూయించిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అధికార పార్టీ ఎలా దుకాణదారులకు నష్టం కలిగిస్తుందో దేశం గమనిస్తోందని ఆయన పేర్కొన్నారు. మింటో రోడ్ కన్నాట్ ప్లేస్ జంక్షన్ వైపు వెళ్తున్న ఒక వాహనంలో (ఓపెన్ క్యాంటర్) ప్రయాణిస్తున్నప్పుడు తీసిన వీడియోలో, ప్రతిపక్ష ఇండియా కూటమి నిర్వహించే ర్యాలీకి హాజరయ్యేవారు ఇక్కడ షాపింగ్ చేయాలని, తద్వారా స్థానిక దుకాణదారులకు ప్రయోజనం చేకూరుతుందని తాము కోరామని రాహుల్ గాంధీ చెప్పారు. కానీ కన్నాట్ ప్లేస్‌కు చేరుకున్నాక బిజెపి అన్ని దుకాణాలను బలవంతంగా మూయించిందని తెలిసిందని, కాషాయ పార్టీ ఎలా దుకాణదారులకు నష్టం కలిగిస్తుందో దేశం చూస్తోంది అని రాహుల్ గాంధీ అన్నారు. శనివారం రాత్రి, 'ఇండియా' కూటమి నిర్వహించే మార్చ్, ర్యాలీ కోసం రాజధానికి వస్తున్న ప్రజలను ఉద్దేశించి రాహుల్ గాంధీ మాట్లాడుతూ దీపావళికి ముందు షాపింగ్ చేసి స్థానిక వ్యాపారులకు మద్దతు ఇవ్వాలని కోరారు. బిజెపి అపోహలు



సృష్టిస్తున్నప్పటికీ ప్రతిపక్షాల కార్యక్రమం వల్ల వ్యాపారులకు ఎటువంటి నష్టం జరగదని ఆయన స్పష్టం చేశారు. ఎక్స్ వేదికగా విడుదల చేసిన ఒక వీడియో సందేశంలో, 'ఇది పండుగల సీజన్. దీపావళి, ఛత్ పూజ, భాయ్ దూజ్ పండుగలు వచ్చాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ఢిల్లీకి వస్తున్న లక్షలాది మంది ప్రజలు స్థానిక వ్యాపారులకు మద్దతు ఇవ్వాలని నేను కోరుకుంటున్నాను' అని ఆయన అన్నారు. మార్చ్‌లో పాల్గొనడం, ర్యాలీకి హాజరవ్వడంతో పాటు, కొంచెం షాపింగ్ కూడా చేయండి అని రాహుల్ గాంధీ సూచించారు. దీనివల్ల స్థానిక వ్యాపారులకు మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. 'మా ర్యాలీ వల్ల వ్యాపారులకు ఎలాంటి నష్టం జరగదని నాకు తెలుసు. బిజెపి భయపడి అపోహలను ప్రచారం చేస్తోంది' అని ఆయన అన్నారు. లక్షలాది మంది ప్రజలు స్థానిక చిన్న వ్యాపారుల దుకాణాల నుండి వస్తువులను కొనుగోలు చేస్తారని, మీ అందరికీ ఎంతో ప్రేమతో... దీపావళి శుభాకాంక్షలు. జై హింద్ అని రాహుల్ గాంధీ అన్నారు.

3న రాష్ట్రాలు, యుటిల పిఎసి చైర్‌పర్సన్ల సదస్సు

న్యూఢిల్లీ : భారత పార్లమెంటు, రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల శాసనసభల పబ్లిక్ అకౌంట్స్ కమిటీల (పిఎసి) చైర్‌పర్సన్‌ల సదస్సును లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నవంబర్ 3న కేరళలోని తిరువనంతపురంలో ప్రారంభించనున్నారు. ఈ సదస్సు ప్రారంభోత్సవానికి కేరళ ముఖ్యమంత్రి విడి సతీసన్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, కేరళ అసెంబ్లీ స్పీకర్ తిరువంచూర్ రాధాకృష్ణన్, కేరళ అసెంబ్లీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్‌పర్సన్ కె.ఎన్. బాలగోపాల్ హాజరుకానున్నారు. ఈ మేరకు లోక్‌సభ సచివాలయం ఒక ప్రకటనను విడుదల చేసింది. పార్లమెంటు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్‌పర్సన్ కె.సి. వేణుగోపాల్ స్వాగతోపన్యాసం చేయనుండగా, కేరళ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ షానిమోల్ ఉస్మాన్ వందన సమర్పణ చేస్తారు. ఈ సదస్సులో పార్లమెంటు, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభల పబ్లిక్ అకౌంట్స్ కమిటీల చైర్‌పర్సన్‌లు, సభ్యులతో పాటు ఇతర ప్రముఖ అతిథులు పాల్గొంటారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సు, 'ఆడిట్, జవాబుదారీతనం, సుపరిపాలన- పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఎసి) అభివృద్ధి చెందుతున్న పాత్ర' అనే అంశంపై చర్చిస్తుంది. సదస్సులో ప్రజా వ్యయంపై శాసనసభ పర్యవేక్షణను నిర్ధారించడంలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీల పాత్రను బలోపేతం చేసే మార్గాలను అన్వేషించడానికి, అనుభవాలను పంచుకోనున్నారు.

అణుక్షేత్రాలు ధ్వంసం (మొదటి పేజీ తరువాయి)

ఎప్పుడు దాడి చేస్తారని పదే పదే అడుగుతున్నారు,నేను అందరికీ చెప్పి దాడి చేస్తానా?'' అని ట్రంప్ మీడియా సమావేశంలో ప్రశ్నించారు.
మధ్యంతర ఎన్నికలు ముగిసిన వెంటనే ఇరాన్‌పై దాడులకు అవకాశాలున్నాయని గల్ఫ్ మిత్రదేశాలను ట్రంప్ అప్రమత్తం చేసిన తర్వాత కీలకమైన యుద్ధ నాయకులతో మొజ్తాబా ఖమేనీ సమావేశం జరిపి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శత్రువులు మరోసారి సైనిక లేదా ఉగ్రవాద దాడులకు దిగితే భౌగోళిక పరిధులకు అతీంగా ప్రతిఘటించాలని ఆయన ఆదేశించినట్లు ప్రకటన తెలియజేసింది.''యుద్ధం ఎప్పుడు—ఎలా ముగించాలో మాకు తెలుసు,ఏ పరిస్థితుల్లో ఆ యుద్ధాన్ని ముగించాలో ఇస్లామిక్ రిపబ్లిక్ సాయుధ దళాలకు తెలుసు,ఈ విషయాన్ని ఇరాన్ దేశమే నిర్ణయిస్తుంది'' అని ఖమేనీ హెచ్చరించారు.సాయుధ దళాల ప్రధానాధిపతి అలీ అబ్దుల్లాహి, సైనిక బలగాల ప్రధానాధిపతి అమీర్ హతామీ,ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కమాండర్ అహ్మద్ వాహిదీ ఇతర సీనియర్ సైనిక అధికారులతో ఖమేనీ సమావేశమైనట్లు అరబ్ వార్తాసంస్థలు తెలియజేశాయి. ఈ విధంగా మొట్టమొదటిసారి సైనిక అధికారులతో మొజ్తాబా ఖమేనీ సమావేశం జరిగింది.

షరతులు ఒప్పుకుంటే వారం రోజుల్లో హోర్ముజ్ తెరుస్తాం

ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మేజర్ జనరల్ మొహ్సెన్ రెజాయీ ఆదివారం ఎక్స్ వేదికగా ఒక ప్రకటన చేస్తూ,దౌత్య చర్యలకు ఇంకా మార్గాలు తెరచే ఉన్నాయని అన్నారు. ఇరాన్ చెప్పిన షరతులను గనుక అమెరికా నెరవేరిస్తే వారం రోజుల వ్యవధిలో హోర్ముజ్ జలసంధిని రాకపోకలకు తెరుస్తామని చెప్పారు.ఇరాన్ ఏడు షరతులు విధించిందని,ఈ మేరకు అమెరికాకు లిఖితపూర్వకంగా ప్రతిపాదనలు పంపామని,కానీ స్పందించలేదని,ఈ షరతులు ఒప్పుకుంటే యుద్ధం ముగిసిపోతుందని పేర్కొన్నారు.పశ్చిమాసియా నుండి అమెరికా సేనలు ఖాళీ చేసి వెళ్ళిపోవడం,స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయడం,హోర్ముజ్ జలసంధిలో దిగ్బంధనాన్ని ఎత్తివేయడం,ఇంకెప్పుడూ దాడులు చేయబోమని హామీ ఇవ్వడం, లెబనాన్, గాజా సహా అన్ని రంగాలలో యుద్ధం నిలిపివేయడం వంటి షరతులను ఇరాన్ విధించింది. కాగా విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి ఆదివారం స్పందిస్తూ, లెబనాన్ సహా అన్ని రంగాలలో యుద్ధం ఆపేయాలని తాము కోరామని అన్నారు. యుఎస్ అధికారులను తాము కలిసేదిలేదని,కానీ మీడియాలో వదంతులు వస్తున్నాయన్నారు. మళ్ళీ యుద్ధం వస్తే ఎలా ఆపాలో తమకు తెలుసునన్నారు.
ఒకవైపు మధ్యవర్తులద్వారా శాంతి యత్నాలు జరుగుతున్నట్లు సంకేతాలు వస్తున్నప్పటికీ,మరోవైపు ప్రత్యక్షంగా ఇరు దేశాలమధ్య యుద్ధ హెచ్చరికలు కొనసాగుతున్నాయి.దీంతో ''సూపర్ డేంజరస్ వార్''కు కౌంట్‌డౌన్ ప్రారంభమైందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ దశలో ప్రామాణిక బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 118 డాలర్లకు పెరిగిపోయింది.రెండు రోజుల్లో అమెరికా మధ్యంతర ఎన్నికల పోలింగ్ ప్రారంభం కానున్న తరుణంలో ట్రంప్ నుండి ఈ తీవ్ర హెచ్చరిక వెలువడింది.చాలామంది అమెరికన్ ఓటర్లు యుద్ధంపట్ల ట్రంప్ వైఖరిని వ్యతిరేకిస్తున్నారు.ఫిబ్రవరి 28వ తేదీన ఆయన తండ్రినివాసంపై జరిగిన దాడిలో ఆయన భార్యసహా సోదరి,బావ,మేనకోడలు,కన్నతల్లి,తండ్రి ఖమేనీ,ఇతర సైనిక అధికారులు,ప్రముఖులు మరణించారు. అప్పటినుండీ మొజ్తాబా ఖమేనీ అజ్ఞాత ప్రదేశంలో చికిత్సపొందారు. ఆయన రష్యాలో చికిత్స చేయించుకున్నట్లు బలంగా వార్తాలు వెలువడ్డాయి. ఆ తర్వాత ఇరాన్‌లోని రష్యా రాయబారి కూడా మొజ్తాబా ఖమేనీ ఇరాన్‌లో ఉన్నారని ధృవీకరించారు. బాహ్య ప్రపంచానికి కనిపించకపోయినప్పటికీ అనేక సందర్భాలలో మొజ్తాబా ఖమేనీ లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేస్తున్నారు.
ఇదిలా ఉండగా హోర్ముజ్ జలసంధిలో మరో నాలుగు సరుకు రవాణా నౌకలు సముద్ర మందుపాతరలను ఢీకొని ధ్వంసమై కాలిపోయినట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఆధిపత్యాన్ని అంగీకరించాలని,దొడ్డిదారిన నౌకలను నడిపించే ఆలోచనలను విరమించుకోవాలని,ఐఆర్‌జిసి సమన్వయంతో నౌకలన్నీ జలసంధి దాటి వెళ్ళాలని మరోసారి ఆదేశించింది.ఇంకోవైపు హౌతీ తిరుగుబాటు సైన్యాలు సౌదీఅరేబియా మౌలిక సదుపాయాలపై దాడులు కొనసాగిస్తున్నాయి. రాజభవనాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తామని హౌతీలు ప్రకటించారు.

జర్మనీ ప్రదర్శనల్లో లూటీలు, హింస

ఫ్రాన్స్‌లో శాంతియుతంగా ప్రదర్శనలు



పారిస్: జీవన వ్యయాల పెరుగుదలకు వ్యతిరేకంగా జర్మనీలో శనివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ప్రారంభమైన నిరసన ప్రదర్శనలు క్రమంగా హింసాత్మకరూపం దాల్చాయి. జర్మనీ ఆర్థిక రాజధాని ఫ్రాంక్‌ఫర్ట్‌సహా బెర్లిన్, కొలోన్, హాంబర్గ్ నగరాలలో ముసుగులు ధరించిన అల్లరి మూకలు లూటీలకు పాల్పడ్డాయి. ఈ సందర్భంగా వందలమందిని పోలీసులు అరెస్టు చేశారు. జర్మనీలోని 34 నగరాలలో 1,70,000 మంది వీధుల్లోకి వచ్చారు. జెన్ డెన్ రెగెల్ట్(మా భవిష్యత్తు బాధ్యత మాదే) అనే బృందం ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనలు జరిగాయి. అల్లరి మూకలు రాళ్ళు, బాణసంచా, సీసాలు, బాంబులతో దాడులు చేసినట్లు పోలీసులు చెప్పారు. ప్రదర్శకులను చెదరగొట్టేందుకు వాటర్ కెనాన్లను పోలీసులు ఉపయోగించారు. ఫ్రాంక్‌ఫర్ట్‌లో ఒక పెద్ద షాపింగ్ మాల్ వీధిని, ఆ ప్రాంతాన్ని పోలీసులు మూసివేశారు. ఫ్రాంక్‌ఫర్ట్, మ్యూనిచ్, బెర్లిన్‌లలో 18000 మంది ప్రదర్శనల్లో పాల్గొన్నారని పోలీసులు చెప్పారు. జనరేషన్ జెడ్ ఫ్రెగెల్ట్ ప్రతినిధి లీనా ఫ్రెడ్రిక్ మాట్లాడుతూ, శాంతి, స్వేచ్ఛకోసమే తమ పోరాటమని చెప్పారు. ఆరోగ్యం, విద్యావ్యవస్థలకు మెరుగైన కేటాయింపులు చేయడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. కాగా విదేశీ ఉగ్రవాదులు ఈ ఉద్యమాలతో చేతులు కలిపారని అల్లర్లకు ఆజ్యం పోస్తున్నారని పోలీసులు విమర్శించారు. ఎక్కువమంది ముసుగులు ధరించి ప్రదర్శనల్లో పాల్గొన్నారని చెప్పారు. బ్యాట్‌మన్ వేషధారణలో ఉన్న ఒక వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఫ్రాన్స్ తరహాలో శాంతి భద్రతల పరిస్థితులు దిగజారిపోకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని జర్మనీ ప్రభుత్వం పట్టుదలతో ఉంది.
ఇటీవలికాలంలో యూరప్‌లోని యువకులలో తీవ్ర అసంతృప్తి ప్రబలింది. ఫ్రాన్స్, బెల్జియం, ఇటలీ, ఐర్లాండ్, స్పెయిన్, పోర్చుగల్, గ్రీస్, సెర్బియా, ఆల్బేనియా వంటి దేశాలలో ఇటీఈవలికాలంలో హింసాత్మక నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి.ఫ్రాన్స్ రాజధాని పారిస్ సమీపంలోని ఒక స్కూలులో మొదట మౌలిక సదుపాయాల కొరతను వ్యతిరేకిస్తూ ఆందోళన ప్రారంభమైంది. క్రమంగా అది ఉద్ధృతరూపం దాల్చి దేశమంతా వ్యాపించింది. చివరకు ఇతర యూరప్ దేశాలలో కూడా ఉమ్మడిగా జీవన వ్యయాల పెరుగుదలకు వ్యతిరేకంగా, ఆయా దేశాలలో ఇతర డిమాండ్లతో ఈ ప్రదర్శనల జ్వాలలు విస్తరించాయి.
పెరుగుతున్న జీవన వ్యయాలు, బడ్జెట్ కోతలు, విద్యాసదుపాయాలలో పెట్టుబడుల కొరత,నిర్బంధ సైనిక సేవలను వ్యతిరేకిస్తూ జర్మనీలో జెన్ జెడ్ యువకులు నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, ఫ్రాన్స్‌లో వరుసగా మూడో వారాంతపు శనివారం నాడు కూడా 3.20 లక్షలమంది వీధుల్లోకి వచ్చి శాంతియుతంగా నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఒక్క పారిస్ నగరంలోనే 70 వేలమంది ప్రదర్శనలో పాల్గొన్నారు. ఎల్లో వెస్ట్ ప్రదర్శకులు, కార్మిక సంఘాలు,విద్యార్థులు మొదట్లో పెరుగుతున్న జీవన వ్యయాలు, అసమానతల నిర్మూలన వంటి విషయాలపై దృష్టి సారించాయి. ఉద్యమం విస్తరించిన తర్వాత మరింత పౌరస్వేచ్ఛ, ప్రజలకు నిరసన తెలియజేసే హక్కులు కూడా ఉండాలని ప్రదర్శకులు డిమాండ్ చేస్తున్నారు. అక్టోబరు 17వ తేదీన జరిగిన భయంకరమైన హింసాకాండ మళ్ళీ చెలరేగకుండా ముందస్తు చర్యలకు సన్నద్ధమైంది. 70,000 మంది భద్రతాదళాలను మోహరించి సన్నాహాలు చేసినట్లు హోంశాఖామంత్రి ఒక ప్రకటనలో చెప్పారు.

ఫలించిన బంగ్లాదేశ్ వస్త్రకార్మికుల సమ్మె

ఎట్టకేలకు వేతన బోర్డుకు అంగీకారం

ఢాకా: బంగ్లాదేశ్ వస్త్రకార్మికుల సమ్మె ఫలించింది. ప్రభుత్వం వారి సమస్యలు ఆలకించి ఒక వేతన బోర్డు ఏర్పాటు చేసేందుకు అంగీకారం తెలియజేసింది. చాలా తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని, జీవనం చాలా కష్టంగా ఉందని వస్త్రకార్మికులు సమ్మెకు దిగారు. వేతనాలు పెంచాలని కార్మికులు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నారు. చివరకు ప్రభుత్వం వారికోసం వేతనబోర్డు ఏర్పాటు చేయకతప్పలేదు. వస్త్ర కార్మికులు చాలా రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఢాకా—తంగైల్ జాతీయ రహదారిపై ఘాజిపూర్‌లో సమ్మెకు దిగారు. ఆ రహదారిని స్తంభింపజేశారు. నెలకు 30,000 టాకాలు కనీస వేతనం ఇవ్వాలని వారు కోరుతున్నారు. బంగ్లాదేశ్ వస్త్ర పరిశ్రమలో 4000 మంది రిజిస్టర్డ్ కర్మాగారాలు ఉన్నాయి. ఈ కర్మాగారాలలో 40 లక్షలకు పైగా కార్మికులు పనిచేస్తున్నారు. ప్రపంచదేశాలకు వస్త్రాలను ఎగుమతి చేసే దేశాలలో బంగ్లాదేశ్ రెండోస్థానంలో ఉంది. 2025—26 ఆర్థిక సంవత్సరంలో 38.70 బిలియన్ డాలర్లు విలువైన వస్త్రాలను 150 దేశాలకు బంగ్లాదేశ్ ఎగుమతి చేసింది.

హిమపాతంలో చిక్కుకున్న భారత పర్యాటకులు

నేపాల్ భద్రతా సిబ్బంది సహాయ చర్యలు



కాఠ్మండు: నేపాల్ అప్పర్ డోల్పా ప్రాంత హిమపాతంలో ఆరుగురు భారతీయ పర్యాటకులు చిక్కుకున్నారు. వారిని సురక్షితంగా వెలికి తీసుకువచ్చేందుకు సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. నేపాల్‌లోని షే—ఫోక్సుండో జాతీయ ఉద్యానవనం నుండి తిరిగి వస్తున్న సమయంలో ఇద్దరు మహిళలు సహా ఆరుగురు భారతీయ పర్యాటకులు శనివారం మధ్యాహ్నం నుండి చిక్కుకుపోయారు. కాఠ్మండుకు వాయువ్యంగా 300 కి.మీ దూరంలో ఉన్న షే—ఫోక్సుండో గ్రామీణ మున్సిపాలిటీలో ఈ జాతీయ ఉద్యానవనం ఉంది. ఈ ప్రాంతం పూర్తిగా మంచుతోకపబడిపోయి ఉందని డోల్పా జిల్లా ముఖ్య అధికారి జును ధకల్ చెప్పారు. =భద్రతా దళాలు వారిని బయటకు తీసుకువచ్చేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. ఈ గ్రామీణ ప్రాంతంలోని ఉద్యానవనంలో ఉన్న సదస్సు నేపాల్‌లోనే అత్యంత లోతైన సదస్సు. 3,600 మీటర్ల ఎత్తులో ఉన్న ప్రాంతంలో ఏర్పడిన ఈ సరస్సు 145 మీటర్ల లోతు ఉంటుంది. ఆర్మీ హెలికాప్టర్ వస్తోందని, వారిని రక్షిస్తామని, ఎలాంటి భయాలు అవసరం లేదని ధకల్ పిటిఐ వార్తాసంస్థకు చెప్పారు. సుర్ఖేత్‌లో మోహరించిన హెలికాప్టర్ మరమ్మతులకు గురికావడంవల్ల సహాయ ప్రదేశానికి చేరుకోవడంలో జాప్యం జరిగిందని ఆయన చెప్పారు.దీంతో ప్రత్యామ్నా హెలికాప్టర్‌కోసం అన్వేషణ చేస్తున్నారు. గైడ్ హెచ్చరికలు చేసినప్పటికీ కూడా పర్యాటకులు ఆ ప్రదేశం దగ్గరగా వెళ్ళారని అన్నారు. మంచు భారీగా కురుస్తున్నప్పటికీ పర్యాటకులు గైడ్ హెచ్చరికలను నిర్లక్ష్యంచేసి సరస్సు దగ్గరకు వెళ్ళారని, వారు తిరిగి వస్తున్న సమయంలో శనివారం రాత్రినాటికి వారితో సంబంధాలు తెగిపోయాయని జును ధకల్ చెప్పారు.

వాల్‌స్ట్రీట్ జర్నల్‌పై...

ట్రంప్ పరువునష్టం దావా తిరస్కృతి



వాషింగ్టన్: వాల్‌స్ట్రీట్ జర్నల్‌పై డోనాల్డ్ ట్రంప్ వేసిన 10 లక్షల డాలర్ల పరువునష్టం దావా కేసును అమెరికా న్యాయస్థానం కొట్టివేసింది. ఆయన దావాను తిరస్కరించింది. లైంగిక నేరస్థుడు ఎప్‌స్టీన్‌తో 2003 సంవత్సరాలలో ఆయనతో ఎంతో సన్నిహితంగా ఉన్న సమయంలో ఆయనకు ట్రంప్ రాసిన ఒక లేఖను వాల్‌స్ట్రీట్ జర్నల్ ప్రచురించింది. దీనిపై ట్రంప్ పరువునష్టం దావా వేశారు.ఈ మీడియాకు చెందిన మాతృసంస్థ డౌ జోన్స్, దాని అధిపతి రూపర్ట్ మర్డోక్‌లపై ట్రంప్ పరువునష్టం దావా వేశారు. ఈ లేఖలో అభ్యంతరకరమైన భాషను ట్రంప్ ఉపయోగించారు. ఒక మహిళ శరీర ఆకృతిని ఆయన వర్ణిస్తూ లేఖ రాశారు. ఐతే ఈ లేఖ తాను రాయలేదని, తనకు సదరు పత్రిక పరువునష్టం కలిగించిందని ట్రంప్ తన దావాలో పేర్కొన్నారు. పత్రికాస్వేచ్ఛ సంరక్షణకు సంబంధించి సవరించిన నిబంధనలకు ట్రంప్ దాఖలు చేసిన దావా చాలా విరుద్ధంగా ఉందని పేర్కొంటూ న్యాయమూర్తి డారిన్ గేల్స్ ఈ కేసు కొట్టివేశారు. మొదట 20 బిలియన్ డాలర్లు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ట్రంప్ అనుచరులు దావా వేశారు. ఈ దావాను సదరు అదే న్యాయమూర్తి మొదట తిరస్కరించారు. మళ్ళీ రెండోసారి 10 బిలియన్ డాలర్లు పరువునష్టం కోరుతూ దావా వేశారు. దీనిని కూడా న్యాయమూర్తి తిరస్కరించారు.

వదలబోం

(మొదటి పేజీ తరువాయి)

పంపుతామని హెచ్చరించారు. ప్రధాని మోదీ, అమిత్ షాలు చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేశారు. ఢిల్లీ సభకు వచ్చిన అశేష జనవాహినిని చూస్తుంటే, ప్రధాని, హోంమంత్రి, సిఇసిలకు స్పష్టమైన సందేశం వెళ్లినట్లేనని ఆయన అన్నారు. 'మోదీ ఎక్కడికీ వెళ్లరు' అన్న అమిత్ షా వ్యాఖ్యలపై స్పందిస్తూ 'మోదీ పారిపోవాలనుకున్నా తాము వదలబోము' అని కౌంటర్ ఇచ్చారు. దేశంలోని యువత, రైతులు, కార్మికులు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని ముక్తకంఠంతో చాటుతున్నారని రాహుల్ పేర్కొన్నారు.



తన మతం గురించి అడిగితే, దేశ ప్రజల గొంతుకను వినిపించడమే తన మతమని చెప్పారు. ఎంత డబ్బు, పలుకుబడి ఉన్నా రాజ్యాంగం కంటే ఎవరూ గొప్పవారు కాదని రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. దేశంలో కొన్నేళ్లుగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. 'నా మాట వినండి. నేను చెప్పింది ఎప్పుడూ నిజమవుతుంది, కాదా? నేను భారతదేశంలోని ప్రతి పౌరుడికి, ప్రతి యువకుడికి చెబుతున్నాను. జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవి నుంచి తొలగిస్తారు. ఆయన జైలుకు వెళ్తారు. జ్ఞానేశ్ కుమార్ లేకుండా నరేంద్ర మోదీ ప్రధాని అయ్యేవారు కాదు, అమిత్ షా హోం మంత్రి అయ్యేవారు కాదు. మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్‌కుమార్ కలిసి భారీ కుట్రకు పాల్పడ్డారు. వీరు ముగ్గురు కలిసి భారతదేశ ఆత్మ, రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడి చేశారు. జ్ఞానేశ్‌కుమార్ దిగిపోవాలని దేశమంతా పోరాడుతోంది. జ్ఞానేశ్‌కుమార్ చేసిన నేరం ఆయన్ని నిద్ర పోనివ్వట్లేదు. నా దృష్టిలో ప్రతి భారతీయుడి గళం మతం కంటే గొప్పది. మేము మోదీ, అమిత్ షాకు గానీ శత్రువులం కాదు. మోదీ, అమిత్ షా చేస్తున్న ఓటు చోరీపైనే మా పోరాటం. దేశం తిరిగి గాడిలో పడాలంటే జ్ఞానేశ్‌కుమార్ తొలగింపే తొలి అడుగు' అని రాహుల్ ఉద్ఘాటించారు.

పన్నెండేళ్లుగా దేశంలో ఏ వర్గానికైనా మేలు జరిగిందా?

రైతులు, యువత, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. వారి హక్కులను నిరాకరిస్తున్నారని, దేశ సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమై ఉందని ఆరోపించారు. 'పన్నెండేళ్లుగా దేశంలో ఏ వర్గానికైనా మేలు జరిగిందా? యువతకు ఉద్యోగాలు లేవు, రైతులకు ఆదాయం లేదు. అదానీకి అమ్దానీ వస్తే చాలన్నట్లుగా మోదీ పాలన ఉంది. టెలికాం, పోర్టులు, బ్యాంకులు అన్నింటినీ అదానీ చేతిలో పెట్టారు. మోదీ, అమిత్ షా కలిసి దేశాన్ని అదానీకి అమ్ముతున్నారు. కేవలం ఇద్దరు ముగ్గురు వృద్ధి చెంది, మొత్తం వ్యవస్థను తమ ఆధీనంలోకి ఉంచుకునే దేశం మనకొద్దు.' అని రాహుల్ గాంధీ అన్నారు. ఇవిఎంలు ద్వారా, ఓటర్ల జాబితాలో మార్పుల ద్వారా ఓట్లను తారుమారు చేశారని రాహుల్ పేర్కొంటూ, అనేక అసెంబ్లీ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికలలో ఓట్ల దొంగతనం జరిగిందని ఆరోపించారు. 'హిందుస్థాన్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. కొన్నేళ్లుగా దేశంలో ఓటుచోరీ జరుగుతోంది. ఓటుచోరీ, ఈవీఎంల చోరీతోనే బిజెపి విజయం సాధించింది. బెంగాల్, మధ్యప్రదేశ్, హర్యానాలో ఓటుచోరీతోనే బిజెపి గెలిచింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలో ఓటు చోరీ చేసి గెలిచారు. సర్ పేరిట దేశంలో ఏకంగా 13.5 కోట్ల ఓట్లు తొలగించారు. 2024 ఎన్నికల ముందు ఏకంగా 15 శాతం మంది ఓట్లు తొలగించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ యూపీఏ మధ్య ఓట్ల అంతరం 3 శాతం మాత్రమే. సిఇసి జ్ఞానేశ్‌కుమార్‌ను అడ్డుపెట్టుకుని ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారు. జ్ఞానేశ్‌కుమార్ చేసిన నేరం చిన్నది కాదు. దేశ ప్రజలకు ఓటు హక్కు లేకుండా చేశారు. ఓటు ద్వారా ప్రజలు తమ అభిప్రాయం చెప్పే అవకాశం లేకుండా చేశారు' అని రాహుల్ గాంధీ అన్నారు.




మోదీని సాగనంపాలి, రాజ్యాంగాన్ని కాపాడాలి: ఖర్గే

సబిఐ, ఇడిలతో పనిజరగకపోవడంతో బిజెపి ఏకంగా ఎన్నికల సంఘాన్ని వాడుకుంటూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. యువత, మహిళలు, దళితుల ఓట్లను మోదీ, అమిత్ షాలు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జ్ఞానేశ్ కుమార్‌ను అడ్డుపెట్టుకుని బిజెపి ఓట్లు చీల్చుతోందని, ఆయనను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్‌ను మోదీ, అమిత్ షాలు కాపాడుతున్నారని, ఆయన కోసం ఎంతోమందిని జైలులో పెడుతున్నారని ఆరోపించారు. సిఇసిని అడ్డుపెట్టుకునే బిజెపి పలు రాష్ట్రాల ఎన్నికల్లో గెలిచిందని విమర్శించారు. దేశ రాజ్యాంగాన్ని కాపాడేందుకు మోదీని సాగనంపాలని పిలుపునిచ్చిన ఖర్గే, 'మోదీ హఠావో దేశ్ బచావో' అని నినదించారు.



'ప్రజాస్వామ్య హల్దీఘాటి'గా రామ్‌లీలా మైదాన్ : అఖిలేశ్

రామ్‌లీలా మైదాన్ ప్రజల భారీ హాజరుతో 'ప్రజాస్వామ్య హల్దీఘాటి'గా మారిందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ పేర్కొన్నారు. ఇది రాబోయే మార్పుకు సంకేతమని, ఉత్తరప్రదేశ్ ద్వారా కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వారు, అదే మార్గం ద్వారా అధికారం నుండి నిష్క్రమిస్తారని ఆయన స్పష్టం చేశారు. తాము అంగదుడి పాదంలా కదలకుండా నిలబడతామని గొప్పలు చెప్పుకునే వారు, అసలు నిలబడటానికి నేలే లేనప్పుడు ఆ పాదాన్ని ఎక్కడ ఉంచుతారో ఆలోచించుకోవాలని అఖిలేశ్ బిజెపిని ఎద్దేవా చేశారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రస్తావిస్తూ కాశీ (వారణాసి) ప్రజలు 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వాన్ని 'డబుల్ జీరో'గా మార్చేశారని ఆయన వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్‌లో ఓటర్ల జాబితా నుండి పేర్లను తొలగిస్తున్న అంశాన్ని లేవనెత్తుతూ, 'రామ్‌లీలా మైదాన్‌లో ఈ బహిరంగ సభ జరుగుతున్న తరుణంలోనే, ఉత్తరప్రదేశ్‌లో 1.27 లక్షల మంది హిందూ సోదరుల ఓట్లు తొలగించబడ్డాయని తెలిసింది. అంటే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సగటున 31,000 ఓట్లు తగ్గిపోయాయి అని ఆయన పేర్కొన్నారు. తమ ఓటమికి ఇతరులపై నిందలు వేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఒకప్పుడు భారతదేశాన్ని విశ్వగురువుగా మారుస్తామని గొప్పలు చెప్పుకున్న వారు, ఇప్పుడు ఓటర్ల జాబితాలను తారుమారు చేయడంలో నిమగ్నమయ్యారని ఎద్దేవా చేశారు. ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి సిద్ధమయ్యారని, ఈ ఉద్యమం ఉత్తరప్రదేశ్ నుండే మొదలవుతుందని అఖిలేష్ పేర్కొన్నారు.



'సర్'కు బెంగాల్ బాధిత : మమతా బెనర్జీ

బిజెపి ఎన్నికలను తారుమారు చేస్తోందని, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకోవడానికి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను వాడుకుంటోందని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ర్యాలీలో సిజెపి నాయకత్వానికి, జెన్ జెడ్ కార్యకర్తలకు తన మద్దతును ప్రకటించారు. బిజెపితో పోరాడటానికి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి అన్ని ప్రతిపక్ష పార్టీలు, సమాజంలోని అన్ని వర్గాలు ఏకతాటిపైకి రావాలని బెనర్జీ పిలుపునిచ్చారు. సర్ సృష్టించిన పరిస్థితులకు పశ్చిమ బెంగాల్ బాధితురాలిగా మారిందని, తాము వారిని వదిలిపెట్టబోమని, ప్రాణాలకు తెగించి పోరాడతామన్నారు. బెంగాల్‌ను దోచుకున్నారు, కానీ తాము ప్రజాస్వామ్యాన్ని కాపాడి తిరిగి తీసుకువస్తామని ఆమె ఉద్ఘాటించారు. సర్ ప్రక్రియపై విమర్శలు చేస్తూ, బెనర్జీ దానిని 'బిజెపి వంటి పార్టీకి ప్రత్యేక తీవ్ర సహాయం'గా అభివర్ణించారు. బిజెపి వ్యతిరేకంగా అన్ని వర్గాల, రాజకీయ అనుబంధాల ప్రజలు ఏకం కావాలని బెనర్జీ పిలుపునిచ్చారు. 'భారతదేశాన్ని కాపాడండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి. జెన్ జెడ్ యువత, సిజెపికి మేము మీకు చెబుతున్నాము, ఇక్కడ వర్ణ, వర్ణ భేదాలు లేవు. అన్ని కులాలు, అన్ని వర్గాలు, కమ్యూనిస్టులందరూ కలిసి బిజెపిని ఓడించడానికి పోరాడదాం' అని ఆమె అన్నారు.

ఓటర్లు, మోసగాళ్ల మధ్య యుద్ధం: తేజస్వీ యాదవ్


ఓట్ల చోరీకి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాన్ని ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ మహాభారతంతో పోల్చారు. ఇది దేశ ఓటర్లకు, 'మోసగాళ్లకు' మధ్య జరుగుతున్న యుద్ధమని ఆయన అభివర్ణించారు. సాధారణంగా రామ్‌లీలా ప్రదర్శనలకు వేదికయ్యే ఆ మైదానంలో, ఇప్పుడు ప్రతిపక్షాలు ఓట్ల దొంగలకు వ్యతిరేకంగా ఒక మహాభారతాన్ని తలపెట్టాయని ఆయన పేర్కొన్నారు. 'శకుని ఎవరో మీకు తెలుసు కదా. ఇప్పుడు ఆ శకుని తన ఆట ఆడుతున్నాడు, మనం కురుక్షేత్రంలో పోరాడాల్సి ఉంది. శకుని పాచికలు విసిరినప్పుడు, అందులో మోసం చేశాడు. అసలు ఆ శకుని ఎవరో అందరికీ తెలుసు అని తేజస్వీ అన్నారు. 'జ్ఞాను (ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞాను కుమార్) మోదీకి ఒక 'నమూనా' (బంటు). ఆయనపై దేశద్రోహం కేసు నమోదు చేసి జైలుకు పంపాలి, అప్పుడే భవిష్యత్తులో ఎవరూ ప్రజాస్వామ్యాన్ని కాలరాయడానికి సాహసించరు' అని తేజస్వీ యాదవ్ అన్నారు. ప్రస్తుత ప్రభుత్వాన్ని 'దో నంబరీ సర్కార్' (అక్రమాలకు పాల్పడే ప్రభుత్వం) అని పేర్కొన్న ఆయన, ప్రధాని మోదీని 'దస్ నంబరీ పిఎం' (పెద్ద మోసగాడు) అని విమర్శించారు.



తొలగించిన హిందూ ఓటర్లూ పాకిస్థానీలేనా? : ఫరూఖ్ బ్దుల్లా

ఎన్నికల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (సర్) సమయంలో తొలగించబడిన చాలా మంది ఓటర్లు చొరబాటుదారులేనన్న వాదనను నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా ఆదివారం ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్‌లో జాబితాల నుండి తొలగించబడిన హిందూ ఓటర్లు కూడా 'పాకిస్థానీలేనా' అని ఆయన నిలదీశారు. ముస్లింలను పాకిస్థానీలు అని పిలుస్తూ వారి విధేయతను బిజెపి—ఆర్‌ఎస్‌ఎస్‌లు పదేపదే ప్రశ్నిస్తున్నాయని అబ్దుల్లా ఆరోపించారు. వారు కూడా దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారని ఆయన అన్నారు. తాము దేశం కోసం మా రక్తాన్ని ధారపోశాం, ఈ దేశంలోనే జీవించి, దానిని బలోపేతం చేయాలి అని అన్నారు. ఈ ర్యాలీలో పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని హెచ్చరించారు. సర్ ద్వారా చొరబాటుదారులను తొలగిస్తున్నారన్న వాదనలను పరోక్షంగా ప్రస్తావిస్తూ, ఉత్తరప్రదేశ్‌లో కోటి మందికి పైగా హిందూ ఓటర్లను తొలగించారన్న వార్తలపై అబ్దుల్లా ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. 'యుపిలో కోటి మందికి పైగా హిందువులను తొలగించారు. వాళ్లు కూడా పాకిస్థానీలేనా? ఈ సాకును ఇంకెంతకాలం చెబుతారు?' అని ఎన్నికల సంఘంపై ఓటు దొంగతనం ఆరోపణలు చేస్తూ ఆయన ప్రశ్నించారు.

మోదీ దుష్పరిపాలనకు జ్ఞానేశ్ సహకారం: సిపిఐ



మోదీ దుష్పరిపాలనకు జ్ఞానేశ్ కుమార్ సహకరిస్తున్నారని సిపిఐ ఎంపి పిపి సునీర్, జాతీయ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధూ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అన్ని వర్గాల ప్రజలు రోడ్లపైకి వచ్చి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. ప్రజల ఆందోళనలను, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జరుగుతున్న ఉద్యమాల దృష్ట్యా ఆయన వెంటనే దిగిపోవాలని నాయకులు డిమాండ్ చేశారు. రైతులు, యువత, కార్మికులు, సామాన్యుల హక్కుల పరిరక్షణకు ఉద్యమాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.

యువతలో పోరాట స్ఫూర్తి: కదం తొక్కిన ఎర్ర సైన్యం

ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి సుఖ్‌జిందర్ మహేశరి యువతను ఉద్దేశించి కవితాత్మక సందేశం ఇచ్చారు. 'యువ రక్తంలోని వేడికి మంచుతో నిండిన లోయ సైతం కరుగుతుంది. ఈ నిశ్శబ్దం బద్దలవుతుంది. కొత్త దారి ఏర్పడుతుంది' అంటూ యువతలో పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించేలా వ్యాఖ్యానించారు. కాగా, రాంలీలా ర్యాలీలో 10 వేల మందికిపైగా సీపీఐ, ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

'మురసు' (మొదటి పేజీ తరువాయి)

తీవ్ర తుఫాన్‌గా బలపడే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. ఆ తర్వాత ఇది వాయవ్య దిశగా కదులుతూ, నవంబర్ 2 రాత్రి లేదా నవంబర్ 3 తెల్లవారుజామున నెల్లూరు, నర్సాపురం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉంది. అప్పుడు గాలి వేగం గంటకు 100—110 కి.మీ ఉండవచ్చు, గరిష్టంగా 120 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, ఒడిశా ప్రభుత్వం రాష్ట్రంలోని దక్షిణ ప్రాంతంలో హై అలర్ట్ ప్రకటించింది. విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ పూజారి మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా లోతట్టు ప్రాంతాలు, కొండ ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. భువనేశ్వర్‌లోని వాతావరణ కేంద్రం డైరెక్టర్ మనోరమ మొహంతి మాట్లాడుతూ ఈ తుఫాన్ ప్రభావంతో నవంబర్ 2 నుండి ఒడిశాలో వర్షాలు మొదలవుతాయని, నవంబర్ 3, 4 తేదీల్లో వర్షాల తీవ్రత మరింత పెరుగుతుందని చెప్పారు. 'మురసు' అంటే 'యుద్ధ భేరి' అని అర్థం; ఈ తుఫాన్‌కు భారత్ ఈ పేరును సూచించింది. ఈ మురసు ప్రభావంతో నాలుగు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని అధికారులు చెప్తున్నారు. ప్రధానంగా దక్షిణ తెలంగాణ జిల్లాలు మహబూబ్ నగర్, వనపర్తి, నారాయణపేట, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమ, మంగళావారాల్లో కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ, అత్యంత భారీ వర్షాలు నమోదు కానున్న నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా రైతాంగం తీవ్ర అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఆది, సోమవారాల్లో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమ, మంగళవారాల్లో వర్షాల తీవ్రత పెరగనుందన్నారు. ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయన్నారు. గురు, శుక్రవారాల్లో మూడో రోజు అత్యంత తీవ్ర రూపం దాల్చనున్న వర్షాల ప్రభావంతో ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయన్నారు.

తొలగించే యత్నం (మొదటి పేజీ తరువాయి)

'ఓటు బచావో... దేశ్ బచావో' పేరుతో ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో ఆదివారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసం నుంచి ఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం నుంచి తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సిఎంకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులనుద్దేశించి సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ భారతదేశంలోని ప్రతి పౌరుడికీ ఓటు హక్కు కల్పించారని, కాని ఆ ఓటు హక్కును తొలగించేందుకు సిఇసి జ్ఞానేష్ కుమార్‌ను అడ్డుపెట్టుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే 13.50 కోట్ల ఓట్లు తొలగించారని, 20 కోట్ల ఓటర్లను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని, మొత్తం ఓట్లలో 15 నుంచి 20 శాతం ఓట్లు తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. ప్రయోగాత్మకంగా ఓట్ల తొలగింపు ద్వారా బిజెపి ఇప్పటికే బీహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి వచ్చిందని, ఢిల్లీలోనూ మరోసారి అధికారంలోకి రావాలని కుట్రకు పాల్పడుతోందన్నారు. ఈ కుట్రను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్, ఇండియా కూటమి ఆధ్వర్యంలో రాంలీలా మైదాన్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించాలని రాహుల్ గాంధీ నిర్ణయించారని ఆయన వివరించారు. ఈ సభకు తెలంగాణ రాష్ట్రం నుంచి 15వేల మంది వచ్చేలా టిపిసిసి ఆధ్వర్యంలో రైళ్ల ఏర్పాటు చేస్తే,చివరి నిమిషం వరకు నమ్మించి చివరగా ఆ రైళ్లను రద్దు చేసి, తెలంగాణ నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు రాకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. రైళ్లు ఇవ్వకపోయినప్పటికీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా ఢిల్లీ వచ్చారని, నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్‌లు ఆ కార్యకర్తల సంకల్పాన్ని అడ్డుకోలేకపోయారన్నారు. తెలంగాణ బలం ముందు, తెలంగాణ గళం ముందు మోదీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్ తలవంచక తప్పలేదన్నారు. నాడు రావణుడిని ఓడించేందుకు రాముడికి వానర సేన తోడ్పడినట్లుగా నేడు నరేంద్ర మోదీని ఓడించేందుకు కాంగ్రెస్ వానర సైన్యం పోరాడుతుందని, ఇందులో విజయం సాధించే వరకు విశ్రమించబోమని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాంలీలా మైదానంలో కాంగ్రెస్ కార్యకర్తలు తీసుకునే దీక్షతో నరేంద్ర మోదీ గద్దె కూలక తప్పదని, వాళ్లు గుజరాత్ వెళ్లక తప్పదని హెచ్చరించారు. రాంలీలా మైదాన్ లో ఇండియా కూటమి నేతల సందేశాన్ని ప్రతి గ్రామానికి, ఇంటికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సిఎం సూచించారు. కాగా తెలంగాణ భవన్‌లో నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసానికి చేరుకున్నారు. అక్కడి నుంచి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి నాయకులు ఫరూఖ్ అబ్దుల్లా, అఖిలేష్ యాదవ్, మమతా బెనర్జీ, తేజస్వీ యాదవ్, మెహబూబా ముఫ్తీ, సంజయ్ రౌత్ లతో కలిసి ఓపెన్ టాప్ జీపులో రాంలీలా మైదాన్‌కు వెళ్లారు. ర్యాలీలో,అంతకుముందు తెలంగాణ భవన్‌లో కూడా తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సెల్ఫీలు దిగేందుకు, కరచాలనం చేసేందుకు పోటీపడ్డారు.

చివరి టి–20లో భారత్ ఓటమి

న్యూజిలాండ్‌పై
ఇషాన్, శ్రేయస్ అర్ధశతకాలు వృథా

న్యూజిలాండ్‌తో సిరీస్‌ను ఇప్పటికే కైవసం చేసుకున్న టీమిండియాకు ఆఖరి టి–20లో ఓటమి తప్పలేదు. ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ అర్ధ శతకాలతో 191 పరుగులు చేసినా.. టిమ్ సీఫర్ట్ (93), గ్లెన్ ఫిలిప్స్ (65 నాటౌట్) ధాటికి న్యూజిలాండ్ లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. మరో 12 బంతులు మిగిలుండగానే ఏడు వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌ను 3–2తో ముగించింది.

ఇషాన్, శ్రేయస్ అర్ధ శతకాలతో రాణింపు

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. అభిషేక్ శర్మ 1, సంజూ శాంసన్ 4 పరుగులకే ఔటయ్యారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఇద్దరూ దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఇషాన్ కిషన్ 32 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 61 పరుగులు చేశాడు. శ్రేయస్ అయ్యర్ 23 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 50 పరుగులు సాధించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యాన్ని అందించారు. ముఖ్యంగా మైఖేల్ బ్రేస్వెల్ వేసిన పదో ఓవర్లో ఏకంగా 27 పరుగులు రాబట్టారు. దీంతో పది ఓవర్లకు భారత్ 111/2తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. అయితే అర్ధ శతకాల తర్వాత ఇద్దరూ స్వల్ప వ్యవధిలోనే ఔట



యారు. ఇషాన్ కిషన్‌ను బ్లెయిర్ టిక్నర్, శ్రేయస్ అయ్యర్‌ను నాథన్ స్మిత్ పెవిలియన్‌కు పంపించారు. తిలక్ వర్మ 6 పరుగులకే వెనుదిరిగాడు. వరుస వికెట్లు కోల్పోయిన భారత్‌ను నామన్ ధీర్, నితీశ్‌కుమార్‌రెడ్డి ఆదుకున్నారు. నామన్ ధీర్ 23 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 33 పరుగులు చేశాడు. నితీశ్ కుమార్ రెడ్డి 17 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 22 పరుగులు సాధించాడు. చివర్లో భువనేశ్వర్ కుమార్ 6, అర్షదీప్ సింగ్ 1 పరుగు చేశారు. ప్రిన్స్ యాదవ్ ఖాతా తెరవలేదు. దీంతో నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి భారత్ 191 పరుగులకు చేరుకుంది. న్యూజిలాండ్ బౌలర్లలో ఆడమ్ మిల్నే 19 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. బ్లెయిర్ టిక్నర్ 38 పరుగులిచ్చి రెండు వికెట్లు, నాథన్ స్మిత్ 28 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశారు.

సీఫర్ట్ విధ్వంసం.. ఫిలిప్స్ అండ... 192 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఫిన్ అలెన్ 2 పరుగులకే అర్షదీప్ సింగ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత టిమ్ సీఫర్ట్, డారిల్ మిచెల్ భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ముఖ్యంగా సీఫర్ట్ దూకుడుగా ఆడుతూ పరుగుల వరద పారించాడు. 13 పరుగుల వద్ద నామన్ ధీర్ చేతికి చిక్కాల్సిన సీఫర్ట్ క్యాచ్‌ను జారవిడిచాడు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న అతడు భారత బౌలర్లను ఉతికారేశాడు. కేవలం 50 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 93 పరుగులు చేశాడు. సెంచరీకి చేరువైన సమయంలో నితీశ్ కుమార్ రెడ్డి బౌలింగ్‌లో బౌల్ అయ్యాడు. మరోవైపు డారిల్ మిచెల్ కూడా వేగంగా ఆడాడు. 16 బంతుల్లో 29 పరుగులు చేసి వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో అభిషేక్ శర్మకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అప్పటికి న్యూజిలాండ్ స్కోరు 84/2గా ఉంది. మిచెల్ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన గ్లెన్ ఫిలిప్స్.. సీఫర్ట్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. వీరిద్దరూ భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఫిలిప్స్ 38 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 65 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. 15.3వ ఓవర్లో సీఫర్ట్ ఔటైనప్పటికీ.. ఫిలిప్స్ జోరు తగ్గలేదు. చివరి ఓవర్లలో అర్షదీప్ సింగ్ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్లు బాదాడు. అనంతరం భువనేశ్వర్ కుమార్ వేసిన 18వ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టి మ్యాచ్‌ను ముగించాడు. మరోవైపు బీవన్ జాకబ్స్ ఒక పరుగుతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో న్యూజిలాండ్ 17.6 ఓవర్లలో 195/3 స్కోరు చేసి ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో అర్ధ శతకంతో రాణించిన గ్లెన్ ఫిలిప్స్ మరో ఘనత సాధించాడు. ద్వైపాక్షిక టి20 సిరీస్‌లలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. ఈ సిరీస్‌లో మొత్తం 332 పరుగులు సాధించాడు. అంతేకాకుండా నాలుగు అర్ధ శతకాలు నమోదు చేశాడు.

కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో సత్తాచాటిన భారత్
కబడ్డీ జట్లకు టైటిళ్లు

అహ్మదాబాద్ : అరంగేట్ర కామెన్వెల్త్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో కామన్వెల్త్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ 2026 ఫైనల్లో భారత జట్లు అదరగొట్టాయి. తొలి టోర్నీలోనే భారత పురుషుల, మహిళల జట్లు సంపూర్ణ ఆధిపత్యంతో ప్రత్యర్థు





లను చిత్తుగా ఓడించి టైటిళ్లు సొంతం చేసుకున్నాయి. మహిళల విభాగంలో ఓటమెరుగకుండా ఫైనల్ చేరిన భారత్.. 35–15తో ఉగాండాను ఓడించి ట్రోఫీని ముద్దాడింది. సాక్షి.. 10 రైడ్లకు వెళ్లి ఏకంగా తొమ్మిది పాయింట్లు పట్టుకొచ్చి టాప్ స్కోరర్‌గా నిలిచింది. భారత పురుషుల ఫైనల్లో భారత్.. 54–20 తో శ్రీలంకను ఓడించింది. ఆదిత్య షిండే 10 పాయింట్లతో మెరిశాడు.

ఆరోగ్యం

మహమ్మారులపై
అంతులేని నిర్లక్ష్యం

అభివృద్ధి చెందిన దేశాలు మహమ్మారుల నియంత్రణ, వైద్య సేవలు వంటి అంశాలపై అభివృద్ధి చెందుతున్న లేదా పేద దేశాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నట్టు స్పష్టమవుతున్నది. గత నెల న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్య సమితి ఉన్నత స్థాయి సమావేశంలో ఈ విషయం మరోసారి వెలుగుచూసింది. మహమ్మారుల నివారణ, సంసిద్ధత, ప్రతిస్పందన (పిపిపిఆర్)పై ధనిక, పేద దేశాల మధ్య అంతరం ఇంకా కొనసాగుతునే ఉంది. కొవిడ్19 సమయంలో టీకాలు, మందులు, వైద్య పరికరాల పంపిణీలో ధనిక, పేద దేశాల మధ్య ఏర్పడిన అసమానతలను తగ్గించడం ఈ చర్చల ప్రధాన లక్ష్యం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) రూపొందించిన మహమ్మారి ఒప్పందం 2025 మేలో ఆమోదం పొందినప్పటికీ, అమల్లోకి రావడానికి అవసరమైన ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. వ్యాధికారక పదార్థాల ప్రాప్యత, ప్రయోజనాల భాగస్వామ్య వ్యవస్థ (పిఎబిఎస్) అనేది ఈ ఒప్పందంలో కీలకమైనది.వివిధ దేశాలు వైరస్ నమూనాలు, జన్యు



సమాచారాన్ని పంచుకున్నప్పుడు, వాటి ఆధారంగా అభివృద్ధి చేసే టీకాలు, ఔషధాలు, పరీక్షా పరికరాలు కూడా అందరికీ అందుబాటులో ఉండేలా చూడటం దీని ఉద్దేశం. అయితే, ఔషధ తయారీ సంస్థలు ఎంతమేరకు ఉత్పత్తులను కేటాయించాలి, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎలా సరఫరా చేయాలి అనే అంశాలపై ఇప్పటికీ ఏకాభిప్రాయాలు వ్యక్తం కావడం లేదు. ఈ ఒప్పందం ద్వారా మానవులు, జంతువులు, పర్యావరణ ఆరోగ్యాన్ని సమగ్రంగా పర్యవేక్షించడం, వైద్య సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, ఔషధాల సరఫరా వ్యవస్థల బలోపేతం, పేద దేశాలకు ఆర్థిక సహాయం వంటి చర్యలను ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, మేధో సంపత్తి హక్కులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడంలో స్వచ్ఛంద నిబంధనలు, జాతీయ సార్వభౌమాధికారం వంటి అంశాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఒప్పందాన్ని సమర్థంగా అమలు చేయడానికి ఇప్పటికైనా ఐక్యరాజ్య సమితి కృషి చేయాలి. అభివృద్ధి చెందిన దేశాలు సహకరించాలి. లేకపోతే కొవిడ్ వంటి మహమ్మారుల కారణంగా, పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలు మాత్రమేగాక, వాటి వ్యాప్తి కారణంగా అభివృద్ధి చెందిన దేశాలు కూడా ఇబ్బందులను ఎదుర్కోక తప్పదు.



దక్షిణ అర్ధగోళ ఫ్లూ టీకా కోసం
వైరస్ రకాలు ఎంపిక

దక్షిణ అర్ధగోళంలో వచ్చే ఏడాది ఉపయోగించే ఫ్లూ టీకాలో ఏ ఇన్ఫ్లుయెంజా వైరస్ రకాలను చేర్చాలనే అంశంపై అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డిఎ) సలహా కమిటీ సిఫారసు చేసింది. ఇందులో హెచ్1ఎన్1, హెచ్3ఎన్2, ఇన్ఫ్లుయెంజా 'బి' రకాలకు చెందిన వైరస్ స్ట్రెయిన్లను చేర్చాలని సూచించింది. ప్రతి సంవత్సరం ఫ్లూ వైరస్‌లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో, రాబోయే సీజన్‌లో ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉన్న వైరస్ రకాలను అంచనా వేసి టీకా కూర్పును నిర్ణయిస్తారు. దీనివల్ల టీకా వైరస్‌కు వ్యతిరేకంగా మెరుగైన రక్షణ కల్పించే అవకాశం ఉంటుంది. హెచ్1ఎన్1, హెచ్3ఎన్2 అనేవి రెండూ ఇన్ఫ్లుయెంజా 'ఎ' వైరస్‌కు చెందినవి కాగా, ఇన్ఫ్లుయెంజా 'బి' మరో ప్రధాన రకం. దక్షిణ అర్ధగోళంలో ఫ్లూ సీజన్ సాధారణంగా ఉత్తర అర్ధగోళంతో భిన్నమైన సమయంలో ఉంటుంది. అందువల్ల అక్కడి పరిస్థితులకు అనుగుణంగా టీకా కూర్పును ప్రత్యేకంగా నిర్ణయిస్తారు. ఈ సిఫారసులు రాబోయే ఫ్లూ సీజన్‌లో వ్యాధి భారాన్ని తగ్గించేందుకు ముందస్తు ప్రజారోగ్య చర్యల్లో భాగంగా ఉంటాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) సైతం ఈ సూచనలను పాటించి, ముందు చర్యలకు సిఫారసు చేస్తుంది.

నిరంతర ఆందోళనతో
మానసిక అలసట



భవిష్యత్తులో ఏమి జరుగుతుందోనని నిరంతరం ఆందోళన చెందడం వల్ల, ప్రస్తుతం జరుగుతున్న విషయాలపై దృష్టి పెట్టడం కష్టమవుతుంది. నిపుణులు చెప్తున్నది ఏమిటంటే, మీ మనస్సు పదేపదే సంభవించవచ్చని భావిం చే సమస్యల గురించి ఆలోచిస్తూ ఉంటే, తక్షణ ప్రమాదం ఏదీ లేకపోయినా మానసిక అలసట, ఒత్తిడి, ఆందోళన పెరగవచ్చు. అంతేకాకుండా, ఏకాగ్రత తగ్గి, రోజువారీ పనులపై దృష్టి సారించడం కూడా కష్టమవుతుంది. 'మైండ్‌ఫుల్‌నెస్' (ప్రస్తుత క్షణంపై అవగాహన), నెమ్మదిగా శ్వాస తీసుకోవడం, భారంగా అనిపించే పనులను చిన్న చిన్న దశలుగా విభజించుకోవడం వంటి అలవాట్లు మీ దృష్టిని తిరిగి వర్తమానంపై కేంద్రీకరించడానికి సహాయపడవచ్చు. భవిష్యత్తులో ఎదురయ్యే ప్రతి సమస్యను ఈ రోజే పరిష్కరించాల్సిన అవసరం లేదు. భవిష్యత్తు గురించి ఆలోచించడం తప్పు కాదు. అయితే, ఇంకా జరగని విషయాల గురించి నిరంతరం ఆందోళన చెందుతూ ప్రస్తుత ప్రశాంతతను కోల్పోవడం సమంజసం కాదు. ప్రస్తుతం మీ చేతుల్లో ఉన్న విషయాలపై దృష్టి పెట్టండి. మీరు మార్చగలిగే వాటిపై శ్రద్ధ చూపుతూ, మీ నియంత్రణలో లేని విషయాలను అంగీకరించడం నేర్చుకోండి. ఇలా చేయడం మీ మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, రోజువారీ జీవితాన్ని మరింత ప్రశాంతంగా, సులభంగా ఎదుర్కోవడానికి తోడ్పడుతుంది. కాబట్టి, రేపటి గురించి ఆలోచిస్తూ ఈ రోజును కోల్పోకండి. భవిష్యత్తు కోసం ప్రణాళికలు వేసుకోండి, కానీ వర్తమానంలో జీవించడం మర్చిపోకండి.

కమ్యూనిస్టు ఉద్యమానికి ఊపిరులూదిన ఖాదర్‌బాబు
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి
కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/పాల్వంచ : యువజన నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా, న్యాయవాదిగా పేదల అభ్యున్నతికి, వారి హక్కుల సాధనకు కృషి చేస్తూ, కమ్యూనిస్టు ఉద్యమానికి ఊపిరిలూదిన గొప్ప వ్యక్తి ఉప్పుశెట్టి ఖాదర్‌బాబు అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా సమితి సభ్యులు, న్యాయవాది, మునిసిపల్ మాజీ కౌన్సిలర్ ఉప్పుశెట్టి ఖాదర్‌బాబు 9వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాల్వంచ రాజీవ్‌గాంధీ కూరగాయల మార్కెట్‌లోని ఖాదర్‌బాబు స్మారక స్థూపానికి పూలమాలలు వేసి, అరుణపతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఎఐఎస్ఎఫ్ నేతగా తన రాజకీయ జీవితాన్ని మొదలు పెట్టి, జిల్లాస్థాయి నేతగా పేదల నాయకుడిగా ఎదిగిన నేత ఖాదర్‌బాబు అన్నారు. తనదైన శైలిలో సమస్యల పట్ల స్పందిస్తూ వాటి పరిష్కారానికి



అనునిత్యం శ్రమించేవాడని తెలిపారు. పాల్వంచ ప్రాంత ప్రజలను కమ్యూనిస్టు ఉద్యమాల వైపు మళ్ళించి పార్టీ విస్తరణకు కీలక పాత్ర పోషించాడని కొనియాడారు. ఖాదర్‌బాబు ఆశయాలను సాధించిన నాడే ఆయనకు ఘనమైన నివాళులర్పించిన వారమవుతామని, నాయకులు, కార్యకర్తలు ఈ బాధ్యతలను స్వీకరించి ఆయన ఆశయాలను సాధించాలని కూనంనేని కోరారు. అనునిత్యం ప్రజలతో మమేకమై, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన వారికే గుర్తింపు ఉంటుందని, వారినే ప్రజలు చిరస్థాయిగా గుర్తుంచుకొంటారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా



స్పష్టం చేశారు. పాల్వంచ గడ్డపై కమ్యూనిస్టు ఉద్యమానికి ఊపిరిలూదిన ఖాదర్‌బాబు మునిసిపల్ కౌన్సిలర్‌గా సేవలందిస్తూ కార్మికుల సంక్షేమానికి, వారి హక్కుల కోసం పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆయన ఆశయ సాధనకు మనమంతా పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు అదుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పోరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, ఎఐఎంసి డైరెక్టర్ వాడె లక్ష్మి, టిడిపి నాయకులు అనంతరాములు, వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వి.పద్మజ, డి.సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు, ప్రజాసంఘాల నాయకులు శనిగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి సునీల్ కుమార్, వైఎస్ గిరి, శెట్టి చేరాలు, ధరావత్ దినేష్, నామా పండు, నవీన్, కాకటి రవీందర్, ఆదినారాయణ, రవి, కిరణ్, నాగేశ్వరరావు, వెంకన్న, ప్రేమ్‌చంద్, ప్రశాంత్, వెంకన్న, రమేష్, కొమురయ్య, అల్లి వెంకటేశ్వర్లు, ఇరుకులపాటి సుధాకర్, అన్నారపు అశోక్, నాగమల్ల సత్యనారాయణ, క్రిష్ణవేణి, దుర్గారావు, ఇరుకు రమేష్, అనిల్‌తో పాటు ఖాదర్‌బాబు అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థి, యువజన పోరాటాలు
పాలకులను ప్రశ్నించేవిగా మారాలి
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు
ఎం.బాలనరసింహ

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : విద్యార్థులు, యువకులు పోరాటాలు కేవలం సమస్యల పరిష్కారానికి పరిమితం కాకుండా పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించే బలమైన ప్రజా ఉద్యమాలుగా మారాలని సిపిఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ పిలుపునిచ్చారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఎఐఎస్ఎఫ్, ఎఐఎస్ఎఫ్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథి హాజరై బాలనరసింహ మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, విద్యాసంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, మహిళా విద్య, హక్కుల పరిరక్షణ కోసం విద్యార్థి, యువజన సంఘాలు ఉద్యమాలను నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండపల్లి రాము, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమ్ కుమార్, రమేష్, మధుగౌడ్, లక్ష్మణ్, బసవరాజ్, రాజశేఖర్, ప్రవీణ్, భరత్, శివ, నరేష్, శ్రీకాంత్, కృష్ణ, ఉదయ్‌కుమార్, పరమేష్, సంతోష్, జగన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు అండ ఎఐటియుసి
సంఘం జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి
హమాలీ కార్మికులు ఎఐటియుసిలో చేరిక

ప్రజాపక్షం/మహబూబాబాద్ : కార్మికులకు అండగా ఎఐటియుసి పని చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు బి.అజయ్ సారథిరెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నాపబండ హమాలీ కార్మికులు సుమారు 30 మంది ఎఐటియుసిలో చేరారు. వారికి అజయ్‌సారథిరెడ్డి ఎఐటియుసి ప్రధానకార్యదర్శి రేషపల్లి నవీన్ కందువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యల కోసం యాజమాన్యాలతో మాట్లాడి రేట్లు పెంచుతామని తెలిపారు. జిల్లా కేంద్రంలో అన్ని రంగాల కార్మికులకు ఏ కష్టం వచ్చినా ఎఐటియుసి అండగా నిలబడిందన్నారు. భవిష్యత్తులో వారి కోసం పోరాటం చేస్తామని, వారి హక్కుల కోసం ఉద్యమిస్తూనే ఉంటామని వారు తెలిపారు. జిల్లా కేంద్రంలో వేలాదిమంది అన్ని రంగాల వర్గాల కార్మికులు ఎఐటియుసిలో చేరుతున్నారని వారికి అండగా ఉంటూ వారి సమస్యలపై ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు వెలుగు శ్రావణ్, మంద శంకర్, తండా శ్రీనాథ్, లక్ష్మీ, నరసమ్మ, జకరయ్య, చెక్కల సోమయ్య, చెక్కల సురేష్ పాల్గొన్నారు. ఎఐటియుసిలో చేరిన వారిలో నాపబండల కార్మికులు దరావత్ భాస్కర్, రవి, నాగరాజు, చందు, భావ్ సింగ్, వెంకన్న, రాందాస్, లింగ్యా, లిన్న, శంకర్ మల్సూర్, రమేష్.భద్రు, మధు భగవాన్ తదితరులు ఉన్నారు.



సాగుకు దూరమైన రైతులకు
తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి
సిపిఐ జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ డిమాండ్



ప్రజాపక్షం/భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లాను పూర్తిస్థాయి కరువు జిల్లాగా ప్రకటించాలని, వర్షాభావ పరిస్థితులతో పంటలు సాగు చేయలేక నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోరిమి రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రావి నారాయణరెడ్డి భవన్‌లో జి.సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన జరిగిన సిపిఐ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలెనినో ప్రభావంతో జిల్లాలోని పలు మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, దీంతో రైతులు వరి సాగు చేయలేని దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని మండలాల్లో నీటి వసతి ఉన్నప్పటికీ ప్రభుత్వం వరి సాగు చేయవద్దని సూచించడంతో అనేకమంది రైతులు పంటలు వేయకుండా తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకుని నష్టపరిహారం చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడంతో పాటు రానున్న కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని, తాగు, సాగు నీటి కొరత ఏర్పడకముందే సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని కోరారు. ఈనెల 6నుంచి కరువు ప్రభావిత మండలాల్లో సిపిఐ బృందం పర్యటించి రైతు సమస్యలు క్షేత్రస్థాయిలో తెలుసుకోనున్నట్లు రాజ్‌కుమార్ వెల్లడించారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో ప్రజా సమస్యలపై సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు, పోరాట కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పైండ్ల శాంతికుమార్, నాయకులు సోతుకు ప్రవీణ్‌కుమార్, క్యాతరాజ్ సతీష్, కొరిమి సుగుణ, కుడుదుల వెంకటేష్, మామిడాల సమ్మిరెడ్డి, పరమాండ్ల రాజయ్య, జి.శ్రీనివాస్, నిమ్మల రాజయ్య, గుంటి చంద్రమౌళి, పన్నాల కుమారస్వామి, తాల్ల పోషం, వేముల శ్రీకాంత్, నేరెళ్ల జోసెఫ్, గోలి లావణ్య పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లాలోని అన్ని మండలాలను
కరువు మండలాలుగా ప్రకటించాలి
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు
కలవేన శంకర్



ప్రజాపక్షం/మంచిర్యాల : జిల్లాలోని మిగతా ఏడు మండలాలను వెంటనే కరువు మండలాలుగా ప్రకటించాలని, నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఇప్పకాయల లింగయ్య అధ్యక్షతన సిపిఐ జిల్లా కార్యవర్గం, మండల, పుర పాలక కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భం గా కలవేన శంకర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక పంటలు పండక రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాలో ఇప్పటికే 11 మండలాలను మధ్యస్థ కరువు ప్రాంతాలుగా ప్రకటించిన ప్రభుత్వం, మిగిలిన ఏడు మండలాలను కూడా కరువు ప్రాంతాలుగా గుర్తించాలని కోరారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగి పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వ్యాపారులు ఈ సంక్షోభాన్ని ఆసరాగా చేసుకుని బియ్యం, ఇతర నిత్యావసరాలను అధిక ధరలకు విక్రయిస్తూ బ్లాక్ మార్కెట్ దందాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన బియ్యం ధరల పట్టికలను మిల్లర్లు, హోలోసేల్, రిటైల్ దుకాణాల ఎదుట తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై తనిఖీలు నిర్వహించి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కరువు సమస్య ల పరిష్కారం కోసం నవంబర్ 3న మందమర్రి మండలంలోని కరువు ప్రాంతాల్లో సిపిఐ జిల్లా బృందం పర్యటించనున్నట్లు తెలిపారు. అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని, ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 10న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కలవేన శంకర్ పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, జోగుల మల్లయ్య, రేగుంట చంద్రశేఖర్, ఖలీందర్ అలీ ఖాన్, చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్, మిట్టపల్లి శ్రీనివాస్, రేగుంట చంద్రకళ, వివిధ మండల, పురపాలక కార్యదర్శులు పాల్గొన్నారు.

39వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ లోగో ఆవిష్కరణ

- హెచ్‌బిఎఫ్ ప్రాంగణానికి రచయిత్రి 'జీలానీ బానో' పేరు
- 320 పుస్తక స్టాళ్ల ఏర్పాటు.. పఠనాసక్తిని పెంపొందించేలా కార్యక్రమాలు: పి.నారాయణ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: 39వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ నిర్వహణకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుక్ ఫెయిర్ లోగోను హెచ్‌బిఎఫ్ సొసైటీ సభ్యులు ఆవిష్కరించారు. తెలంగాణ ప్రభుత్వ భాషా, సాంస్కృతిక శాఖ సహకారంతో ఈసారి పుస్తక ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ బుక్ ఫెయిర్ కార్యదర్శి పి. నారాయణ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌టిఆర్ స్టేడియంలో డిసెంబర్ 18 నుంచి 28 వరకు నిర్వహించే పుస్తక ప్రదర్శనలో సాహితీవేత్తలు, రచయితలు, అనువాదకుల సేవలను గుర్తుచేసేలా ప్రాంగణం, వివిధ వేదికలకు వారి పేర్లను ఖరారు చేసినట్లు వెల్లడించారు. 39వ బుక్ ఫెయిర్ ప్రాంగణానికి ప్రముఖ ఉర్దూ సాహితీవేత్త, కథా, నవలా రచయిత్రి జీలానీ బానో పేరు పెట్టినట్లు తెలిపారు. మహిళలు, పిల్లల హక్కుల కోసం నిరంతరం కృషి చేసిన జీలానీ బానో సాహిత్య సేవలను గుర్తిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆమె రచనలు సామాజిక మార్పుకు దోహదపడేలా ఉంటాయని, పద్మశ్రీతో పాటు పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకున్నారని వివరించారు. అదేవిధంగా సాహిత్య వేదికకు ప్రముఖ రచయిత, అనువాదకుడు ముక్తవరం పార్థసారథి పేరు, పుస్తకావిష్కరణల వేదికకు ప్రముఖ దళిత హక్కుల కార్యకర్త, విద్యావేత్త, రచయిత డా. వై.బి. సత్యనారాయణ పేరు ఖరారు చేసినట్లు చెప్పారు. రైటర్స్ స్టాళ్లకు సదానంద శారద, ఏటుకూరి ప్రసాద్ పేర్లను, మీడియా స్టాళ్లకు తెలిదేవర భానుమూర్తి పేరును కేటాయించినట్లు వెల్లడించారు. హెచ్‌బిఎఫ్ ఉపాధ్యక్షుడు కె.బాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈసారి బుక్ ఫెయిర్‌లో అన్ని విభాగాలు కలిపి సుమారు 320 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నామని, ఇందుకు సంబంధించిన గ్రౌండ్ డిజైన్ ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యనిర్వాహక వర్గ సభ్యులు యాకుబ్ మాట్లాడుతూ పుస్తక ప్రదర్శనలో బాలలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ నేషనల్ బుక్ ట్రస్ట్ (ఎన్‌బిటి)తో కలిసి వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందించేలా ఈ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. సంయుక్త కార్యదర్శి రజని మాట్లాడుతూ బుక్ ఫెయిర్‌లో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో భాగస్వాములు కావాలని కోరుతూ తెలంగాణ సాహిత్య అకాడమీకి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడం, తెలుగు సహా వివిధ భాషల సాహిత్యాన్ని ప్రజలకు చేరువ చేయడం, రచయితలు, ప్రచురణకర్తలు, పాఠకులకు ఒకే వేదిక కల్పించడం బుక్ ఫెయిర్ ప్రధాన ఉద్దేశమని ఆమె వివరించారు. సలహా మండలి సభ్యులు రమా మేల్కొటే, కె.రామచంద్రమూర్తి, మాట్లాడుతూ పుస్తక ప్రియులు, రచయితలు, ప్రచురణకర్తలు, సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని 39వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కోశాధికారి కె.సురేష్, ఉపాధ్యక్షుడు బి.శోభన్‌బాబు, కె.సజయ తదితరులు పాల్గొన్నారు.

జి–20 విదేశాంగమంత్రుల మీట్‌లో విభేదాలు

ఉమ్మడి ప్రకటన లేదు : ఫొటో సెషన్ రద్దు

అట్లాంటా: అమెరికా జార్జియారాష్ట్ర రాజధాని అట్లాంటాలో రెండు రోజుల పాటు జరిగిన జి–20 విదేశాంగమంత్రుల సమావేశం ఎలాం టి ఉమ్మడి ప్రకటనా లేకుండానే శనివారం ముగిసింది. ఉక్రేన్‌పై రష్యా యుద్ధం,ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం,అమెరికా సుం కాలు, దక్షిణ చైనా సముద్రంలో చైనా చర్యలు వంటి విషయాలపై ఈ సమావేశంలో మొదట్లోనే విభేదాలు కనిపించాయి.పలు కీలకమైన ప్రపంచ భద్రతా సమస్యలపై జి–20 విదేశాంగమంత్రు లు ఒక ఏకాభిప్రాయానికి రాలేకపోయారు.దీంతో ఎలాంటి ఉమ్మడి ప్రకటన, తీర్మానం లేకుండానే రెండు రోజుల సమావేశం ముగిసింది. ఈ చర్చల సారాంశాన్ని అమెరికా విదేశీమంత్రి మార్కో రుబియో విడుదల చేయాల్సి ఉంది. ఐతే ఆయన విడుదల చేసిన ప్రకటనలో ఎక్కడా ఉమ్మడి ఒప్పందాల గురించి ప్రస్తావించలేదు. యుద్ధాలు జరుగుతున్నాయి, ఈ యుద్ధాలలో పాల్గొనే దేశాలు కూ డా ఈ సమావేశంలో ఉన్నాయి,అందువల్ల ఒక ఉమ్మడి వైఖరి అవలంబించడం, అంగీకారం రావడం కష్టమేనని రుబియో వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే 20 అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలకు చెందిన దేశాల కూటమిగా ఉన్న జి–20లో ఇంధ నం, నౌకా యానం,ఆహార భద్రత వంటి ప్రాధాన్యతాంశాల జాబితాను రుబి యో ప్రకటన పేర్కొంది. ఎలాంటి ఒప్పందాలను ప్రస్తావించలేదు. ఖనిజరంగ సమస్యలతోపాటు సరఫరా గొలుసు సమస్యల పరిష్కారానికి తాము కలిసి పనిచేస్తున్నామని మీడియా సమావేశంలో రుబియో ప్రకటించారు. మొదటిరోజు సమావేశాలు చాలా ఫలవంతంగా జరిగాయని చెప్పారు. రెండోరోజున ఎర్ర సముద్రం, నల్ల సముద్రం,దక్షిణ చైనా సముద్రాలలో స్వేచ్ఛా నౌకాయానాలపై చర్చ జరిగింది. దీనికి ఆయన సారథ్యం వహించారు. దీనికి ముందుగా ఆయన ఆస్ట్రేలియా, భారత్, జపాన్ విదేశాంగమంత్రులతో చర్చలు జరిపారు. విదేశాంగ మంత్రులకు ఆయన తొలు త విందు ఇచ్చారు. శుక్రవారం నాడు జి–20 విదేశాంగమంత్రుల సంప్రదాయబద్ధమైన ఫో టో షూట్ కార్యక్రమాన్ని కూడా ఆయన రద్దుచేశారు. రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావ్రోవ్‌ను ఈ సంప్రదాయ గ్రూప్ ఫొటోలోకి రాకుండా దూరంగా ఉంచాలని,ఆయన గనుక ఈ ఫొటోలో చేరితే తాము మధ్యలోనే బహిష్కరిస్తామని లే దా వైదొలగుతామని ప్రకటించారు.దీంతో రుబి యో ఈ ఫొటో సెషన్ రద్దుచేయాల్సి వచ్చింది.

మూడు దేశాల విదేశాంగ మంత్రులతో జైశంకర్ చర్చలు

వాషింగ్టన్: పశ్చిమాసియాలో అనిశ్చితి,ఉక్రేన్‌లో యుద్ధ పరిస్థితులు,ద్వైపాక్షిక సంబంధాలు వంటి విషయాలపై రష్యా,పోలెండ్,దక్షిణ కొరియాలకు చెందిన విదేశాంగమంత్రులతో భారత విదేశీ వ్యవహారాలమంత్రి ఎస్.జైశంకర్ వేరువేరుగా సమావేశాలు నిర్వహించారు. జి–20 విదేశాంగమంత్రుల సమావేశం సందర్భంగా అట్లాంటాలో శనివారంనాడు జైశంకర్ వివిధ ఈ మూడు దేశాల విదేశాంగమంత్రులతో వేరువేరుగా సమావేశాలు జరిపారు.ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్టింగ్ పెట్టారు.''రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లోవరోవ్‌తో ఉక్రేన్ వివాదం,గల్ఫ్‌లో పరిస్థితులుతోపాటు బహుళపక్ష ప్రయోజనాలతో కూడిన అనేక అంశాలు,ద్వైపాక్షిక సంబంధాల గురించి చర్చించాను''అని పేర్కొన్నారు.పోలెండ్ ఉప ప్రధానమంత్రి–విదేశాంగమంత్రి రాడోస్లావ్ సికోర్స్కీతో కూడా ఉక్రేన్ వివాదం గురించి ప్రధానంగా చర్చించాను,భారత్–యూరోపియన్ యూనియన్ మధ్య సంబంధాలు,జి–20 దేశాల సంబంధాల గురించి ఆయనతో చర్చించాను,అమెరికా నుండి ఆహ్వానం లభించడంతో ఈ ఏడాది జి–20 సమావేశంలో పోలెండ్ దేశం పూర్తిగా పాల్గొంది,జి–20 పార్లమెంటు సభ్యత్వం పొందే విషయంపై ఆసక్తి కనబరిచింది అని ప్రకటించారు. అదేవిధంగా దక్షిణ కొరియా విదేశాంగ మంత్రి ఛో హ్యూన్‌తో కూడా ద్వైపాక్షిక సహకారం,సంబంధాల గురించి జైశంకర్ చర్చించారు. ఆ తర్వాత విదేశాంగమంత్రులు అందరూ కలిసి మెర్సిడెజ్–బెంజ్ స్టేడియంలో ఫ్లోరిడా గేటర్స్,జార్జియా బుల్‌డాగ్స్ మధ్య జరిగిన కాలేజ్ ఫుట్‌బాల్ మ్యాచ్ తిలకించారు. ఆ తర్వాత అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో సోషల్ మీడియాలో ఒక పోస్టింగ్ పెడుతూ,''నాతోటి విదేశాంగమంత్రులకు అమెరికాలో ప్రామాణికమైన ఫుట్‌బాల్ మ్యాచ్‌ను చూపించడం,వారికి స్వాగతం పలకడం ఆనందంగా ఉంది,నా కుమారుడు ఆంథోనీ ఫ్లోరిడా గేటర్స్‌కు రన్నింగ్ బ్యాక్‌గా ఆడుతున్నాడు'' అని పేర్కొన్నారు.

సర్కారు నిర్లక్ష్యానికి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల బలి!

- ఎన్నాళ్లీ నిరీక్షణ! • సేవలు చేయించుకొని.. బతుకులను బజారుకీడుస్తారా? • ఉద్యోగ భద్రత కోసం ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది పోరుబాట



ప్రజాపక్షం/నిర్మల్ : ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తూ వేలాది మంది ప్రాణాలకు వైద్య సేవ ల భరోసా కల్పిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల జీవితాలు మాత్రం అభద్రతలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వ వైద్య వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తూ దాదాపు రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో పాలకుల నిర్లక్ష్య వైఖరి విమర్శలకు తావిస్తోంది. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని,న్యాయమైన హక్కులను అమలు చేయాలని కోరుతూ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 20వ రోజుకు చేరుకుంది.అయినప్పటికీ తమ డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం వెలువడకపోవడంతో ఉద్యో గుల్లో ఆందోళన, అసహనం పెరుగుతున్నాయి.

రెండు దశాబ్దాల సేవలకు గుర్తింపు ఏదీ?

ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పాత్ర కీలకమైనది. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ తమకు మాత్రం శాశ్వత ఉద్యోగ భద్రత లేకపోవడం దుర దృష్ట కరమని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధుల నిర్వహణలో ఎలాంటి వెనుక దుగు వేయకుండా ప్రజలకు సేవలందిస్తున్న తమ జీవితాల గురించి ప్రభుత్వం ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నిస్తున్నారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చు లు,పెరుగుతున్న నిత్యావసర ధరల మధ్య పరిమిత వేతనాలతో జీవనం సాగించడం భారంగా మారిందని వాపోతున్నారు.

హక్కుల కోసం వినూత్న నిరసన

సమ్మెలో భాగంగా ఉద్యోగులు తమ చేతులపై మెహందీతో డిమాండ్లు రాసుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అనేక రూపాల్లో ఆందోళనలు చేపడుతున్నా స్పందన లేకపోవడం బాధాకరమని పేర్కొంటున్నారు. ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాల్సిన చేతులే నేడు తమ బతుకుల కోసం నిరసనకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవే!

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించి శాశ్వత ఉ ద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. క్రమబద్ధీకరణ జరిగేంతవరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరుతున్నారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, వార్షిక ఇంక్రిమెంట్లు అమలు చేయాలని పట్టుబడుతున్నారు. అదేవిధంగా ఎనిమిది శాతం ప్రో త్సాహకం, ఆరోగ్య బీమా సదుపాయంతో కూడిన ఆరోగ్య కార్డులు అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

హామీలు కాదు.. ఆచరణలో నిర్ణయాలు కావాలి!

ఇరవై రోజులుగా సమ్మె కొనసా గుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని ఉద్యోగులు కోరుతున్నారు. కేవలం హామీలతో కాలయాపన చేయకుండా క్రమబద్ధీకరణ, వేతనాలు, ఉద్యోగ భద్రతపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రజల ఆరోగ్యం కోసం పని చేసే ఉద్యోగుల జీవితాలకే భరోసా లేకపోతే ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతం ఎలా సాధ్యమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఉద్యోగుల సేవలను గుర్తించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.సేవలు అవసరమైనప్పుడు ఉద్యోగులు గుర్తుకొస్తారు.. హక్కులు అడిగినప్పుడు మాత్రం వారి గోడు వినిపించదా? రెండు దశాబ్దాల సేవలకు తగిన గుర్తింపు ఎప్పుడు? ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పోరాటానికి ముగింపు పలికేది ఎప్పుడు? అన్న ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

రీ సర్వేలో నిర్లక్ష్యం..

సర్వేయర్ లైసెన్స్ రద్దు

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియలో భాగంగా కేటాయించిన విధులు ని ర్వర్తించడంలో అలసత్వం ప్రదర్శించిన లైసెన్సుడ్ సర్వేయర్ బాలకృష్ణ లైసెన్స్‌ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సస్పెన్షన్ చేశారు. భూముల రీ సర్వేలో భాగంగా మొదటి దశలో జిల్లాలోని 70 గ్రామాల్లో రీ సర్వే చే యాలని ప్రభుత్వం నిర్ణయించగా షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో రె వెన్యూ అధికారులు, మండల సర్వేయర్లతోపాటు ప్రభుత్వ ఆమోదం పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లు భూముల రీ సర్వే ప్రక్రియలో పాల్గొంటున్నారు. గంభీరావుపేట మండలం కుర్దులింగంపల్లి గ్రామంలో భూముల రీ సర్వే కొనసాగుతుండగా సర్వే కోసం కేటాయించిన లైసెన్స్‌డ్ సర్వేయర్ ఎం.బాలకృష్ణ గత కొన్ని రోజుల నుంచి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ భూ ముల రీ సర్వే ప్రక్రియలో పాల్గొనకుండా గైర్హాజరు కావడం పట్ల జిల్లా కలెక్టర్ సంబంధిత లైసెన్స్‌డ్ సర్వేయర్‌పై చర్యలు తీసుకున్నారు. బాలకృష్ణ లైసెన్స్‌ను సస్పెన్షన్ చేస్తూ ఆదివారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అధికారులు అందరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

వృథాగా తాగునీరు !

ప్రజాపక్షం/మల్యాల: ఓవైపు ఎల్ నినో ప్రభావంతో కరవు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని, ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించాలని ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేస్తోంది. మరోవైపు అధికారుల పర్యవేక్షణ లోపంతో విలువైన తాగునీరు వృథాగా పోతోంది. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటపల్లె సమీపంలోని వాటర్ ట్యాంకు నుంచి ఆదివారం ఉదయం నీరు పెద్దఎత్తున ఓవర్‌ఫ్లో అవుతూ కిందకు ప్రవహించింది. ట్యాంకు నిండిన వెంటనే నీటి సరఫరాను నిలిపివేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి నెలకొంది.

రీల్



13న 'ఇట్లు అర్జున'..

నాగార్జున సమర్పణలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇట్లు అర్జున'. అనీష్ హీరోగా పరిచయం అవుతుండగా, మలయాళ నటి అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్నారు.మహేష్ ఉప్పల ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ ప్రాజెక్ట్‌తో దర్శకుడు వెంకీ కుడుముల నిర్మాతగా కూడా పరిచయం అవుతున్నారు. ఆయన కొత్తగా ప్రారంభించిన వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'ఇట్లు అర్జున' సినిమాను 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ ఆకర్షణీయమైన విజువల్స్‌తో ప్రేక్షకుల దృష్టిని ఆకట్టుకుంటోంది. ఒక భారీ క్యాలెండ్ప హీరో అనీష్, హీరోయిన్ అనస్వర రాజన్ పక్కపక్కనే కూర్చున్నట్లు పోస్టర్‌ను రూపొందించారు. పింక్ అవుట్‌ఫిట్‌లో ఆమె అందంగా కనిపిస్తుండగా, అనీష్ క్యాజువల్, స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. ఈ సినిమా అర్జున్ అనే మూగ యువకుడి చుట్టూ తిరిగే ఓ విభిన్నమైన ప్రేమకథ. అర్జున్ తన జీవితమంతా కీర్తిని మౌనంగా ప్రేమిస్తుంటాడు. అతని ప్రయాణం అనూహ్యమైన మలుపులు తిరుగుతుంది. ప్రేమ, హాస్యం, సాహసం, ఊహించని ట్విస్ట్‌లతో సాగే ఈ కథ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుంది. విభిన్నమైన కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రం భావోద్వేగాలు, వినోదం కలగలిసిన ఆసక్తికరమైన ప్రేమకథగా అలరించనుంది.

'ఐ హేట్ మ్యారేజ్' లివింగ్ టుగెదర్ కపుల్ కథ



సుగి విజయ్, జుప్పీ భద్ర (తొలి పరిచయం) హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'ఐ హేట్ మ్యారేజ్' ఆర్య సినిమా బ్యానర్‌పై మాదం దయానంద్, కార్తిక్ వెంపటి కలిసి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంతో పరమేశ్ రేణుకుంట్ల దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఇటీవల ఈ చిత్రం నుంచి విడుదల చేసిన 'అప్పుడే పెళ్లా' అనే లిరికల్ వీడియోకు అనూహ్యమైన స్పందన వచ్చింది. సోషల్ మీడియాలో ఈ సాంగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. కాగా తాజాగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ప్రేమ, పెళ్లి, కెరీర్‌తో పాటు స్వతంత్రంగా జీవించాలనే నేటితరం ఆలోచనలు, భావజాలాన్ని వాస్తవానికి దగ్గరగా చూపించే ప్రయత్నం ఈ చిత్రం. జీవితంలో యువత ఎదుర్కొనే భావోద్వేగాలు, నిర్ణయాలను సహజంగా ఆవిష్కరించే ప్రయత్నం ఈ చిత్రంలో కనిపించనుంది. ప్రతి యువత ఈ సినిమాలో క్యారెక్టర్స్‌తో కనెక్ట్ అవుతారు. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు కొత్త అనుభూతినిచ్చే ఫ్రెష్ కంటెంట్ మా చిత్రంలో వుంది' అన్నారు. హారిక రాజేందర్, సాహితి కృష్ణ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో పృథ్వీరాజ్, రవివర్మ అద్దూరి,ప్రభావతి, ఆశ్రిత వేముగంటి, లోహిత్ కుమార్, బేబి తమోఘ్న, రాధ రాయసం, లక్ష్మి , జాకీర్, విజయ్ కుమార్, దాసరి పద్మ రేఖ, శ్రీదేవి ఆర్రోజు, మెయిల్ రమేష్, అరుణ్ కుమార్ రెడ్డి, ప్రముఖ నటి ఇందు, అఖండ సుధాకర్ రెడ్డి తదితరులు ఇతర పాత్రల్లో నటించారు.



రామ్ చరణ్ కొత్త సినిమా షూటింగ్ ప్రారంభం

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, మాస్టర్ స్టోరీటెల్లర్ సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ ఘనంగా ప్రారంభమైంది. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, టీ సిరీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా సినిమా హైదరాబాద్‌లో నేడు సంప్రదాయబద్ధంగా జరిగిన పూజా ముహూర్తంతో ప్రారంభమైంది. ఈ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టారు,దిల్ రాజుతో కలిసి స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందజేశారు. టీ–సిరీస్ భూషణ్ కుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. వేడుకకు హాజరైన దర్శకులు తొలి షాట్‌కు దర్శకత్వం వహించారు. రామ్ చరణ్, సుకుమార్ విజయవంతమైన కలయికలో మరో కొత్త అధ్యాయానికి ఈ ప్రారంభోత్సవం నాంది పలికింది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' తెలుగు సినిమాలో ఓ మైలురాయిగా నిలిచింది. కథనం, నటీనటుల పెర్ఫార్మెన్స్‌లో, సాంకేతిక నైపుణ్యంతో ఆ సినిమా ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ కోసం ఈ ఇద్దరూ చేతులు కలపడంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ఈ సినిమాలో తన పాత్ర కోసం రామ్ చరణ్ పూర్తిగా కొత్తగా మారబోతున్నారు. సుకుమార్ ఆయనను మునుపెన్నడూ చూడని విభిన్నమైన అవతార్‌లో చూపించనున్నారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, విజయ ప్రసాద్ బండ్రెడ్డి, భూషణ్ కుమార్ ఈ చిత్రాన్ని పాన్ ఇండియా ప్రేక్షకులను ఆకట్టుకునేలా భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు.

సంక్రాంతికి 'వేట్టువం'



సరికొత్త కథా నేపథ్యాలతో అద్భుతమైన మేకింగ్‌తో ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసే దర్శకుడు పా. రంజిత్ 'వేట్టువం' టైటిల్‌తో మరో భారీ యాక్షన్ చిత్రాన్ని మన ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమాలో ఆర్య, వి.ఆర్. దినేష్, శోభిత ధూళిపాళ్ల, కలైయరాసన్, మైమ్ గోపి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'వేట్టువం' సినిమాను లెర్న్ అండ్ టీచ్ ప్రొడక్షన్, నీలమ్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై ప్రొడ్యూసర్స్ ఎస్. సాయి దేవానంద్, ఎస్. సాయి వెంకటేశ్వరన్, పా.రంజిత్ నిర్మిస్తున్నారు. భారీ పాన్ ఇండియా యాక్షన్ మూవీగా 'వేట్టువం' తెరకెక్కుతోంది. ఈ రోజు మేకర్స్ ఈ సినిమా రిలీజ్ అనౌన్స్‌మెంట్ చేశారు. వచ్చే సంక్రాంతి పండక్కి ఈ సినిమాను వరల్ వైడ్ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో 2027 సంక్రాంతి బాక్సాఫీస్ బరిలో మరో ఇంట్రెస్టింగ్ మూవీ చేరినట్లయింది.'వేట్టువం' సినిమా నేపథ్యాన్ని, పాత్రల స్వభావాలను, ఎంత భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్నారో వివరిస్తూ ఇటీవల రిలీజ్ చేసిన 'వరల్ ఆఫ్ వేట్టువం' వీడియో హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. ఈ వీడియోకు తెలుగులో రానా దగ్గుబాటి, మలయాళంలో సౌబిన్ షాహిర్, కన్నడ వెర్షన్‌కు కిచ్చా సుదీప్, తమిళంలో పా. రంజిత్ వాయిస్ అందించడం క్రేజ్ తీసుకొచ్చింది. విభిన్న సమూహాల మధ్య ఉండే సంఘర్షణలు, పోరాటాలు, ఊహకందని సంఘటనలను ప్రధానాంశంగా తీసుకుని దర్శకుడు పా. రంజిత్ 'వేట్టువం' సినిమాను రూపొందిస్తున్నారు. 'వేట్టువం' పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకులకు ఒక సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించబోతోంది.



రేపు 'ఈఎన్ఈ రిపీట్' ట్రైలర్ రిలీజ్

తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న కల్ట్ సీక్వెల్ 'ఈ ఎన్‌సి రిపీట్'లో విశ్వక్ సేన్, అభినవ్ గోమఠం, వెంకటేష్ కాకుమాను, శ్రీనాథ్ మాగంటి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు . ఎస్ ఒరిజినల్స్, రూట్నోడ్‌సి నిమా బ్యానర్లపై సృజన్ యరబోలు, సం దీప్ నాగిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్ అప్డేట్ ఇచ్చారు. 3న ఈ సిళనిమా ట్రైలర్ విడుదల కానుంది. బాయ్స్ కొత్త మి షన్‌తో తిరిగి వచ్చారు మీ గ్యాంగ్‌తో రెడీ అయిపోండి' & అంటూ మేకర్స్ రిలీజ్ చేసి ట్రైలర్ అనౌన్స్మెంట్ పోస్టర్ ఆకట్టుకుంది. 2018లో విడుదలై కల్ట్ క్లాసిక్‌గా గుర్తింపు తెచ్చుకున్న 'ఈ నగరానికి ఏమై ంది' చిత్రానికి సీక్వెల్‌గా 'ఈఎన్ఈ రిపీట్' రూపొందుతోంది. ఈ సినిమాలో విశ్వక్ సేన్ వివేక్‌గా, అభినవ్ గోమఠం కౌశిక్‌గా, వెంకటేష్ కాకుమాను ఉప్పిగా, శ్రీనాథ్ మాగంటి కార్తీక్‌గా అలరించనున్నారు. తొలి పార్ట్‌లో తమ స్నేహం, కామెడీతో యువ ప్రేక్షకులకు దగ్గరైన ఈ నలుగురి గ్యాంగ్ మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ చిత్రానికి ఏజే ఆరోన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, వివేక్ సాగర్ సంగీతం సమకూరుస్తున్నారు. ఈ సినిమా నవంబర్ 19, న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

'ప్రేమ కథ షురూ'కు చంద్రబోస్ క్లాప్

సకల సమృద్ధిఆరట్స్ పతాకంపై రూపొందుతున్న ప్రొడక్షన్ నంబర్ 1 చిత్రం ఆదివారం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభం అయింది. హీరో రాజీవ్ వర్మ, హీరోయిన్ మలైకా టి. వాసుపాల్ జంటగా నటిస్తున్నారు. ఈ జంటపై క్లాప్ చంద్రబోస్ కొట్టారు. ప్రొడ్యూసర్ కనుమూరి ప్రసాద్ రాజు కెమెరా స్విచ్ ఆన్ చేయగా, చిత్ర దర్శకుడు గౌతమ్ ప్రసాద్ యల్లపు ఫస్ట్ షాట్ డైరెక్షన్ చేశారు. ఈ చిత్రం తొలి షెడ్యూల్ ఈ నెల 12 నుంచి ప్రారంభం కానుంది. ఈ చిత్రంతో గౌతమ్ ప్రసాద్ యల్లపు దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే ను సైతం గౌతమ్ ప్రసాద్ యల్లపు అందిస్తున్నారు. ఈ చిత్రంలో అజయ్ ఘోష్, రాజుకుమార్ కసిరెడ్డి, కుమనన్ అలియాస్ రమణ, జెమిని సురేష్, రమణ భార్గవ్, శివాజీ రాజా, ఆయుషి కీలక పాత్రలు పోషిస్తున్నారు. కనుమూరి ప్రసాద్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఆర్కే సేనాపతి సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఈ నెల 12వ తేదీ నుంచి తొలి షెడ్యూల్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ చిత్రాన్ని నాలుగు షెడ్యూల్స్‌లో ముగించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మిగిలిన షెడ్యూల్స్ కోనసీమ పరిసర ప్రాంతంలో జరుగనున్నాయి. ఇది ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్‌లో జరిగే ప్రేమ కథ చిత్రం, కుటుంబం మొత్తం ఈ చిత్రాన్ని చూసి హాయిగా ఎంజాయ్ చేసే విధంగా దర్శకుడు చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రొడ్యూసర్ కనుమూరి ప్రసాద్ రాజు, కథ స్క్రీన్‌ప్లే దర్శకత్వం: గౌతమ్ ప్రసాద్ యల్లపు. ఆర్ట్ డైరెక్టర్ విఠల్ కోసనం, మ్యూజిక్ అనూప్ రూబెన్స్, ఎడిటర్ జే.పి.





ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యం.. ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయం

ఢిల్లీ ఓటు బచావో-దేశ్ బచావో మహార్యాలీలో నల్లగొండ కాంగ్రెస్ నేతలు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, ఓటు హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ న్యూఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదానంలో ఆదివారం నిర్వహించిన ఓటు బచావో దేశ్ బచావో మహార్యాలీలో నల్లగొండ జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా గౌరవ ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్,భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి తదితరులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఓటు హక్కును పరిరక్షించడం, ప్రజాస్వామ్య విలువలను కాపాడటం,రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు పునాది అని, ఆ హక్కుకు ఎలాంటి విఘాతం కలగకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు జిల్లపల్లి పరమేష్,ఎస్‌పి సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ స్వామి,జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్ రెడ్డి,పోసిరెడ్డి సంతోష్ రెడ్డి, కుకుడాల బాలకృష్ణ, గోపిశెట్టి రాంబాబు,జిల్లా కార్యదర్శి పగిళ్ల రాజు,పళ్ల రవితేజ,సూర ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కేసుల్లో నేర నిరూపణకు సమర్థమైన సమన్వయం కీలకం

నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : కోర్టుల్లో కేసుల విచారణలో నిందితులకు చట్టప్రకారం శిక్షలు పడేలా నేర నిరూపణ శాతాన్ని మరింత పెంచేందుకు కోర్టు డ్యూటీ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ సూచించారు.ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కోర్టు డ్యూటీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసుల విచారణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా దర్యాప్తు అధికారులు,కోర్టు డ్యూటీ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.కేసుల విచారణలో సాక్ష్యాధారాల సమర్పణ, సాక్షుల హాజరు, సమన్లు, వారెంట్ల అమలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి కేసు పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నేర నిరూపణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్ కు చెందిన కోర్టు కానిస్టేబుల్ బొప్పాని సుమన్ కోర్టు విధుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ కేసుల విచారణలో సమన్వయానికి కృషి చేస్తున్నారని అభినందించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్‌పి రమేష్,సీఐలు శ్రీను నాయక్, బీషన్న, సంబంధిత పోలీస్ అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులకు నిరంతరం పోరాటం

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: కార్మికుల హక్కుల సాధనకై ఎఐటియుసి కార్మిక సంఘం నిరంతరంగా పోరాటాలు చేస్తుందని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని గోవిందాపురంలో ఎఐటియుసి అనుబంధ సంఘ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయాన్ని ఆ సంఘం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెట్టి ప్రసాద్ ప్రారంభించి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులకు అండగా ఎఐటియుసి జెండా ఉంటుందని, కార్మికుల పక్షాన నిరంతరం పోరాడుతూ వారి సమస్యల పరిష్కారం కోసం మరిన్ని పోరాటాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మెడలు వంచి మన హక్కుల సాధించుకోవడంలో విజయవంతం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాటికొండ జయరాజు, లింగాల అనిల్, బొప్పన రాజు, జెట్టి ఇశ్రాయేలు, రాము, పసుపులేటి నర్సింహరావు, పాలడుగు రాజు, బొల్లెద్దు జైలు, బెంజిమేన్, ఏసుపాదం, ఏసోబు, మట్టయ్య పాల్గొన్నారు.

శివన్నగూడెం రిజర్వాయర్ వద్ద పాదయాత్ర ప్రారంభం



ప్రజాపక్షం/మర్రిగూడ : మర్రిగూడ మండలం శివన్నగూడెంలోని చెర్ల గూడెం రిజర్వాయర్ వద్ద మూడు రోజుల పాటు సాగే సిపిఐ(ఎం) పాదయాత్రను మాజీ ఎమ్మెల్యే,సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులను పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. దీనిపై సీపీఎం అనేక పోరాటాలు చేస్తూనే ఉందన్నారు. పోరాటాలతో గతంలో సీపీఎం అనేక ప్రాజెక్టులను సాధించిందని గుర్తుచేశారు.ఫ్లోరైడ్ పీడిత మునుగోడు ప్రాంతానికి సాగునీరు, తాగునీరు అందించాలని దీర్ఘకాలిక డిమాండ్ ఉందని, అందుకు డిండి ఎత్తిపోతల ప్రాజెక్టే ఏకైక మార్గమని అన్నారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్,జిల్లా కార్యవర్గ సభ్యులు మాటూరి బాలరాజు,పాలడుగు నాగార్జున,బండా శ్రీశైలం, మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య,నాయకులు మల్లేష్,నేర్లకంటి రామలింగం, రామలింగాచారి పాల్గొన్నారు.

కోహెన్స్ (సువెన్)లో కార్మికుల ప్రాణాలకు రక్షణ కరువు

వరుసగా విష వాయువు లీకేజీలతో మరో కార్మికుడు బలి

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యం



ప్రజాపక్షం/సూర్యాపేట : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వస్త్రాంతండ సమీపంలోని 65వ జాతీయ రహదారిపై ఉన్న కోహెన్స్ (సువెన్) లైఫ్ సైన్స్స్ లిమిటెడ్ పరిశ్రమలో కార్మికుల ప్రాణాలకు రక్షణ కరువైంది. ఇటీవల కాలంలో పరిశ్రమలో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. విషవాయువు (గ్యాస్) లీకేజీతో మరో కార్మికుడు బలయ్యాడు. లాభాపేక్ష తప్ప కార్మికుల ప్రాణాల పట్ల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

పరిశ్రమలోని బ్లాక్ 1లో రెండు రోజుల క్రితం గ్యాస్ లీకేజీ అయ్యి విష వాయువుతో అర్వపల్లి మండలం పర్సాయిపల్లి గ్రామానికి చెందిన పుప్పాల వెంకన్న (41) తీవ్ర అస్వస్థతకు గురికావడంతోపాటు మంటలు చెలరేగగా గాయాల పాలయ్యాడు. ఇది బయటకు పొక్కకుండా పరిశ్రమ నిర్వాహకులు జాగ్రత్త పడ్డారు. యాజమాన్యం మొదట సూర్యాపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్సం కోసం తరలించగా పరిస్థితి విషమించడంతో ఆయనను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వెంకన్న చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఇదే సంఘటనలో మరో నలుగురు కార్మికులకు కూడా అస్వస్థతకు గురికావడంతోపాటు గాయాల పాలైనట్లు తెలిసింది.

పరిశ్రమలో వరుసగా విష వాయువులు లీకేజీ, రియాక్టర్ పేలడంతో అందులో పనిచేసే కార్మికులు బెంబేలెత్తుతున్నారు. గతంలో అనేక మంది ప్రమాదంలో మృతి చెందినా యాజమాన్యం బయటపడకుండా కప్పి పెట్టిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ ఏడాది మార్చిలో ఓ రియాక్టర్ పేలగా ఐదుగురు కార్మికులు గాయాల పాలయ్యారని తోటి కార్మికులు చెబుతున్నారు. మూడు నెలల క్రితం బ్లాక్3లో రియాక్టర్ పేలగా ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. తాజాగా బ్లాక్1లో గ్యాస్ లీకేజీ సంఘటన రెండు రోజుల క్రితం చోటుచేసుకోవడంతో మరో కార్మికుడు మృతి చెందాడు. ప్రమాదం జరిగిన సమయంలో భారీ వర్షం ఉరుములు, మెరుపులు ఉండడంతో కార్మికులను యాజమాన్యం అప్రమత్తం చేయాల్సి ఉన్నా అలాంటివేవి చేయకపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తోటి కార్మికులు చెబుతున్నారు. కనీసం హెచ్చరిక సైరన్ను కూడా ఆ సమయంలో పనిచేయలేదని ప్రచారం చర్చనీయాంశంగా మారింది. యాజమాన్యం నిర్లక్ష్యంతోనే కార్మికుల ప్రాణాలు బలవుతున్నాయని స్పష్టమవుతుంది. లాభాపేక్ష తప్ప కార్మికుల ప్రాణ రక్షణకు పరిశ్రమలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదని కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

తూతూ మంత్రంగా అధికారుల తనిఖీలు...

పరిశ్రమలో తనిఖీలు నిర్వహించాల్సిన సంబంధిత అధికారులు యాజమాన్యం ఇచ్చే ముడుపులకు ఆశపడడంతోనే తరచూ ఈ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలు కూడా లేకపోలేదు. పరిశ్రమ సమీపంలో ఉన్న తండలు, ఆయా గ్రామాల ప్రజలు పరిశ్రమ నుండి ప్రతిరోజు వెలువడుతున్న విషవాయువులతో తాగు, సాగు నీరు కలుషితమవుతున్నాయి. ప్రజలు రోగాల బారిన పడి మృత్యువాత చెందుతున్న సంఘటనలు కోకొల్లలు. అయినా సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. వివిధ రూపాల్లో పరిసర ప్రాంత ప్రజలు మూసివేయాలని ఏండ్ల తరబడి నుండి సుదీర్ఘంగా వారు పోరాటం చేస్తున్నారు. ప్రమాద సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు అధికారులు తూతూ మంత్రంగా తనిఖీ చేసి యాజమాన్యం ఇచ్చే ముడుపులను జేబులో నింపుకొని పోతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పరిశ్రమతో తమ ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసి పాలకులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో చేసేది ఏమిలేక బ్రతుకు ఈడుస్తున్నారు. ఇదిలాఉంటే పరిశ్రమ సమీపంలోని వ్యవసాయ భూములు కాలుష్యానికి గురై పంటలు పండకపోవడంతోపాటు పశుసంపదకు కూడా తీవ్ర నష్టం వాటిల్లుతుంది. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని అయినా పాలకులు పరిశ్రమను మూసివేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



కబడ్డీ క్రీడకు ఎనలేని ఆదరణ

మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీ క్రీడకు ఎనలేని ఆదరణ ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సబ్ జూనియర్ బాలుర కబడ్డీ సెలక్షన్స్‌ను నిర్వహించారు. ఈ ఎంపికలను కౌన్సిలర్ కొణతం రాజేష్ రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి సూర్యాపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లం ప్రభాకర్ రెడ్డి, నామా నరసింహారావు, చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు ఇమామ్, రవీందర్ రెడ్డి, రమేష్ బాబు, ఇంద్రారెడ్డి, కోటి, క్రీడాకారులు పాల్గొన్నారు.

కోహెన్స్ ఫార్మా ఫ్యాక్టరీని శాశ్వతంగా మూసివేయాలి

సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జనావాసాల మధ్య ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా తమ ఉత్పత్తిని కొనసాగిస్తున్న కోహెన్స్ ఫార్మా ఫ్యాక్టరీని జనావాసాలకు దూరంగా తరలించాలని లేదా శాశ్వతంగా మూసివేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీలో రియాక్టర్ పేలి ఒక కార్మికుడు చనిపోయిన సందర్భంగా ఆదివారం ఫ్యాక్టరీ గేటు ముందు సిపిఐ, సిపిఐ(ఎంఎల్) పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి మాట్లాడారు. కంపెనీ నాసిరకం మెటీరియల్ దిగుమతి చేసుకొని, తన ఉత్పత్తి కార్యక్రమాలను కొనసాగిస్తున్నందున, రియాక్టర్లు, బాయిలర్స్ పేలిపోయి కార్మికులు ప్రమాదాల అంచున జీవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల పట్ల కనీసం తీసుకోవల్సిన రక్షణ చర్యలు చేపట్టకుండా, తమ ఉత్పత్తిని కొనసాగిస్తూ, లాభార్జనలే ధ్యేయంగా యాజమాన్యం పనిచేస్తుందని, కార్మికుల జీవితాలు, ప్రాణాలు గాల్లో కలిపిపోతున్న యాజమాన్యం తన నిర్లక్ష్య వైఖరిని వీడటం లేదని ఆవేదన చెందారు. ఫ్యాక్టరీ వెదజల్లుతున్న కాలుష్యం వలన కార్మికులకే కాకుండా, ఫ్యాక్టరీ చుట్టూరా ఉన్న పేద ప్రజలు అనారోగ్యానికి గురి అవుతున్నారని, ఊపిరితిత్తులు శ్వాసకోశ, కిడ్నీల సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. అంతేకాకుండా భూమి, నీరు, వాతావరణ కాలుష్యం వలన పరిసర ప్రాంత ప్రజల జీవన మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరణాలకు కారణమవుతున్న కోహెన్స్ ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5కోట్లు నష్టపరిహారం చెల్లించాలని, ఫార్మా ఫ్యాక్టరీని శాశ్వతంగా మూసివేయడం లేదా జనావాసాలకు దూరంగా తరలించడం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిఎడల రాబోవు రోజుల్లో పెద్దఎత్తున ఉద్యమాలు కొనసాగించి ఫ్యాక్టరీని మూసివేపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు , 6వ వార్డు కౌన్సిలర్ సునీల్ రెడ్డి, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, పిఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్ కుమార్, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి పేర్ల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన



ప్రజాపక్షం/కోదాడ: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా బాధ్యతయుతమైన పౌరులుగా ఎదగవచ్చని సీనియర్ సివిల్ జడ్జి కె.సురేష్ అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని తేజ టాలెంట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఉద్యోగాలకు వెళ్లే సమయంలో వారి ప్రవర్తన ధృవీకరణ పత్రం, పోలీస్ రికార్డులు అత్యంత కీలకమని తెలిపారు. చిన్న చిన్న తప్పులు, కేసుల్లో చిక్కుకుని పోలీస్ రికార్డులలో పేర్లు నమోదైతే భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఇబ్బందులు ఎదురవుతాయని స్పష్టం చేశారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ఈ సదస్సులో పోక్సో చట్టంతో పాటు వివిధ చట్టాలు, వాటి అమలు, చట్టాలను ఉల్లంఘిస్తే విధించే కఠిన శిక్షలపై విద్యార్థులకు వివరించారు. కోదాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గట్ల నర్సింహారావు అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమంలో తేజ టాలెంట్ అడ్మినిస్ట్రేటర్ రామ్మూర్తి, న్యాయవాదులు కన్న సాబ్, నాగుల్‌పాషా, హుస్సేన్, లీగల్ పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది, పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఎల్‌నినో దెబ్బకు కుదేలైన పత్తి రైతులు

ప్రజాపక్షం/గుండాల: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది పత్తి రైతులు తీవ్ర సంక్షోభంతో మునిగిపోయారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో ఎండల తీవ్రతకు పత్తి పంటల దిగుబడి పూర్తి స్థాయిలో పడిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. పత్తి పంట పెట్టిన నాటి నుండి నేటికి వరకు వర్షాలు లేక మొక్కల ఎదుగుదల లేక పత్తి కాయలు పడకపోవడం, పడిన కాయలకైనా నీరు లేక తక్కువ మోతాదులో పత్తి రావడంతో ఈ ఎడాది ఎకరాకు కేవలం 2 నుండి మూడు క్వింటాళ్ల పత్తి మాత్రమే వచ్చే పరిస్థితులు ఉండడంతో పెట్టిన పెట్టుబడులు కూడా రావడం కష్టంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏదాది కూడా వడ్డీలకు డబ్బులు తీసుకువచ్చి పత్తి పంటలను వేసిన రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సిన వస్తున్నదని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో పరిస్థితిని తెలుకొని వ్యవసాయ అధికారులతో సర్వే నిర్వహించి నష్టపోయిన రైతులను ఆదుకునే విధంగా నష్టపరిహారం అందించాలని రైతులు వేడుకుంటున్నారు.



అధికారపార్టీ ఎమ్మెల్యేనే.. అయినా ప్రతిపక్ష ఎమ్మెల్యేలా!

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆవేదన



ప్రజాపక్షం/చండూరు /గట్టుప్పల: ప్రస్తుత సమాజంలో మంచితనాన్ని ఓర్చుకోలేని పరిస్థితి ఉందని మంచి పేరు ఉంటే శత్రువులు ఎక్కువైతున్నారని , నియోజకవర్గం అభివృద్ధి కోసం అధికార పార్టీలో ఉన్న ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే లాగా కొట్లాడాల్సి వస్తుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవేదనను వ్యక్తం చేశారు. గట్టుప్పల మండల కేంద్రంలో కురువ సంఘానికి చెందిన శ్రీ బీరప్ప గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో మంచితనాన్ని ఓర్చుకోలేని పరిస్థితి ఉందన్నారు. సమాజంలో మంచిపోయి అవినీతి ఎక్కువ అయ్యిందని అన్నారు. నియోజకవర్గంలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వార వయస్సు పై బడిన వారికి ఉచితంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగాలేదని అందుకు కారణం గత బిఆర్‌ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. అభివృద్ధి పేరుమీద ప్రాజెక్టుల పేరుమీద లక్షల కోట్ల అప్పు చేసిన కేసిఆర్ పుణ్యమాఅని వాళ్లు చేసిన అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం బాధ అనుభవిస్తు ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అవినీతి పేరిగిపోయిందని అందుకు పంచాయితీ కార్యదర్శి నుండి చీఫ్ సెక్రటరీ వరకు పైసలు లేనిదే ప్రజలు ఎవరు పనిచేయడం లేదని అన్నారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో శివన్నగూడెం కి ఎక్కడి నుండి నీరు తీసుకురావాలో కూడా డిసైడ్ చేయలేని బిఆర్‌ఎస్ పార్టీ ఈ ప్రాజెక్టుల గురించి మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో మాట్లాడి క్యాబినెట్లో చర్చించి ఏదుల నుండి నీళ్లు తీసుకొస్తున్నాం అని అన్నారు. ఈకార్యక్రమంలో గట్టుప్పల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరమళ్ల శ్రీశైలం , యాదగిరి రెడ్డి, జగన్నాదం ,పలు గ్రామాల సర్పంచ్‌లు , కాంగ్రెస్ పార్టీ నాయకులు , గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎఓయు ద్వారా ఉన్నత విద్యకు విస్తృత అవకాశాలు

డాక్టర్ ధర్మ నాయక్

ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందించే నూతన కోర్సులు

విద్యార్థులు ప్రతి ఆదివారం జరిగే బోధనా తరగతులకు తప్పనిసరిగా హాజరుకావాలి



ప్రజాపక్షం/నల్లగొండ : దూరవిద్య ద్వారా ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (బీఆర్ఏఓయూ) ఎన్నో అవకాశాలను కల్పిస్తోందని యూనివర్సిటీ ఎడ్యుకేషన్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ నోడల్ అధికారి డాక్టర్ బి. ధర్మ నాయక్ అన్నారు. విద్యార్థుల అవసరాలు,ప్రస్తుత ఉద్యోగ,ఉపాధి రంగాల డిమాండ్‌కు అనుగుణంగా యూనివర్సిటీలో నూతన కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు.ఆదివారం నల్లగొండ ప్రాంతీయ సమన్వయ కేంద్రంలో నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థుల కోసం నల్లగొండ ప్రాంతీయ సమన్వయ కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్ బొజ్జ అనిల్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో డాక్టర్ బి. ధర్మ నాయక్ పాల్గొని మాట్లాడారు.యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి బాధ్యతలు స్వీకరించిన అనంతరం దూరవిద్యా విధానంలో అనేక మార్పులు, సంస్కరణలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు బోధనా విధానాన్ని మరింత మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు.ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్ఏఓయూ ప్రవేశాలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తోందని,అడ్మిషన్ల పరంగా అత్యధిక సంఖ్యలో విద్యార్థులు చేరడం సంతోషకరమని అన్నారు. ప్రతి ఆదివారం నిర్వహించే బోధనా తరగతులకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని, అధ్యాపకులు అందించే సూచనలు, సలహాలను పాటిస్తూ పాఠ్యాంశాలను క్రమం తప్పకుండా అభ్యసించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ మహిళా డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ భూక్యా వీరన్న, కౌన్సిలర్లు కృష్ణ రెడ్డి మహేశ్వరీ, పద్మ హరిత, బద్దం మహేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆర్థిక మోసాల పట్ల జాగ్రత్త

ఎస్‌పి కె. నరసింహ

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్ఎం), చైన్ మార్కెటింగ్ పేరుతో జరుగుతున్న ఆర్థిక మోసాల పాట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ సూచించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చనే ఆశతో, సరైన వివరాలు తెలుసుకోకుండా ఇలాంటి పథకాలలో పెట్టుబడులు పెట్టి కష్టార్జిత సంపాదనను కోల్పోవద్దని హెచ్చరించారు. జిల్లాలో కొంత మంది వ్యక్తులు ఎలక్ట్రిక్ బైక్‌లు, మ్యాగ్నెటిక్ పరుపులు, మ్యాజిక్ వాటర్ బాటిళ్లు, మ్యాజిక్ రిస్ట్ బ్యాండ్లు, టూ వీలర్లు, ఫోర్ వీలర్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు తదితర వస్తువుల పేరుతో మల్టీ లెవల్ మార్కెటింగ్ విధానాన్ని ఉపయోగించుకుని ప్రజలను ఆకర్షిస్తున్నట్లు పోలీసు శాఖ దృష్టికి వచ్చిందని తెలిపారు. వస్తువుల అసలు మార్కెట్ విలువ కంటే అధిక ధరలకు విక్రయిస్తూ, వాటిని కొనుగోలు చేస్తే సంస్థలో సభ్యత్వం కల్పిస్తామని, అనంతరం మరో ముగ్గురు కొత్త సభ్యులను చేర్పిస్తే భారీ మొత్తంలో కమీషన్లు వస్తాయని ప్రచారం చేస్తూ ప్రజలను ఆకర్షిస్తున్నారని పేర్కొన్నారు. మరింత మందిని చేర్పించిన కొద్ది ఆదాయం పెరుగుతుందని నమ్మబలుకుతున్నారని తెలిపారు. ప్రారంభంలో కొంతమందికి కమీషన్లు చెల్లించి నమ్మకం కలిగించి, మరింత ఎక్కువ మంది నుంచి డబ్బులు వసూలు చేసిన అనంతరం చెల్లింపులు నిలిపివేయడం, కార్యాలయాలు మూసివేసి నిర్వాహకులు అందుబాటులో లేకుండా పోవడం వంటి పరిణామాలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కొన్ని సంస్థలు ప్రారంభం కాకముందే తమ సంస్థ త్వరలో ప్రారంభమవుతుందని, ముందుగా సభ్యత్వం లేదా డిపాజిట్ చెల్లిస్తే భవిష్యత్తులో భారీ కమీషన్లు వస్తాయని ప్రచారం చేస్తూ డబ్బులు సేకరిస్తున్నట్లు కూడా సమాచారం ఉందని తెలిపారు. సభ్యత్వ రశీదులు, బ్యాంకు లావాదేవీల వివరాలు, వాట్సాప్ సందేశాలు, ప్రచార వీడియోలు, ఇతర ఆధారాలను పోలీసులకు అం దించాలని కోరారు. ఇలాంటి సంస్థల నిర్వాహకులు లేదా అనుమానాస్పద కార్యకలాపాల గురించి సమాచారం తెలిసిన వారు కూడా పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల అప్రమత్తతే ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట, సులభంగా డబ్బు సంపాదించవచ్చనే అత్యాశకు లోనుకాకుండా, మీతోపాటు ఇతరులు కూడా మో సపోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
సోమవారం
02-11-2026
www.prajapaksham.in





ఇండియా రణగర్జన









(మొదటి పేజీ తరువాయి)

జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.అంతకుముందురోజు రాజాజీ మార్గ్ లోని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే నివాసం నెంబర్ టెన్‌లోని లాన్‌లో లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షతన పార్లమెంటును ప్రతిబింబిస్తూ ఏర్పాటు చేసిన సమావేశంలో జ్ఞానేశ్‌కుమార్‌ను అభిశంసిస్తూ ప్రతిపక్ష ఎంపీలు,నాయకులు,పౌర సంఘాల నాయకులు,కార్యకర్తలు అసాధారణరీతిలో ఒక తీర్మానం ఆమోదించారు.

ఎక్కడ చూసిన కార్యకర్తలే

ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ ప్రతిపక్ష ఇండియా కూటమి ఛలో ఢిల్లీ కార్యక్రమం పిలుపులో భాగంగా ఆదివారం రామ్‌లీలా వద్ద భారీ ర్యాలీకి ముందుగా రాజధాని మహానగరంలో ఎక్కడచూసినా వేలాదిమంది వివిధ పార్టీల కార్యకర్తలు గుంపులు గుంపులుగా కనిపించారు.రామ్‌లీలా మైదాన్ సహా ఢిల్లీలోని అనేక కూడళ్ళలో,వివిధ ప్రాంతాలలో పలు పార్టీల కార్యకర్తలు బృందాలు,బృందాలుగా కనిపించారు.మధ్యాహ్నం నుండి ఈ మహార్యాలీ ప్రారంభం కావాల్సి ఉండగా ఉదయం నుండే దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రతిపక్షాలకు చెందిన పలు పార్టీల కార్యకర్తలు నగరంలోని అనేక ప్రాంతాలలో గుమిగూడారు.సీనియర్ నాయకులు,కాంగ్రెస్‌పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ,ఇతర ప్రతిపక్ష నాయకులు మొదట ఖర్గే నివాసంవద్ద కలుసుకుని అక్కడి నుండి ర్యాలీగా రామ్‌లీలా మైదాన్‌కు వెళ్ళారు.మధ్యాహ్నం నాటికి ఢిల్లీ నగరం జనంతో కిటకిటలాడిపోయింది. లక్షలమందితో తలపెట్టిన ర్యాలీ మింటోరోడ్–కన్నాట్‌ప్లేస్ జంక్షన్ నుండి ప్రారంభమై రామ్‌లీలా మైదాన్ వద్ద ముగిసింది.ఈ ర్యాలీలో మోదీ,జ్ఞానేశ్ కుమార్ వ్యతిరేక బ్యానర్లు,ప్లకార్డులతోపాటు త్రివర్ణ పతాకాలు భారీగా కనిపించాయి.రామ్‌లీలా వేదికవద్ద భారీ త్రివర్ణ పతాకం ఏర్పాటు చేశారు.నాయకులు అందరూ మైదానం వరకూ టాపులేని బస్సుల్లో ప్రయాణం చేశారు.వివిధ రకాల నాయకులు,కార్యకర్తలకోసం వివిధ రకాల ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేశారు.త్రాగునీటి సదుపాయాలు, టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. పార్కింగ్ సదుపాయాలను పోలీస్ సహాయంతో ఏర్పాటు చేశారు.ఐతే సభావేదికలవద్ద రాత్రంతా బసచేసే అవకాశాన్ని తిరస్కరించారు.దాదాపు 10 లక్షలమంది ఈ ర్యాలీలో పాల్గొంటారని ఇండియా కూటమి నాయకులు అంచనావేయగా,ఢిల్లీ పోలీసులు మాత్రం 50,000 మంది వస్తారని అంచనావేశారు.4000 మంది పైగా పోలీసులను మోహరించారు.వారితోపాటు సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ దళాలను మోహరించారు.రామ్‌లీలా మైదాన్‌ను 14 జోన్లుగా విభజించారు.200 సిసి టివీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

వామపక్ష పార్టీల నుండి వేలాది మంది

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఆదివారం జరిగిన చరిత్రాత్మకమైన 'ఓట్ బచావో, దేశ్ బచావో' మహా ర్యాలీలో సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐఎంఎల్ తరుపున భారీగా వామపక్ష శ్రేణులు పాల్గొన్నాయి.భారత కమ్యూనిస్టు పార్టీ, ప్రజా సంఘాల తరపున 10,000 మందికిపైగా కార్యకర్తలు ఈ మహార్యాలీలో పాల్గొన్నారు. ఇతర భాగస్వాములతోకలిసి ఈ మహార్యాలీని బ్రహ్మాండంగా విజయవంతం చేశారు. దేశంలో న్యాయబద్ధమైన, అరమరికలు లేని ఎన్నికల వ్యవస్థను సాధించడానికి భారత కమ్యూనిస్టుపార్టీ, ఇండియా కూటమి కట్టుబడి ఉన్నాయి. ఈనాడు సామూహికంగా ఢిల్లీలో ఏకమైన ప్రజా ప్రభంజనం నరేంద్రమోదీ, జ్ఞానేశ్‌కుమార్, అమిత్ షాల అపవిత్ర కలయికకు వ్యతిరేకంగా వ్యక్తం చేసిన ఆగ్రహానికి చిహ్నం. ఈ ఉద్యమం కొనసాగుతుంది. జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుండి వెళ్ళగొట్టే వరకూ ఈ ఉద్యమం కొనసాగుతుందని సిపిఐ ప్రకటనలో పేర్కొంది. ప్రారంభంలో ర్యాలీలో ఇండియా కూటమి తరపున భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా పాల్గొన్నారు. ఐతే స్వల్ప అనారోగ్య సమస్య కారణంగా ఆయన రామ్‌లీలా మైదాన్‌లోనీ ఈ మహార్యాలీలో ప్రసంగించలేకపోయారు. ఈ మహార్యాలీ రామ్‌లీలా మైదాన్ సమీపానికి చేరుకునేసరికి డి.రాజాకు స్వల్ప అనారోగ్య సమస్య వచ్చింది. దీంతో ఆయన ఈ మహార్యాలీలో ప్రసంగించలేకపోయారు. ర్యాలీలో వారందరికీ పార్టీ తరపున ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com